

65 మార్చి
జ్యోతి
75 పైసలు

మార్చి-65



చందమామ వారి

దొరికితే దొంగలు

దర్శకత్వం: పి. సుబ్రహ్మణ్యం + సంగీతం: ఎస్. రాజేశ్వరరావు

నవయుగ



మరియు



జ్యోతి

సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

విడిప్రతి వెల: 75 పైసలు — ఏడాది చందా: 9 రూపాయలు

సంపుటి 3 మార్చి 1965 సంచిక 3

ఇదీ వరస...

ముఖచిత్రం : డి. వి. ఎస్. ప్రొడక్షన్సువారి "మంగమ్మ శపథం"లో

ఎన్. టి. రామారావు, జమున.

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్ : బాపు

సంపాదక వర్గం :

~~నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,~~

వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

తొలిమాట

మొన్నటి జనవరి 26 వ తేదీన ఢిల్లీనుంచి ఒక నినాదం వినబడింది. అది "జైహింద్" అంటారు ఉత్తరాదివారు కాదు, "జై హిందీ" అని మాకు స్పష్టంగా వినబడిందంటారు దక్షిణాది వారు. దీంతో దక్షిణాదిలో హిందీ వ్యతిరేకత ఒక ఉద్యమంగా ప్రారంభమై ఉన్మాదంగా దిగింది; భూకంపంలా, తుపానులా దేశాన్ని ఒక వూపు వూపింది. (9 వ పేజీ)

ఈ సారి మాకు చేరిన ఉత్తరాలలో చాలా భాగం "రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది" బావుందని మెచ్చుకునేవే. బీనా దేవిగారిదే మరొక వజ్రపు తునక "రిబ్బనుముక్క" ఈ సంచికలో చదవండి. (43 వ పేజీ)

"జ్యోతి" పాఠకులను అమితంగా ఆకర్షిస్తున్న సీరియల్ "సెక్రటరీ" కి తక్కువపేజీలు కేటాయిస్తున్నామని పాఠకుల ఫిర్యాదు. మొత్తం సీరియల్ అంతా ఒక సంచికలోనే వేయవలసిందని ఒకరిద్దరి సూచన ఇది ఎలాగూ సాధ్యం కాదు గనుక వచ్చే సంచికనుంచి యింకా ఎక్కువపేజీలు దానికి కేటాయించగలమని మనవి. ఆ లెక్కన జూన్ సంచికతో అది ముగియగలదని మా అంచనా.

వేమూరి రాధాకృష్ణ

మేనేజింగ్ ఎడిటర్ "జ్యోతి".

ఉత్తరాయణం

కన్యాశుల్కం చదివినా, మహాప్రస్థానం చదివినా నాకో విధమైన సంతృప్తి కలుగుతుంది. బీనా దేవిగారి "రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది" అనే కథ అటువంటి సంతృప్తి నిస్తూంది. నావల్ల సెకండ్‌హాండ్‌గా కథ విన్నవాళ్ళు అసలు కథ చదవడానికి "జ్యోతి" కోసం పరిగెడుతున్నారు. ఆ కథ అద్భుతంగా ఉంది. ఈ ప్రాంతాల్లో మంచి అలజడి కలిగించింది.

రాచకొండ విశ్వనాథశాస్త్రి,

విశాఖపట్టణం.

బీనా దేవిగారి "రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది" చాలాబాగుంది. మీరన్నట్లు ఈకథ నాకూ నిజమైన "మాస్టర్‌పీస్" లా కనబడుతున్నది. కొన్ని సాంఘిక, రాజకీయ వాస్తవిక విషయాలను చక్కగా చిత్రించారు. కొన్ని గొప్ప వాక్యాలు రాశారు. మచ్చుకు :

"ఇద్దరూ కాంగ్రెస్‌వాళ్ళైఅయినా ఒకరికొకరు ఎలక్షన్లలో సాయం చేసుకుంటూ స్నేహం వృద్ధి పరుచుకుంటూ వుండేవారు."

"లింగన్న పంతులుకూడా తనకు రెండు ఎకరాల మెట్ట ఉన్నా అయిదెకరాల మాగాణి, డైబెటీసూ ఎక్కడికీ పోకుండా కాపాడుకుంటూ గుట్టుగా కాలక్షేపం చేసే మనిషి."

నిజంగా ఈకథవల్ల తెలుగు కథ శైలిలో ఇకముందు పెద్దమార్పురావడము అసంభవము కాదు. నాకు సాధ్యమైనంత వరకు ఇంగ్లీషులో (ముఖ్యమైన వాక్యాలు పై నుదహరించి నటువంటివి విడవకుండా) అనువదించి నా తమిళ స్నేహితులకు వినిపించి నప్పుడు, వాళ్ళు రచనాశైలి చాలాబాగుందని మెచ్చుకొన్నారు. కథలో ఏమీ కొత్తదనం లేకపోయినా కథసాగిన శైలి చాలా గొప్పగాఉందనిఅన్నారు. మరి "రిబ్బనుముక్క" కొరకు ఎదురు చూస్తుంటాను.

రాజేందర్ పాంపాటి,

కోయంబత్తూరు.

"రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది" కథాసంవిధానం, శైలి, భావం, భావానికి తగ్గ భాష ఒకదాని కొకటి అతుక్కున్నట్లుగా సరిపోయాయి. ఈనాటి సమాజంలో సుఖపడుతున్న అవకాశవాదుల్ని, స్వార్థపరుల్ని రచయిత్రి లింగన్నపంతులు పాత్రలో ఎంతో విపులంగా చిత్రీకరించారు. ప్రత్యేక బహుమతి ఇవ్వతగ్గ కథ. తమరన్నట్లు మాస్టర్ పీస్ గాదు, కాని మాస్టర్ ఆఫ్ మాస్టర్ పీసెస్.

రమేష్‌చంద్ర,

కలకత్తా.

'రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది' నిజంగా ఒక మాస్టర్ పీస్. అత్యంత వాస్తవికంగావుండి ఆ కథ 'జ్యోతి' కే ఒక 'జ్యోతి' గా వెలిగింది. అంత చక్కని కథను వ్రాసినందుకు బీనా దేవిగారిని అభినందిస్తూ, దాని నొక రేడియో నాటికగా మార్చి ప్రసారం చేసేలా ప్రయత్నించమని ఎడిటర్ గారిని కోరుతున్నాను. అలా జరిగిన నాడే ఆ మాస్టర్‌పీస్‌కి తగిన గౌరవాన్ని జ్యోతి కలిగిస్తుందని నా ఉద్దేశం.

ఎస్. వి. జోగారావ్,
తెనాలి.

'రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది' చాల బాగుంది. రాజకీయాలు మనిషిని ఎంత నీచస్థాయికి దిగజార్చుతాయో చక్కగా నిరూపించారు.

ప్రమీల, ఎడ్లపల్లి.

'మనసు-మనుసు' కథ చా...లా బావుంది. రచయిత్రి అభినందనీయులు నిజంగా! అదే సంచికలో బీనా దేవి రచించిన కథ 'రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది' అనే కథలో చివర కొంత మందికి అర్థంకానిపనులు పద్దువేశారు. ఆపద్దులో ఈ క్రింది వాక్యం కూడా చేర్చితే బావుంటుంది. 'కథ చదివిన వాళ్ళకి: ఒక లౌక్యుడి పాత్ర చిత్రించడానికి రచయిత్రి యింత శ్రమ ఎందుకు పడ్డారో... —?'

కుమారి కొమ్మిరెడ్డి జానకి,
ఏలూరు.

'మనసు-మనుసు' అనే మంచి కథలో మనుష్యుల మనస్తత్వాల చిత్రీకరణ అమోఘంగా వుంది. ఈ కథ యీ నెల 'జ్యోతి' కే 'జ్యోతి' వంటిది. రచయిత్రి కె. త్రిపుర "కలానికి" నా హృదయపూర్వక అభినందనలు.

ప్రపం[శ్రీ], అనంతపురం.

ఈ నెల జ్యోతి అట్టమీద ఫోటో చూడగానే నా హృదయం ఆనందంతో నిండింది. ఇంకలోపల 'ఫేస్ వాల్యూ' వ్యాసం చదివిన తరువాత నామనస్సు కొన్ని కోట్లటన్నుల ఆనందంతో నిండింది. నాకు సావిత్రి గారి మీదగల అభిమానం మెండు నిజంగా భగవంతుడు ఆమెకు అంత చక్కటి, ఆకర్షణీయ మయిన కళని యిచ్చినందుకు భగవంతుని సదా కొనియాడుతున్నాను.

రేణుక ఉందుర్తి, విశాఖపట్నం.

'జ్యోతి' వెల 75 పైసలు మాకు చాల తక్కువ అనిపిస్తున్నది. కారణం అంత ఆకర్షణీయముగా వున్నది. జనవరిసంచిక ముఖచిత్రం చూచి చాల ఆనందించాము. శిఖరాలు-సరిహద్దులు సీరియల్ చాల అద్భుతముగా నున్నది. ఈ సీరియల్ చదువుతున్నంతసేపు మమ్ములను మేమే మరచినాము. రచించిన శ్రీ నండూరి పార్థసారథిగారికి మా హృదయపూర్వక వందనములు.

కుమారి యం. గౌరీ దేవి,
కుమారి కౌసల్యా దేవి, చంద్రగిరి.

□□□

హిందీ తెచ్చిన గందరగోళం

"ఇంపొజిషన్ ఆఫ్ హిందీ— ఇంపొజిషన్ ఆఫ్ ఇంగ్లీష్—' ఈ రెండూ లేని "కాంపోజిషన్" ఏదన్నా వుంటే, అదే దేశాన్ని భాషా వివాదంనుంచి గట్టెక్కిస్తుంది అంటారు ఆచార్య వినోబా భావే.


అసలు నిజానికి యెవరం ఆలోచించుకున్నా అంతే అనిపిస్తుంది. కాని, అంత ఆలోచించే తీరిక ఈ మధ్య చాలా మందికి కలగడం లేదేమో—అందుకే ఈ 'గొడవలు', అల్లర్లు, మనుషులను కాల్చడం, మనుషులు నిప్పెట్టుకోవడం—ఏమైతేనేం, ఒక్క వారంరోజులపాటు దేశం యావత్తూ గగ్గోలు పడిపోయింది.

అన్నాళ్ళు జరిగిన స్వాతంత్ర్య సమరంలోగాని, అంత వుధృతంగా సాగిన 1942 నాటి ఆగస్టువిప్లవంలో గాని ఇలా పోలీసు ఇన్‌స్పెక్టర్లను నిలువునా నిప్పెట్టి చంపడం ఎక్కడా జరగలేదు.

విద్యార్థులను అడ్డుపెట్టుకుని వెనకగా రౌడీలు దహనకాండ సాగించడం, పోలీసులు తుపాకులు కాలుస్తుంటే బడి పిల్లలను ముందుకునెట్టి రౌడీలు తప్పుకు పోవడం— ఇలాంటివే ఇంకెన్నో 'రాక్షస కృత్యాలు', భారతీయ చరిత్ర ఎరగని విషయాలు, సభ్యతకు, సహనానికి పేరుపొందిన భారత జాతి గర్హించే విషయాలు.

దక్షిణాదిలో హిందీకి వ్యతిరేకంగా చెలరేగిన ఉద్యమం — కాదు అల్లర్లు—వల్ల పోస్టాఫీసులు తగలబడ్డాయి; రైల్వేస్టేషన్లు ఆహుతి అయిపోయాయి, రైలు ఇంజన్లు పెట్టెలు నిప్పులపాలైనాయి — అంతా నాశనకాండ. పరిస్థితులు అదుపు చెయ్యడానికి సైన్యాలను తరలించారు. అల్లర్లను అణచడానికి పేల్చిన తుపాకి

రాజకీయ వాతావరణం



గుళ్ళకు 60 నిండుప్రాణాలు బలై పోయినాయి—

ఒక్క కేంద్రప్రభుత్వం ఆస్తినష్టం చూచుకుంటేనే కోటిరూపాయలకు మించి వుంది. మిగిలిన నష్టం అంతా యింతా కాదు. దక్షిణదేశంలో పొల్లాచ్చీ, కోయంబత్తూరు, తిరుపూరు, కుమారపాళయం, అలా అనేక పట్టణాలు, మంటలమయం అయినాయి. వారం రోజులపాటు సభ్యతే మంటకలిసిపోయింది.

విద్యార్థులు స్కూళ్ళకు, కాలేజీలకు వెళ్ళడం మాని కొన్ని చోట్ల తగలపెట్టారు.

మదరాసు రాష్ట్రంతోపాటు, కేరళలో కొంతభాగంలో, బెంగళూరులో కూడా అల్లర్లు జరిగాయి. ఆ తరువాత ఆంధ్ర ప్రాంతంలో రాయలసీమకు విస్తృతం అయినాయి. నెల్లూరులో అల్లర్ల సంబంధంగా అరెస్టయినవారితో ఇరవైమంది దక్షిణాదినుంచి అలజడి రెచ్చగొట్టడానికి వచ్చిన తమిళులున్నారుట. నెల్లూరు పోస్ట్ స్టేషన్ కాపాడుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకయ్యను పట్టుకుని కిరసనాయిలు పోసి తగలపెట్టడానికి అల్లరిమూకలు ప్రయత్నిస్తుంటే పోలీసు బలగం తుపాకి కాల్పులు జరిపి కాపాడాల్సి వచ్చింది—

ఏ అల్లర్లు చెయ్యకుండ వున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులను కవ్వించి అలజడికి ప్రేరేపించడానికి మదరాసు విద్యార్థులు పోస్టుద్వారా "గాజులు, పసుపు, కుంకుమ" పంపించారు.

ఎందుకీ అలజడి, ఆవేశం; దౌర్బల్యం — నిజంగానే ఈ ఆందోళన యావత్తూ దౌర్బల్యానికి చిహ్నం. "హిందీని మామీద రుద్దవద్దంటూ," ఈ అలజడి చేసేవారు చేస్తున్న పని యేమిటి? మరో భాషను మరో రూపాన 'రుద్దటం' కాదా?

అందుకే ఆచార్య వినోబాభావే, "హిందీని రుద్దకూడదు; ఇంగ్లీషునూ రుద్దకూడదు... "అంటూ నిరాహార దీక్ష పూనారు.

● ● ●

ఒక్క విషయం నిదానంగా ఆలోచిస్తే, కొన్ని ప్రత్యేకాంశాలు విదితం అవుతాయి. మదరాసులో జరిగిన హిందీవ్యతిరేకోద్యమంలో వినిపించిన ప్రధాన నినాదం "హిందీ ఒళుగై; తమిళ్ వాళుగై'—అంటే, "హిందీ నశించాలి, తమిళం వర్ధిల్లాలి."

—ఈ నినాదాన్ని పరిశీలిస్తే మనకు తెలిసేది—హిందీని అధికార భాష చేసినందువల్ల తమిళానికి హాని కలుగుతుందనే నమ్మకంతో హిందీకి వ్యతిరేకోద్యమం బయలుదేరింది. రాజాజీలాంటి నాయకులు చెప్పే కారణాలు యేమైనప్పటికీ, తమిళనాడులో సామాన్యమానవుడు

హిందీని వ్యతిరేకించడానికి గల కారణం, ఆ భాష తమిళ భాషాభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని. తమిళ్‌నాడులో సామాన్యునికి ముఖ్యంగా కావలసినది తమిళ సంస్కృతిని పునరుద్ధరించడం, తమిళ భాషకు ఒక గొప్ప గౌరవం కలిగించడం; ఇలా బయలుదేరినదే "నాం తమిళ్" ఉద్యమంగాని, "ద్రవిడ నాడ్" ఉద్యమంగాని. "గంగైకొండ చోళన్" చరిత్ర చెబుతూ ఆ పాత్రను శివాజీ గణేశన్ నటిస్తే తమిళనాడ్‌లోని ప్రతివ్యక్తి ఉప్పొంగిపోతాడు. దీనికి ప్రధాన కారణం ఆ చోళరాజు "గంగై కొండు వందాన్" (ఉత్తరాదిని జయించి గంగా జలాన్ని దక్షిణాదికి తెచ్చాడట.)

ప్రభుత్వం భాషా సమస్యను పరిష్కరించే ముందు కొన్ని ముఖ్య విషయాలు గమనించాలి. శ్రీ కామరాజ్ అన్నట్లు హిందీకి వ్యతిరేకోద్యమం మదరాసులో నిన్న మొన్న ప్రారంభమైనది కాదు; 1937 లో రాజగోపాలాచారి ప్రభుత్వం ఆ రాష్ట్రంలో పాఠశాలలలో హిందీ బోధన నిర్బంధం చేసినప్పుడే ప్రారంభమైంది ప్రధాన కారణం, హిందీ వ్యాప్తివల్ల తమిళం నాశనం అవుతుందని.

ఇంగ్లీషుపట్ల వ్యామోహంకాదు తమిళనాడును అలా ఆందోళనకు ప్రేరేపించింది—హిందీ ప్రవేశంవల్ల తమిళానికి నష్టం కలుగుతోందనే భ్రమ.

ఏది యేమైనా ప్రభుత్వ విధానం తేటతెల్లమైంది. హిందీ అధికార భాష అయినప్పటికీ ఇంగ్లీషుకూడా సహభాషగా హిందీ భాషేతరులు కోరుకున్నంతకాలం కొనసాగుతూనే వుంటుంది. ఈ విషయం ఇప్పుడు తేటతెల్లమవడం కొత్తకాదు. నెహ్రూగారు ఈమాటలే హామీగాచెప్పారు. జరగవలసిన విషయమల్లా ఈహామీని శాసనబద్ధం చెయ్యడం. ఈ అదనపు హామీని కోరడానికి కారణం సామాన్య ప్రజలకు ప్రభుత్వం చెప్పే మాటలమీద నమ్మకం లేకపోవడం అనుకుంటాను ...

నమ్మకం లేకపోవడానికి కూడా కారణం లేకపోలేదు. మొన్న జనవరి 26 వ తేదీన, ఆ తరువాత వారంలోను కేంద్రంనుంచి బయలుదేరిన తాఖీదులు కొన్ని హిందీలోనే దక్షిణాదికి వచ్చాయట, వాటికి ఇంగ్లీషు తర్జుమాలుజతపరచలేదు. ఇప్పుడే ఇలా జరుగుతుంటే ముందేంజరగబోతుందో—ప్రభుత్వం ఇచ్చే హామీ యేమిటి, ఆచరణలో జరిగే అవకతవక ఇదేమిటి? అనే సందేహం అందరికీ కలిగింది. అందుకే ఆందోళన ప్రారంభమైంది. చివరికి అల్లరిగా పరిణమించడానికి కారణం కొందరు స్వార్థపరులు, రౌడీమూకలు అనేది వేరే కథ.



ఈరోజు పొల్లాచ్చి వెళ్ళి చూస్తే, కోయంబత్తూరు వెళ్ళి కనుక్కుంటే కొందరిలో "పెద్దలు సాధించలేంది ఈ విద్యార్థులైనా సాధించారు" అనే అవివేకయుతమైన సంతృప్తి కనిపిస్తుంది. భాషా సమస్య విషయంలో కేంద్రమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం రాజీనామా చేస్తే 'తమిళ జాతి ప్రతిష్ఠను' కాపాడినవాడుగా సామాన్యులంతా ఆయన్ను మెచ్చుకున్నారు.

తమిళనాడులో ప్రజాభిప్రాయమే కాదు, అనంతపురంలో పెద్దల అభిప్రాయంకూడా హిందీ ప్రవేశానికి వ్యతిరేకమే. ఆ జిల్లాలో కొందరు లాయర్లు కోర్టులకు వెళ్ళడం మానివేశారు. అనేక ఇతర ప్రదేశాల్లో హిందీకి వ్యతిరేకంగా లాయర్ల సంఘాలు తీర్మానాలు ప్రకటించాయి.

హిందీ దేశభాష, ఇంగ్లీషు పరాయిభాష. ఇంగ్లీషువారు చేసిన పాలనను భారత జాతి తీవ్రంగా వ్యతిరేకించి స్వాతంత్ర్యాన్ని సంపాదించింది. స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా జరిగే రోజుల్లో మహాత్మా గాంధీ ధ్యేయాన్ని అనుసరించి భారత జాతికి రాష్ట్ర భాషగా, హిందీని ఉత్తర దక్షిణాది వారు ఇరువురు అంగీకరించారు. రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్న తరువాత పదిహేనేళ్ళకల్లా హిందీ అధికారభాషగా [illegible] అవ్వాలని తీర్మానిస్తుంటే, 'అబ్బే అంతదాకా ఎందుకు? ఇంకా త్వరలోనే కావాలి' అన్న దక్షిణాదివారు కూడా ఆనాడున్నారు.

కాని ఒక్క పుష్కరం కాలవ్యవధి జరిగే సరికి ఎంత మార్పు! దీనికి బాధ్యులు పూర్తిగా ద్రవిడమున్నేత్ర కజగం మాత్రమే కాదు.

ఇది కొంతవరకూ నిజం. దీనికి తోడుగా—హిందీ ప్రవేశానికి అనుకూల వాతావరణాన్ని ప్రజలలో కలిగించడానికి అటు కాంగ్రెసుపార్టీగాని, ఇటు ప్రభుత్వంగాని సరైన ప్రయత్నాలు చెయ్యలేదనే చెప్పాలి. అలా చేసే కనక వుంటే మాంచెస్టర్‌లో తయారైన గుడ్డలను తగలబెట్టి ఇంగ్లీషు మర్యాదలను ఒకనాడు అంతతీవ్రంగా అసహ్యించుకున్న దక్షిణాదివారు, ఈనాడు ఇంగ్లీషుపట్ల ఇంత వ్యామోహం చూపాల్సిన అవసరం కలిగేదే కాదేమో.

భాషా సమస్య ఉద్యోగాలకు మాత్రమే పరిమితం అయినది కాదు. ఉద్యోగాలకోసమే తమిళనాడు వారు హిందీని అంతగా వ్యతిరేకిస్తున్నారనుకోవడం కూడా భ్రమే అవుతుంది. హిందీలో పరీక్ష పెడితే చాలా మార్లు ప్రథమశ్రేణి పొందినవారు దక్షిణాదివారే.

భారతీయ అధికార భాషగా ఇంగ్లీషు ప్రస్తుతం ఉపయోగపడ్డా యెప్పటికీ అలాగే ఉండిపోతుందనుకోవడంకూడా పొరపాటే.

ఎప్పటికైనా భారతీయ భాషలే భారతీయ అధికార భాషలు అవుతాయి.

దేశంలోని పదునాల్గు భాషలకు సమాన ప్రతిపత్తి కలగాలి. ఆయా రాష్ట్రాలలో ఆయా భాషలు అధికార భాషలు అవాలి.

● ● ●

కైరాన్ హత్య

ఢిల్లీకిపందొమ్మిది మైళ్ళదూరంలో వచ్చేపోయే వాహనాల రద్దీతో నిండిన హైవేలో పట్టపగలు శ్రీ ప్రతాప్‌సింగ్ కైరాన్ దారుణంగా హత్య కావింపబడ్డాడు. హత్య చేసిన నలుగురు 15 మైళ్ళు చేలకడ్డం పడి నడిచి, తాపీగా కోడిగుడ్లు, నారింజలు తింటూ పోలీసుల కన్నుగప్పి మాయమైపోయారు. దేశం మొత్తంమీద కనీవినీ యెరుగని దారుణ హత్య.

ఢిల్లీపోలీసులు, పంజాబు పోలీసులు, కొంత స్పెషల్ సి. ఐ. డి. బృందం కలిసి తీవ్రంగా పరిశోధిస్తున్నా ఇంకా హంతకులు పట్టుబడలేదు. పోలీసు కుక్కలు నేరం జరిగే ప్రదేశానికి నాలుగు గంటలు ఆలస్యంగా చేరడంవల్ల దోషులను పట్టుకొనడంలో 'అడుగుల వాసనను' ఉపయోగించుకోలేక పోయినాయట.

కైరాన్ హంతకులను పట్టుకునేందుకు 'క్లూ'ల కోసం కైరాన్‌కు సంబంధించిన కొన్ని పాతకేసులను పోలీసులు తిరగవేసున్నారుట.

ఏదియేమైనా హంతకులకోసం పోలీసుల పరిశోధన ఇంకా సాగుతూనేవుంది.

శ్రీ ప్రతాప్‌సింగ్ కైరాన్ భారత చరిత్రలో మరువురాని వ్యక్తి. దేశ విభజనతో, అకాలీ ఉద్యమంతో, భాషా వైషమ్యాలతో గిజగిజలాడిన పంజాబ్‌ను 'వెన్ను చరిచి' నిలబెట్టి, అభ్యుదయ పథానికి ఏకోన్ముఖం చేసిన వ్యక్తి. ప్రజాశక్తిని సమీకరించడంలో అద్భుత ప్రజ్ఞను చూపించారాయన. 'షేర్—ఇ—పంజాబ్' అని ప్రజలచేత మన్నన పొందాడు. రాజకీయ వ్యాఖ్యాతలు ఆయన్ని "హ్యూమన్ డైనమో" అన్నారు.

తన కార్యక్రమాలు జరిపించే వేగంలో 'సూటిగా' పోవటంవల్ల కొన్ని సందర్భాలలో ఆయన పనులు 'అన్యాయాలు'గా అనిపించిన మాట కూడా వాస్తవమే. ఏమైనప్పటికీ దేశ రాజకీయ చరిత్రలో శ్రీ కైరాన్ హత్యతో ఒక గొప్ప 'కాంట్రవర్షియల్ ఫిగర్' అంతమైపోయాడు.

ఆయన చేసిన 'చెడ్డపనులను మరిపించి 'మంచి పనులు' ఆయన పేరును భావితరాలకు 'షేర్—ఇ—పంజాబ్'గా గుర్తు చేస్తూనే వుంటాయి.

—అనంతం.

పొగడ్త

ముళ్ళపూడి వెంకటరమణ

చదువులూ, సలహాలూ అంటూ వీడెవడో ఇక్కడ తిష్టెయ్యాలని చూస్తున్నాడు గాని ఈ శషభిషలేం కుదరవని చెప్పు ... అంటూ కుండబద్దలు కొట్టేస్తున్న ముసలాయన్ని చూసి వినయంగా నవ్వి ... తవరేనా నులక అగ్నిహోత్రావధాన్లుగారు. ఈ పట్టున జటిలో తమంతవారు లేరని డిప్టీ కలెక్టరుగారు తరుచు సెలవిస్తూ వుండేవారండి ... అన్నాడు గిరీశం. అగ్నిహోత్రుడు అమాంతం చల్లారి అయిసై పోయాడు. ఆ ఒక్క తస్సాతో గిరీశం కథని చాలాదూరం నడిపాడు.

పొగడ్త మహాత్యం అంతటిది. అది అహంకన్న ఎత్తు. దురాశకన్న చిన్న. దుర్మార్గుడి ఆలోచనకన్నా లోతు. మంచివాని మనసుకన్న విశాలం. అణువంత చిన్నది, బ్రహ్మాండంకన్న పెద్దది. కుటిల రాజనీతికన్న వక్రం. పొగడ్త విశ్వరూపాన్ని దర్శించడం బ్రహ్మాతరం కాదు. వర్ణించడం వేయి నాలుకలున్న ఆదిశేషువు తరంకాదు. దేవతలు, దానవులు, మానవులు–శిశువులు పశువులు పక్షులు అందరూ, అన్నీ దానికి దాసోహం అనక తప్పదు. భగవంతుడితో పనంతా స్తుతితోనే మొదలవుతుంది. తొందరగా పనికాకపోతే, భక్తసులభుడివి అంటూ ఓ తస్సా వేస్తారు.

ఇంద్రజాలం

అహంకార మమకారాలను ఆత్మ



వంచనలో రంగరించి ఉడకేసి ఆహా ఓహోలు పోపువేస్తే హుషారైన పొగడ్త తయారౌతుంది. అక్కడి నుంచి ఆ యా వ్యక్తుల రుచులనుబట్టి పరనింద, పరవంచన, ద్వేషం, హేళన, ఆనందం, అహ్లాదం, దిగులు,అసూయ, స్పర్థ వగైరాలను పాళ్ళప్రకారం కలిపితే మసాలా గుమాయిస్తుంది. చెప్పిన ముడిసరుకులను బట్టి యిది విషమని అనుకోవద్దు.ఒక వేళ చెప్పినా అదే అమృతమని మీరు పురిపెడు పుచ్చుకోక మానరు. ఎందుకంటే యిచ్చేవాడి హృదయాన్నిబట్టి పుచ్చుకునేవాడి బుద్ధినిబట్టి దీని రంగు రుచి ప్రభావం ఫలితం మారుతాయి. ఇచ్చింది విషమైనా, పుచ్చుకోడం చేతనైతే ఔషధం అవుతుంది. కొందరికెంత మేలు చేస్తుందో మరి కొందరికి అంత కీడూ చేస్తుంది. అది అగ్నిలాటిది. అణుశక్తిలాటిది. ఎలా వాడుకుంటామన్నది మన చేతిలో పని. పొగడ్తకి విధిగా కనీసం రెండు శాల్తీలుండాలి. పొగిడేది, పొగిడించుకునేది. చూసి ఆనందించడానికో లేదా కామేశ్వరరావుగారన్నట్టు... నన్ను పొగడలేదనో ఆ వెధవని పొగిడేస్తున్నాడే అనో దుఃఖించడానికో మూడో శాల్తీ పక్కనుంటే మరింత రక్తి కడుతుంది. ఎవరికి? వినేవాడిక్కాదు. నాలుగోవాడికి. పొగిడించుకునేవాడికి జనంవుంటే ఆనందమే కాని, లేకపోయినా దిగులుండదు. గంటలతరబడీ, రోజులతరబడి ఇంకోడి నోట వినగలిగేమాటలు మన గురించిన పొగడ్తలే. ఎంత గొప్ప కథ, కావ్యం, పురాణం అంత రక్తి కట్టవు. అదో ఇంద్రజాలంలాంటిది. ఎదటివాడు మన్ని పొగుడుతున్నాడని తెలిసికూడా, మనం అలా జారిపోయేది యీ పొగడ్తల అగడ్తలో మాత్రమే.

ఉగ్గుపాలతో అలవాటు

భగవంతు డంతటివాడి కిది అలవాటు. కాగా, మనుషుల దేముంది?



మనుషులేకాదు—కాకిబావ? తను గానకోకిలను కానని తెలిసినా నక్కబావ వచ్చి ఒక్కపాట పాడమనేసరికి కాకిబావ పొంగిపోయి సాపాసాలు పట్టుకుని మాంసంముక్క నక్కపాలు చేసుకుంది.

మనం పిల్లలికి యీ కథ చెప్పినప్పుడు ముఖస్తుతివల్ల మోసపోయి కాకిబావ నోటిదగ్గిర కూడు ఎలా పోగొట్టుకుందో తెలియజెప్పం. నక్కబావ ఒక్క మస్కాతో ఎలా కాకిని బోల్తా కొట్టించిందో చెప్తాం. పిల్లలకి పొగడ్తని ఉగ్గుపాలతో అలవాటు చేస్తాం. ఆవదం పెట్టేవేళ అమ్మానాన్న నాయనమ్మ, [illegible]య్య, ఉంటే గింటే తాతయ్య పక్కింటి పిన్నిగారు యావన్మందీ చేరి — బాబూ ఎంత బంగారు తండ్రమ్మా అంటూ బృందగానం చేస్తారు... వీలైతే అల్లవారి పిల్లాడో, తమ్ముడో ఎంత దుర్మార్గుడోకూడా చెప్తారు. ఆ తరువాత అన్నం తినడానికీ, ఎక్కాలు చదవడానికి, ఆడడానికీ పాడడానికి, అల్లరి మానడానికి అన్నిటికీ భయభక్తులను మించి పనిచేసే చిట్కా - నీ అంతవాడు లేడురా అన్న ఒక్కముక్కే. అలా ఎదిగి వాడికి వయసొచ్చేసరికి, వాడు దాన్ని స్వయాన ప్రయోగించడంలో ఆరితేరుతాడు. అందువల్ల పిల్లలికిది విధిగా అలవాటు చెయ్యాలి. అబద్ధాలు చెప్పడం, ఎదటివాడిని ఒడుపుగా పొగడ్డం ఈ రెండు ఈ నాటి జీవితానికి నిత్యావసర వస్తువులు. ఎంత మంచివాళ్ళకూ, గొప్పవాళ్ళకూ కూడా తప్పనిసరి విధులవుతున్నాయి. అందువల్ల పిల్లలు అబద్ధాలు చెబితే కోప్పడకండి, నేర్చుకోనివ్వండి — అని ఇటీవల ఒక అనుభవశాలి అన్నాడు.

భట్రాజయోగం

ఎందుకంటే ప్రశంస అన్నది ఒక పెద్దశాస్త్రం. దానికో వ్యాకరణం, లయ, ఛందస్సు వున్నాయి. శాస్త్రం నేర్చాక ఎవడి మటుకువాడు లలితకళగా అందులో కృషిచెయ్యాలి. చాలా కష్టసాధ్యమైనకళ అది. పూర్వం రాజయోగం తరవాత భట్రాజయోగానికి విలువుండేది. రాజుగారిని నిత్యం పొగిడేవాడు కాబట్టి, వారిదగ్గిర మంత్రికన్న ఎక్కువ పలుకుబడి గలవాడుగా చెల్లేవాడు భట్రాజు. ఇపుడు– ప్రజలు రాజులై, రాజులు మంత్రులై, మంత్రులు మామూలు ప్రజలై, ప్రజలు ఎక్కువై, ప్రపంచం రద్దీ అయిన రోజుల్లో అందరికీ భట్రాజయోగం పట్టింది. ఎవరి అవసరం లేకుండా ఎవరూ బతకలేరన్న సత్యం రుజువై *నోమాన్ ఈజె నైలెండ్ అన్నది మహా కావ్యమైంది. ఆఫ్రికా వాడికి అలమూరువాడికి పరస్పరం అవసరాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ఎదటివాడి గురించి ఓ మంచిమాట అనడం అందరికీ మామూలే.

మాటలు, చేతలు

అయ్యా, మీ మీసాలు బాగున్నాయి. మీ చొక్కా అంతగొప్పది అంత చవగ్గా మీరే కొనగలరు. నాకో పదిరూపాయలు అప్పుకావాలి అంటే ఎదటివాడు దేవుడిలా పొంగి

పోడు. అప్పివ్వడు సరిగదా పాత బాకీ వుంటే వసూలు చేస్తాడు.

పొగడ్త స్థూలంగా రెండువిధాలు. ఒకటి మాటల్ద్వారా పొగడడం. రెండు — చేతల ద్వారా పొగడడం. అంటే వాళ్ళకిష్టమైన పనులు చెయ్యడం, వాళ్ళకి గిట్టనివాళ్ళని తిట్టడం, వాళ్ళలాగే బట్టలు వేసుకోవడం,




వాళ్ళు అనే పదాలే అలవరచుకోవడం వగైరాలు.


మాటలద్వారా చేసే స్తుతి మళ్ళీ రెండురకాలు. ఒకటి స్తుతి; రెండు నిందాస్తుతి—తిడుతూ మెచ్చుకోడం. మొదటిదాంట్లో గుంభన వుంటుంది. గొప్ప గొప్ప కళాకారులు-పొగడ్తగా చేసే ప్రసంగాలు వింటే ఇందులో ఒడుపులు తెలుస్తాయి. "పిన్నిగారూ మీరు మంచివారు, కాస్త కాఫీ పొడుం బదులిస్తారా ?..." అని బయటపడే బదులు, "పిన్నిగారూ, మీ నాగపూరు కప్పుతో నాగపూరు కప్పు దివ్వండి. కప్పుకూడా ఓ సారివ్వండి. మావాడు దాంతోగాని కాఫీ తాగడు" అనో "మావారోసారి చూస్తానన్నా"రనో అంటే కాస్త కాఫీ తాగించి మరీ పంపుతారు పిన్నిగారు.

"అదేనిటోనండీ, మీ యింట్లో కాకరకాయ కూరేనా సరే యెంతిష్టంగా తింటానో ... మా అవిడ చెప్పుతుంది కూడాను ... నేనేం చెయ్యను చెప్పండి. నోటి కేది హితవుగావుంటే ..." అనడం ఒక రకం శిల్పం.

నిందాస్తుతి ఇంతకన్నా శ్రేష్టం... "ఏవండీ, తిడుతున్నానని మీరేమీ అనుకోకండీ—మీ రొట్టి ఫూల్స్. ఎందుకూ పనికిరారు. బొత్తిగా ఇంత మొహమాటం, ఇంత జీవకారుణ్యం అయితే ఎలాగండీ? అందుకే యిలా వున్నారు. ఛీ! ఐ హేట్ యు... ఈ ధోరణిలో ఎన్ని తిట్లు తిట్టినా రాణిస్తాయి. ఎంత తిడితే అంత ప్రేమ. ఆ తరవాత మీరు ఆయనింట్లో షేరు హోల్డరులాగా తిరగొచ్చు.



పరనిందా స్తుతి మరో రకం. "వాళ్ళ కొత్తిల్లు చూశానండీ" ... ... కాస్త ఆగాలి... "హు" ... ... నిట్టూర్చాలి ... మీరు పొగడదలచుకున్న సుబ్బయ్యగారిల్లంతా ఓసారి కళ్ళు విప్పారిచూడాలి ... హుఁ, నిట్టూర్పు. ఈపాటికి శ్రీమతి అండ్ శ్రీ సుబ్బయ్యగారు చెవులు రిక్కించుకుని కూర్చుంటారు నరసన్నగా రింటిమీద మీ తీర్పుకోసం ... "హుఁ ... కేస్తుండాలి సార్. ఏం లాభం. మీకన్న ఓ లక్ష ఎక్కువే ఖర్చయిందని చెప్పుకుంటున్నారు ... ఏదీ అంతా వేస్టు... ... స్త్రతమే ... ..." ఆనందంతో వెలిగే సుబ్బయ్యగారి మొహాన్ని వేరేలైట్లు లేకుండా కలర్ ఫొటో తియ్యొచ్చును. రెండోశాఖ—చేతలద్వారా, సూచనగా మెచ్చుకోవడం. యజమాని తొడిగే చొక్కాల్లాంటివే కుట్టించి ఆయన చేతులు మడిచినట్టే మడవడం, ఆయన ఊతపదాలు అనడం వగైరాలు యీ కోవలోకి వస్తాయి.



అందికే—ఇమిటేషన్ ఈజ్ ది బెస్ట్ ఫ్లారమ్ ఆఫ్ ప్లాటరీ—అన్నారొకరు.

సందర్భశుద్ధి

ఎలక్షను సీజన్‌లో ఇంకో టెక్నిక్ బాగా కనిపిస్తుంది. ముక్కూ మొహం ఎరగనివాళ్ళంతా మీ యింట్లో అందరినీ కుశలం అడుగుతారు. మీరు చూస్తుండగా మీ పిల్లల్ని చీమిడి ముక్కుతో సహా (ఏమనుకోకండి) ముద్దెట్టేసుకుంటారు. చీమిడికూడా తుడవరు. తుడిస్తే మీరు నొచ్చుకోవచ్చు. ఒకటిమాత్రం నిజం. వ్యక్తికన్న వాడి సృష్టిని—రచన, చిత్రం, పిల్లలు వగైరాలను—మెచ్చుకోడం గొప్పపద్ధతి.

పొగిడేటప్పుడు సందర్భశుద్ధి చూసుకోవడం ఒకటి చాలా ముఖ్యం. బొటనవేలు పగిలో, ఇంట్లో కష్టం వచ్చో ఏడుస్తున్నప్పుడు ముందూ వెనకా లేకుండా ఆయన రచననో, నటననో మెచ్చుకోగూడదు. అలాగే, పొగిడేవాడు కొండంత దుఃఖంతో వెక్కి వెక్కి ఏడుస్తూ మెచ్చుకోగూడదు. పొగిడే అంశం గూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. రచయిత దగ్గరకెళ్ళి "మీ చిత్రాలన్నీ కళాఖండాలు సార్ ... నాకు వేషం కావా" లంటే చెడుతుంది. ముఖ్యంగా ఆడవాళ్ళ దగ్గర ఒక సూత్రం పాటించాలి. మరీ అంద

వికారినీ,మహా సౌందర్యవతినీ పొగిడేటపుడు అందంకన్న వాళ్ళ మేధను మెచ్చుకోడం శ్రేయస్కరం. అందమైన స్త్రీకి మనం కొత్తగా చెప్పేదేం లేదు. అందం లేదని ఖాయంగా అనుకునే స్త్రీకి — అలాంటి వారు అరుదు—ఆ సంగతి చెప్తే మోసగిస్తున్నామని కోపంవస్తుంది. అందువల్ల వాళ్ళ తెలివినే మెచ్చుకోవాలి. అందమైన అమ్మాయికి అది మరీ ఆనందం కలిగిస్తుంది. అటూ యిటూ కాక మధ్యరకం అందంగల అమ్మాయిని ప్రబంధకవిలా పొగడొచ్చు. పొగడినకొద్దీ ఫలితం.

అతి వినయం


పొగడడం ఎంత గొప్ప కళో పొగడ్త అందుకోవడంకూడా అంత గొప్పదీను. అందులో ఒక సంస్కారం ఉండాలి. కనీసం పైపై కన్నా చూపాలి. ఎదటివాడు మనని మెచ్చుకుంటున్నపుడు—ఆ పోడురూ నేను వెధవని, అని మనం అంటే, వాడు అవమానపడతాడు. సవినయంగా స్వీకరించి కృతజ్ఞత తెలపాలి. మన రాజకీయ సన్మాన సభల్లో, కవితా సన్మాన సభల్లో ఇంచక్కగా చూస్తాం. కొందరు సన్మానితులు అతి వినయానికి పోయి—అప్పుడే ఎవరో దగ్గర బంధువులో, మహానాయకుడో మరణించిన వార్త వచ్చినట్టూ, తప్పనిసరిగా ఇక్కడికి సన్మాన సభ మధ్య తను తగులడాల్సొచ్చినట్టూ భంగిమ పెడతారు. వినయం ఎంత మంచిదయినా కొన్ని రకాల ప్రశంసల దగ్గిర మాత్రం బొత్తిగా కూడదు. ఒకసారి ఒక పతివ్రత సినిమాలో ఋషులు. దేవతలు వచ్చి... ...నువ్వు మహా పతివ్రతవు అంటూ పొగుడుతారు. ఆవిడ ఆ మీరేదో అభిమానానికంటున్నారుగాని నేను మీరనుకున్నంత గొప్పదాన్నిగాను ... అన్న ధోరణిలో ఒక ముద్ర ప్రదర్శించింది. ప్రేక్షకులు గొల్లున నవ్వారు. అలాగే సన్మానసభ — 'వీరు దేశసేవా ధురంధరులు. నిస్వార్థ జీవులు. నిజాయితీకి పెట్టిందిపేరు...' అనిమెచ్చుకున్నప్పుడు వినయం అవంతకూడా ప్రదర్శించడం క్షేమం కాదు.

ఇంకా కావాలనే ఆరాటం

ఈ వినయపరులు కొందరు దొంగలు. పొగిడితే అబ్బే అనేవాళ్ళు చాలమంది ఇంకో నాలుగుసార్లు పొగిడించుకుంది కిలా అంటారని— ఏనాడో షేక్స్పియర్ అన్నాడు.

నాటికి నేటికి ఏనాటికి ఎంతటి వారికి పొగడ్త ఇంద్రజాలమే. వ్యసనమైతే మనిషి నెంత దిగలాగుతుందో, తగు మోతాదులో వుంటే మనిషి నంతపైకెత్తుతుంది. తోటివాళ్ళ పొగడ్తవల్ల, అసాధ్యాలయిన పనులు చేసినఅర్భకు లున్నారు. ఆంజనేయుడంతటివాడు లంకకి ఎగరడానికి పని కొచ్చిన యింధనం—నీ అంతవాడు లేడయ్యా—అన్న పొగడ్తే.

□□□



బడ్జెట్ భావాలు

అప్పటివరకు యెక్కడ దాక్కుంటుందో, దానికి ఎలా తెలుస్తుందో గాని, చైత్రమాసం వస్తూనే కోకిల కుహూకుహూ మని కూయడం మొదలెడుతుంది. అందుకే దాన్ని కవులు "హెరల్డ్ ఆఫ్ స్ప్రింగ్"—వసంతుడి వార్తాహారి— అన్నారు.

ఆషాఢమాసం మొదటి రోజున కొండకొమ్మున గోరాడే మేఘుణ్ణి చూడగానే వర్షఋతువు దగ్గిరపడుతోందని యక్షుడికి తెలిసింది. ఇలాగే ఒక్కొక్క ఋతువుకు ఒక్కొక్క సూచన ఏదో వుంటుంది.

అసలు ఋతువులు ఆరే అయినా, వాటికి యీ రోజుల్లో యింకోటి చేర్చుకోక తప్పదు. దాన్నే "బడ్జెట్ సీజన్" అంటారు. ఈ సీజన్ వస్తోందని చెప్పేవి ఏమిటో తెలుసా? ధరలు!


బడ్జెట్ ఇంకా నెలరోజులుందనగానే ధరలు పెరిగిపోవడం మొదలెడతాయి. కిరసనాయిలు, అగ్గిపుల్లలు, సిగరెట్లు, కొన్ని రకాల బట్టలు—సాధారణంగా ఏ వస్తువుల మీద పన్నులు పడడానికి అవకాశం వుంటుందో—అవన్నీ ధరలు పెరిగిపోతాయి. కొన్ని వస్తువులు సినిమాలో ట్రిక్‌షాట్‌లో మోస్తరుగా తపీమని మాయమైపోతాయి కూడా.

వసంతకాలం విరహులకు మంచి సీజను అని కవుల వర్ణన. అలాగే బడ్జెట్ కాలం వ్యాపారస్తులకు పండగ. జారచోరులు వెన్నెలరోజులంటే వెరుస్తారట. అలాగే బడ్జెట్ అంటే సామాన్య ప్రజలకు హడలు.

కవులు వర్ణించిన ఋతువులన్నీ ఈ రోజుల్లో తారుమారైపోయాయి. వసంతం ఇంకా రాకుండానే గ్రీష్మం వచ్చేస్తోంది. వర్షాకాలంలో వానలు కురవడం మానేశాయి. చలికాలంలో ఉక్కపోస్తోంది. ఏదెలా మారినా బడ్జెట్ సీజను మాత్రం మారదు. మన దేశంలో ఖచ్చితంగా అది ఫిబ్రవరి ఆఖరు తేదీన ప్రారంభమవుతుంది.

జనవరి చివర్లో గావును ఒకరోజు పొద్దున్నే బర్కిలీ పెట్టె కొందామని 35 పైసలిస్తే "ఇవాళ్నించీ 40 సార్" అన్నాడు షాపువాడు. "ఎందు"కని అడిగితే "బడ్జెట్ వస్తోందిగదండి. అన్ని సిగరెట్ల ధరలూ పెరిగిపోయాయి" అన్నాడు.

"బజెట్టా?" అన్నాను, నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా.



"బజెట్టు కాదండి, బడ్‌జెట్టు" అన్నాడు. షాపువాడు ఒత్తిపలుకుతూ.

"బియుడిజిఇటి" అనే అక్షరాలు గల ఇంగ్లీషు మాటలో "డి" సైలెంట్ అని అతగాడికి తెలియక పోవడాన్ని క్షమించానుగాని (తెలుగువారు అలాగే పలుకుతారని, జజ్ అనే మాటని జడిజి, బ్రిజ్‌ని బ్రిడిజి అని పలుకుతారని తెలుసుగనక నేను కూడా "బడ్‌జెట్" అనే వాడుతున్నాను, ఏమనుకోకండి.)—బడ్జెట్ యింకా కనుచూపుమేర దూరంలోకి రాకుండానే, సిగరెట్లమీద ఎంత పన్ను పెంచుతారో తెలియకుండానే ధర పెంచేసిన షాపువాణ్ణి క్షమించలేకపోయాను.

ఆ రోజంతా బడ్జెట్‌ను ఇంగ్లీషులో కూకలేస్తూనే గడిపాను. అవాళ్లా నా మెదడులో బడ్జెట్ భావాలే మెదిలాయి.

ఏమిటయ్యా యీ బడ్జెటు అని డిక్షనరీ తిరగేస్తే అది అసలు ఫ్రెంచి మాటట. దాని అసలు అర్థం "చిన్న చేతి సంచీ" అట. బ్రిటిష్ సంప్రదాయంప్రకారం ఆర్థికమంత్రి కొత్త సంవత్సరపు ఆదాయ-వ్యయాలకు, పన్నుల ప్రతిపాదనలకు సంబంధించిన కాగితాలన్నీ ఆ సంచీలో వేసుకుని పార్లమెంటుకు వస్తాడు. ఆ విధంగా బడ్జెట్ అనే మాట వాడుకలోకి వచ్చిందట.

ఆర్థికమంత్రి గడచినసంవత్సరంలో ఎంత రాబడి వచ్చింది, ఎంత ఖర్చయింది, వచ్చే సంవత్సరంలో ఎంత వస్తుంది, ఎంత ఖర్చుచేయాలనుకుంటోంది మొదలైన వివరాలేకాక, మిగులుంటే ఎంత, లోటుంటే ఎంత, దాన్ని ఎలా భర్తీచేయడం-వగైరా వివరాలుకూడా పార్లమెంటుకు నివేదిస్తాడు.

లోటును భర్తీచేయడానికి చాలా పద్ధతు లున్నాయి. ప్రతి ఆర్థికమంత్రికి తేరగా దొరికేది కొత్తపన్నులు వెయ్యడం, పాత పన్నులు హెచ్చించడం. మన దేశంలో సామాన్య ప్రజలమీద పన్ను లెక్కువ వేస్తున్నారని, ఆ వేసే పన్ను లేవో సంపన్నుల మీదే వెయ్యాలని కమ్యూనిస్టులు గోలచేస్తే, పడే పన్నులన్నీ మామీదే పడుతున్నాయర్రోయ్ అని ధనవంతులగోల. మొత్తంమీద వారూ వీరూకూడా మన దేశంలో వున్నంత పన్నులబాధ యింకే దేశంలోనూ లేదని ఏకీభవిస్తారు.

ఇంకో పద్ధతిని డెఫిసిట్ ఫైనాన్సింగ్ అంటారు. అంటే కొత్తగా నోట్లు గుద్ది చెలామణీ చెయ్యడం. దీనివల్ల డబ్బుకు, సరుకుకు వుండవలసిన నిష్పత్తి తారుమారైపోతుంది. అంటే డబ్బు ఎక్కువౌతుందిగాని, దాంతో కొనదగిన వస్తువులు ఎక్కువ కావు. దాంతో ధరలు పెరిగిపోతాయి. దీన్నే ద్రవ్యోల్బణమని పత్రికలవాళ్ళు ముద్దుగా పిలుస్తారు. ధాన్ని తెలిగించి "డబ్బు ఉబ్బు" అనచ్చు. ఇంగ్లీషులో ఇన్‌ఫ్లేషన్ అంటారు. ఇన్‌ఫ్లూయెంజా లాగానే యిదీ మనుషుల్ని పీల్చి పిప్పిచేస్తుంది. ఈ వ్యాధే ఇప్పుడు మన దేశాన్ని పట్టుకుంది.

పొదుపు అని యింకోపద్ధతి వుంది. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో దీన్ని గురించి ప్రజలకి చాలా ఆశలు చూపుతాడు; వాగ్దానాలు చేస్తాడు. ఐతే మళ్ళీ ఏడాది బడ్జెట్ ప్రసంగం తయారుచేయబోయేదాకా అవిఅయనకి జ్ఞాపకంరావు.

రాబడి తక్కువ, పోబడి ఎక్కువ అయినప్పుడు మనం చేసేపనే ప్రభుత్వాలుకూడా చేస్తాయి. అంటే దేశంమీదపడి అప్పులు చెయ్యడం. ప్రభుత్వమంత పెద్ద అప్పారావు యింకెవరూ వుండరు.

బడ్జెట్‌వల్ల ఒక లాభం వుంది. సాధారణంగా చూడండి—మనం కదలని రైలులో కూర్చుని కదులుతున్న రైలును చూస్తుంటే మన రైలే కదులుతున్నట్టు వుంటుంది. అలాగే బడ్జెట్‌ను చూస్తుంటే మనం బారుణంగా అభివృద్ధి అయిపోతున్నట్టు భ్రాంతి కలుగుతుంది. కిందటేడు కంటె రాబడి అంచనా ఎక్కువ్వుంటుంది. వేరు వేరు పద్దులకింద ఖర్చు కూడా ఎక్కువుంటుంది. ఇంకా బోలెడు వాగ్దానా లుంటాయి. అంచేత మన అభివృద్ధి కళ్ళముందు స్పష్టంగా ఆడుతున్నట్టు వుంటుంది.

మళ్ళీ బజారులోకి వచ్చి బర్కిలీ పెట్టె యివ్వవయ్యా అని 35 పైసలిస్తే—ఎందుకులెండి, చర్వితచర్వణం. జీవిత మొక గారడీ! బడ్జెట్ ఒక పారడీ!

— బాబ్జీ —

□□□

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

"అందమైన మాటలతో యెదుటి వాళ్ళని మోసం చెయ్యడం బాగా తెలును."

"ఇప్పుడు నిన్ను నేనేం మోసం చేశాను?" తొణక్కుండా అడిగాడు.

"ఇప్పటికి చూసింది చాలు. ఇంటికి వెళ్ళిపోదాం.

"వెళ్ళిపోదాం. కాని వెళ్ళేముందు నీకు కొన్ని విషయాలు చెప్పాలి. అందుకే అసలు ఆపింది."

"మీరు నాకిప్పుడు కొత్తగా చెప్పేందు కేముంది? చెప్పినా నేను వినను వినను." ఖచ్చితంగా తల తిప్పుతూ అంది.

నువ్వేదైనా తలతిక్కగా మాట్లాడావంటే, ఈ రాత్రికి అసలు ఇంటికి వెళ్ళేదే లేదు. తెలుసా? ఇక్కడున్నదిగూడా ఒక్క మంచమే."

జయంతి కళ్ళప్పగించి చూస్తూండిపోయింది. పిండారబోసినట్టున్న వెన్నెల్లో తెల్లటి బట్టల్లో, పాలరాతి బొమ్మలా కూర్చున్న జయంతి కళ్ళలో స్పష్టంగా కన్పిస్తున్న అసహ్యం-యేవగింపు భయం చూసి శేఖరం హృదయం క్రుంగిపోయింది. అజ్ఞాతశక్తి యేదో చురకత్తితో నిర్దాక్షిణ్యంగా చీల్చినట్టు అన్పించింది. వెంటనే తమాషాకి అన్నానని, అసలిక్కడవుండే వుద్దేశం తనకి లేనే లేదని చెప్పి, యింటికి వెళ్ళిపోదాం రమ్మనమని లాక్కెళ్ళి కారులో కూలెయ్యాలని గట్టిగా తోచింది. కాని అంతలోనే పురుషత్వపు అహంకారం అడ్డొచ్చింది.

"జయంతీ-" చేయిజాచి జయంతి చేతిని తన చేతిలోకి తీసుకోబోయాడు.

జయంతి బలంగా విదిలించి కొట్టింది.

"నా మాటసలు విన్పించుకోవేం?" కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"వినను వినను నా కసహ్యం"

జయంతి వాక్యం పూర్తి చెయ్యక ముందే చేతిని పట్టుకుని విసురుగా దగ్గరకి లాక్కున్నాడు. యదాలాపంగా కూర్చున్న జయంతి తూలి అతని ఛాతీమీదపడి వెంటనే చివ్వున లేవబోతుండగా శేఖరం బలంగా పట్టుకుని ఆపాడు.

"ఛీఛీ–నా కసహ్యం–అసహ్యంఅని చెప్పడంలా. సిగ్గులేదూ!" తనని కదలకుండా బంధించాడనే కోపంతో గుప్పెట్లుబిగించి అతన్ని కొట్టసాగింది.

'జయంతీ–' అస్పష్టంగా అన్న అతను కుడిచేత్తో జయంతి రెండు చేతుల్ని పట్టుకుని ఆపేశాడు. ఎడం చెయ్యి లేవకుండా నడుం చుట్టూవేసి గట్టిగా పట్టుకున్నాడు.

ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. అతని కళ్ళల్లో ఆ క్షణంలో కన్పించిన మాంత్రిక శక్తి యేదో జయంతి చూపుల్ని అలాగే ఆకట్టేసుకుంది. శేఖరం కుడిచెయ్యి మెల్లగా చేతుల్ని వదిలేసి జయంతి భుజాల చుట్టూ పడింది. ఉన్నట్టుండి శేఖరం హఠాత్తుగా, కాస్త వదులుంటే అందకుండా పారిపోతుందేమో, ఇక జన్మలో కన్పించదేమో అని భయపడుతున్న వాడిలా జయంతిని దగ్గరగా లాక్కుని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. చేతులు వదులవడంతో బలంగా పెనుగులాడబోయింది.కాని అంతలో యేమైందో జయంతికే తెలియదు. వెన్నెల్లో విద్యుత్తు వున్నట్టు ప్రపంచం అంతా శేఖరమే అయినట్టు, ప్రకృతి స్తంభించిపోయినట్టుఅన్పించింది తనకి తెలియకుండానే రెండు చేతులూ అతని మెడచుట్టూ పెనవేసుకున్నాయి. ఆ క్షణంలో జయంతిని శేఖరం దగ్గరకు లాక్కున్నాడో, శేఖరాన్ని జయంతే దగ్గిరకి లాక్కుందో యిద్దరికీ తెలియదు.

శేఖరం మెల్లగా జయంతిని వదిలేశాడు. ఇంకా అతని మెడచుట్టూ పెనవేసుకున్న చేతులు అలాగే వుండి పోయినాయి. తను చేసిన పనేమిటో గుర్తుకురాగానే త్రుళ్ళిపడ్డట్టు చేతులు లాగేసుకుంది. శేఖరం చేయి యీసారి మృదువుగా ఆ రెండుచేతుల్ని తన చేతులలోకి తీసుకుంది.

జయంతికి హఠాత్తుగా యేడుపు ముంచుకొచ్చేసింది. శేఖరం తనని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే వంటరిగా ఆపేశాడు. ఇంటికి వెళ్ళం, ఈ రాత్రి యిక్కడే అని సూచించాడు. అయిపోయింది. తను లొంగిపోయింది. అతను మంచివాడు కాడని తెలిసి కూడా లొంగిపోతోంది.

ఏడుస్తున్న జయంతిని దగ్గరగా తీసుకుని "ఎందు కెందుకు ?" అన్నాడు ఆదుర్దాగా.

సమాధానంగా దుఃఖం వుప్పెనలా పొంగింది.

"హుష్! నెమ్మది. మేనేజర్ వాళ్ళు షెడ్‌లో వున్నారు. వింటారు.

ఊరుకో—" సముదాయిస్తూ ఒళ్లోకి లాక్కున్నాడు.

జయంతి యేడుపుఆగలేదు. కొద్దిసేపుమౌనంగానేవుండిపోయిన శేఖరం పొడిపొడిగావున్న జయంతి జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ మృదువుగా "భయపడకు జయంతీ! ఈ రోజుతో నా అనుమానం తీరిపోయింది. నేనింక బాధపడాల్సిందిగాని, భయపడాల్సింది గాని లేదు. నాపట్ల నీకున్న అనుమానాలు పోయి నువ్వు నీ అంతట నాదగ్గరకి వచ్చే క్షణంకోసం ఎన్ని యుగాలైనా యెదురు చూడగలను. మనం ఎన్ని రోజులు కలిసివున్నా ఎంత రెచ్చగొట్టే పరిస్థితుల్లో కూర్చున్నా—నీ యిష్టం లేందే ఏం జరగదు. అని వాగ్దానం చేస్తున్నాను. సరేనా ?" అన్నాడు.

జయంతి మాట్లాడలేదు. ఏడుపు ఉధృతం తగ్గింది. అతని చేతుల్లోంచి విడిపోవాలని పెనుగులాడలేదు.

"లే! నువ్వు లేచి సరిగ్గాకూర్చుంటే—నేను వెళ్ళి కారు తీసుకొస్తాను. ఇంటికి వెళ్ళిపోదాం."

"సెక్రటరీ" సీరియల్ - జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బామ్మ. జయంతికి వనితా విహార్‌లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాండ్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచివాడు. అతని వద్ద ఉద్యోగం మొదట బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకొనటం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని అనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బామ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటి నుంచి వెళ్ళిపోవాలనుకుంటుంది. ఇంతలో ఆమె బామ్మ హఠాత్తుగా గుండెజబ్బు వచ్చి చనిపోతుంది. ఇక చేసేదిలేక ఆమె రాజశేఖరం ఇంట్లోనే వుండిపోతుంది.

ఒకరోజున శేఖరం జయంతిని తన ద్రాక్షతోటలో పిక్నిక్‌కు తీసుకువెడతాడు. అక్కడికి అతని స్నేహితులు యింకా చాలా మందివస్తారు. వారంతా జయంతికికూడా తెలిసినవాళ్ళే.

కొద్దిసేపయిం తర్వాత జయంతిని మెల్లగా లేవదీసి సరిగ్గా కూర్చోబెట్టి శేఖరం వెళ్ళిపోయాడు. అందంగా, తెల్లగావున్న ఆ వెన్నెల్లో, నిశ్శబ్దంగావున్న పరిసరాలకేసి చూస్తూ మతిపోయినదానిలా కూర్చుండిపోయింది జయంతి.

ఏమిటిది? ఏమైంది? ఎటువైపు జారిపోతోంది తను!

"ఈరోజుతో నా అనుమానం తీరిపోయింది. నేనింక బాధపడాల్సిందిగాని— భయపడాల్సిందిగాని లేదు —" మృదుగంభీరంగావున్న శేఖరం స్వరం ఇంకా చెవుల్లో మారుమోగుతోంది. అంతే — ఏమిటతని ఉద్దేశం!

దూరంనుంచి తెల్లటి బట్టల్లో వున్న ఒక ఆకారం ఇటువైపు రాసాగింది. ఎలా అతని మొహంచూడటం! కాని — దగ్గరగా వస్తున్నకొద్దీ ఆ వచ్చేది శేఖరం కాదని మేనేజర్ అని తెలిసింది.

"రమ్మంటున్నారు." ముభావంగా అన్న అతను కాటేజ్‌వైపు వెళ్ళిపోయాడు. జయంతి లేచి కారున్నవైపు వచ్చింది. శరీరం తేలికైనట్టు తూలుతోంది. మనసంతా ఎలాగో వుంది.

జయంతికి ఆ ప్రశాంతిని, చెట్లమీద పక్షులు సంగీతంలా చేస్తున్న ధ్వనికి, ముఖ్యంగా మనోహరంగా వున్న వెన్నెలని చూస్తూంటే ఆ రాత్రికి అక్కడ వుండిపోదాం అని శేఖరాన్ని బ్రతిమలాడాలనిపించింది. కాని తను వచ్చేసరికే శేఖరం కారు స్టార్ట్ చేసి వుంది. వచ్చి కూర్చోగానే వెంటనే కదిలింది. జయంతి మనసు కొంచెం కుదుటపరుచుకుని తిరిగి చూసేలోపలే ఆ పరిసరాలు దూరమై పోయాయి.

ఇల్లు సమీపిస్తుండగా శేఖరం "నీకు చెప్పాలనుకున్నది చెప్పనేలేదు. ఈ సారయినా కొంచెం ఓపికగా విను జయంతీ—" అన్నాడు. జయంతి సమాధానం చెప్పలేదు. ఏం చెబుతాడు! రేఖారాణితో తనకేం సంబంధం లేదని, ప్రమీలని చేసుకోవాలని యిష్టపడడంలేదని, నువ్వు కావాలని. అంతేగా! అంతకంటే చెప్పాల్సినవి యింకేం వున్నాయి!

జయంతిని యింటిదగ్గర దించేసిన శేఖరం కారు మళ్ళీ వెనక్కి గేటువైపు తిప్పుతూ "నువ్వు భోంచేసి నిద్రపో! నేను క్లబ్‌కి వెడుతున్నా! రాత్రికి వస్తే వస్తాను లేకపోతే లేదు" అన్నాడు.

జయంతి చూస్తుండగానే కారు వెళ్ళిపోయింది. జయంతి పడుకున్నతర్వాత కళ్ళముందు ఆ వెన్నెల, ఆ ప్రశాంతత, ఆ ప్రశాంతతలో శేఖరం మాటలు, అవే గుర్తుకు రాసాగాయి. వంటరిగా వున్నప్పుడాలోచనల్తో ఇంత ఎదురుతిరిగే మనసు అతని స్పర్శలో అలా మైమరచిపోతుం దెందుకు? అతనిలో

యేదైనా అద్భుతమైన శక్తి వుందా? లేకతనకి నిగ్రహం లేకనా? ఏదైనా ఈరోజు శేఖరం క్లబ్‌కి వెళ్ళిపోవడమే మంచిదైంది —అన్పించింది జయంతికి.

● ● ●

మర్నాడుకూడా అతను కన్పించలేదు. మూడోరోజు మధ్యాహ్నం— అతనింట్లోనే భోంచేశాడు. కాని జయంతి అతనితో తినలేదు. అతను రమ్మనమని కబురుచేయలేదు.

ఆ సాయంత్రం—జయంతి అల్లిన ప్లాస్టిక్ బాగ్ పట్టుకెళ్ళటానికి సునంద వచ్చింది. శేఖరం బైటనుంచి వచ్చాడు. సునందని చూసివచ్చి కూర్చునిమాట్లాడాడు, చాలా మామూలుగా—అసలేం జరగనట్టు. జయంతికి ఆశ్చర్యమనిపించింది. అంతసేపుకూర్చున్నా ఒక్కసారికూడా జయంతివైపు చూడలేదు. ఇద్దరి కళ్ళూ కలుసుకోలేదు. జరిగిందానికి పశ్చాత్తా ప్పడుతున్నాడా అన్పించింది జయంతికి.

● ● ●

గదిలోకూర్చుని పుస్తకం చదువుకుంటోంది జయంతి. "అయ్యగారి పాంట్ జేబులో యీ కాగితా లున్నాయట. చాకలి తీసి యిచ్చాడు— ఇవిగో—" అంటూ వాసు తెచ్చి యిచ్చాడు. ఏవో రెండుమూడు బిల్స్, ఒక ఉత్తరం వున్నాయి. చించి చూసిన వుత్తరమే. జయంతి కవరు తిప్పిచూసింది. లక్ష్మి అని వుంది. లక్ష్మి ఎవరు? లక్ష్మి అనే ఆవిడ గురించి శేఖరం నోటినుంచి ఎప్పుడూ తను వినలేదే! వద్దనుకుంటూనే వుత్తరం తీసి చూసింది.

"శేఖరం!

నీ ఉత్తరం అందింది. వెంటనే జవాబు వ్రాయాలని మనసులో ఆరాటం. కాని నాసంగతి తెలుసుగా! క్షణం ఊపిరి ఆడదు. అందుకే వెంటనే జవాబు వ్రాయలేకపోయాను. ఏమీ అనుకోకు.

నీ మనసులో బాధ నా కర్థం అయింది. ఈ విషయం సున్నితంగా నీ హృదయాన్ని చురకత్తిలా చీలుస్తోందని నేను గ్రహించాను. శేఖరం! ఎలాటి చిక్కుసమస్యనైనా యిట్టే విడదీసే నీ తెలివితేటలు యేమైపోయినాయి! నీకు నేను సలహా చెప్పాలా? నన్నడిగితే ఒకే ఒకమాట చెబుతాను. మనసులేని మనువులో మనిషికి మనశ్శాంతి వుండదు. ఐనా నువ్వెందులో ఇంత భయపడాల్సింది నాకేం కన్పించడంలేదు. పెళ్ళి చేసేసుకో! తర్వాత నీ కాళ్ళకి చుట్టుకున్న బంధాలు వాటంతట అవే విడిపోతాయి. ఒకళ్ళపట్ల జాలితో, నీ జీవితం నాశనం చేసుకుంటావా! అలాటి పిచ్చిపని ఎప్పుడూ చెయ్యకు! అంతకంటె వెర్రితనం యింకోటుండదని హెచ్చరిస్తున్నాను.

వెంటనే వివాహం చేసేసుకో! పరిస్థితులు అవే చక్కబడతాయి. వ్యక్తులు వాళ్ళే సర్దుకుంటారు.

మనసులు అవే కలుస్తాయి.

ఉంటాను,

ఆశీర్వచనములతో,

లక్ష్మి."

ఉత్తరం పది పదిహేనుసార్లు చదివినా జయంతికి విషయం బోధపడలేదు. రాజశేఖరం పెళ్ళి చేసుకోటానికి ఎందుకు జంకుతున్నాడు! ఎవరు అతని కాళ్ళకి పెనవేసుకున్న బంధం! ఎవరిని చూసి జాలితో తన జీవితం నాశనం చేసుకోబోతున్నాడని ఆవిడ హెచ్చరిస్తోంది? జయంతికి మెల్ల మెల్లగా అర్థంకాసాగింది. మంచు తెరలు విడిపోతున్నాయి. అసలు విషయం వుదయిస్తున్న సూర్యుడిలా స్పష్టంగాకన్పించసాగింది. ఇంకెవరు? తనే. తను కాకపోతే యింకెవరు అతనికి బంధం వుంది? ప్రస్తుతం అతను జాలి పడుతున్నవ్యక్తి తను కాకపోతే యింకెవరు? ఈవిడెవరో అతనికి చాలా ఆప్తురాల్లా వుంది. వెంటనే వివాహం చేసుకో అని మందలిస్తోంది. ప్రమీలని గురించేనా! ఐనా రాజశేఖరం యిందులో యింత బాధపడాల్సిన పనేముంది. తనేం అతని దగ్గరగా వెళ్ళాలని ప్రయత్నం చెయ్యటం లేదుగా! ఆ రోజు ఆ వెన్నెల్లో అలా ఎందుకు మాట్లాడాలి? ఛీ-ఛీ! తనిలా యేదీ గ్రహించుకోలేకుండా యిలా కూర్చుంటోంది! ఈ విషయాన్నైనా అతను పదేపదే చెప్పటానికి ప్రయత్నిస్తోంది. తనెంత వెర్రిదైపోయింది. గ్రహింపుజ్ఞానం బొత్తిగా యిలా శూన్యమైపోయిందెందుకు!

జయంతి లేచి ఉత్తరాన్ని జాగ్రత్తగా శేఖరం డ్రాయరులో పెట్టేసింది. మనసంతా హఠాత్తుగా ఒంటరిగా శూన్యంలో దిక్కులు చూడసాగింది. తను చెప్పెయ్యాలి. తనే చెప్పాలి శేఖరానికి. అదెలా— అదెలా—ఆలోచిస్తూండిపోయింది.

● ● ●

రెండు రోజులు గడిచిపోయినాయి. మనసులో ప్రతిక్షణం వుత్తరం సంగతి మెదుల్తూనేవుంది. కాని శేఖరానికి తెలియజెప్పే మార్గం దొరకటం లేదు. ఏమని చెప్పాలి? ఎలా మొదలు పెట్టాలి— ఈ ప్రశ్నతో సతమతమౌతూనేవుంది.

ఆ రోజు శ్రావణ పౌర్ణమి. రాఖీ పండుగ. హైదరాబాద్‌నుంచి వుత్తరాదివరకు ఇదో ముఖ్యమైన పండగ.

ఈ రోజున అక్క చెల్లెళ్లు అన్నదమ్ములకి రాఖీ కడ్తారు. పరిచితులు భాయీ భాయీ అనుకుని పాతపగలు కూడా మర్చిపోయి రాఖీలు కట్టుకుని కౌగలించుకుని ఆరోజునుంచి కొత్త జీవితాలు ప్రారంభిస్తారు. పనివాళ్ళు యజమానులకి కట్టి బహుమతులందుకొంటారు.

సునంద రాఖీ తెచ్చి జయంతి చేతికి కట్టింది.

"ఏమివ్వను—నీకు— నాదగ్గరేముంది." అంది జయంతి.

"ఇదివరకే ఇచ్చేశావుగా స్వెట్టర్లవీ! ఇప్పుడివ్వాలంటే — నీదగ్గిర ఇంకోటుంది" అంది.

"ఏమిటది చెప్పు—" ఆదుర్దాగా అడిగింది.

"ఇదుగో—యిది—" తన బుగ్గ మీద వేలుపెట్టి జయంతి పెదవుల వైపు చూపించింది.

"ఛీ—పో—" అంది జయంతి.

"అంతకంటే మధురమైంది యింకేముంది యీ ప్రపంచంలో—"

"ఏమో నాకేం తెలుస్తుంది."

"తెలియదని నమ్మమంటావా నన్ను—"

"ఛి—ఛి—" జయంతి ఆగిపోయింది. తననుంచి యేదో తెలుసుకోవాలని సునంద ప్రయత్నిస్తోంది. వెంటనే ప్రసంగం మార్చేసింది.

సునంద వెళ్ళిపోయింది. చేతికున్న రాఖీని చూస్తూ కూర్చున్న జయంతికి చటుక్కున ఓ ఆలోచన మెరిసింది. ఇది తీసుకెళ్ళి అతని చేతికి కట్టి—రాఖీ పూర్తిగా సోదర సమానులైన వాళ్ళకే కడ్తారు ఆడవాళ్ళు, తన అభిప్రాయం చెప్పెయ్యటానికి చక్కటి అవకాశం.

జయంతి మెల్లగా రాఖీ చేతినుంచి వూడదీసి చేత్తో పట్టుకెళ్ళింది.

శేఖరం యింట్లోనే వున్నాడు. ఆరోజు శలవు సునంద భర్తరాలేదు. శేఖరం ఆ గదిలోనే కూర్చుని యేదో రాసుకుంటున్నాడు. అడుగుల చప్పుడు విని తలెత్తి "ఏమిటి?" అన్నాడు.

"రాఖీ తెచ్చాను." కొట్టుకునే గుండెల్తో అంది.

"ఓహో! అయితే—"

"మీకు కట్టటానికి తెచ్చాను."

శేఖరం ఒకసారి జయంతివైపు నిశితంగా చూసి తర్వాత వ్రాస్తున్న పేపర్లు ప్రక్కనపెట్టేసి కుర్చీలో వెనక్కు జారగిలబడుతూ "రాఖీ ఎవరికి కడ్తారో తెలుసా?" అన్నాడు.

"తెలుసు."

"ఎవరికి?"

● 1959 లో ఒక రష్యన్ పౌరుడు "డౌన్ విత్ కృశ్చేవ్" అని అరచినందుకుగాను అతనికి అయిదేళ్ళ శిక్ష పడిందట. శిక్ష అనుభవించి విడుదల అయినతర్వాత అతడు కృతజ్ఞతా సూచకంగా "లాంగ్ లివ్ కృశ్చేవ్" అని అరచాడట. అతనికి మళ్ళీ అయిదేళ్ళ శిక్షపడిందట.

—"శాటర్‌డే రివ్యూ."

'సోదరసమానమైన వాళ్ళకి—'

'ఐతే తెలిసే వచ్చేవన్నమాట—'

జయంతి తలూపింది.

శేఖరం చెయి జాచాడు కట్టుమన్నట్టు. జయంతి మనను తేలికైంది. అమ్మయ్య! ఇంత త్వరగా ఒప్పుకుంటాడనుకోలేదు. దగ్గరగావచ్చి—అతని చేయి చేతిలోకి తీసుకుంది.

'ముందిది చెప్పు—నేనంటే నీకు సోదరభావమేనా వుంది ?'

జయంతి క్రిందకు చూస్తుండిపోయింది.

'చెప్పు—' రెట్టించాడు.

జయంతి మాట్లాడలేదు.

'మాట్లాడవేం ?'

అవును—అవును—అని చెప్పటానికి శరీరంలోవున్న శక్తినంతా కూడదీసుకుంటుండగా యింతలో శేఖరం జయంతి చేతిని పట్టి విసురుగా దగ్గరకి గుంజుకుంటూ—'ఎంత ధైర్యం నీకు—' అన్నాడు. బిత్తరపోయి అతనివైపుచూస్తుండిపోయింది. ఇద్దరికళ్ళు కలుసుకున్నాయి.

'నిన్ను నువ్వు మోసం చేసుకోవాలనుకుంటే చేసుకో. కాని నన్ను చెయ్యలేవు. అదిగూడా—ఇదివరకైతే ఏమో—చెప్పలేకపోయేవాడిని. కాని—మొన్న—ద్రాక్షతోట దగ్గర—ఆ వెన్నెట్లో—నువ్వేమిటో నాకు తెలిసిపోయింది—' అని క్షణం ఆగి 'నేను నీకు ఒక్క సోదరుణ్ణిగాదు. తల్లి—తండ్రి స్నేహితుడు అన్నీ—అన్నిచూపించే—' ఆగిపోయాడు.

'అంతేగాని—పిచ్చిపిచ్చి ఆలోచనలతో ఆత్మవంచన చేసుకోకు. తర్వాత — నీకిదిగూడా చెప్పాలి. ఎలా చెప్పాలా అని సతమతమౌతున్న నాకు మంచి అవకాశం యిచ్చావు. నేనీ దాగుడు మూతలు యింకెన్ని రోజులో ఆడలేను జయంతీ! త్వరలోనే నిన్ను పెళ్ళిచేసుకుంటున్నాను. నిద్రలో నువ్వు భయపడి అరుస్తుంటే ప్రక్క గదిలోంచి పరుగెత్తుకు రావడం నాకు చాతగావడంలేదు. నా ప్రక్కనే నువ్వుంటే చెయిజాచి దగ్గరకి తీసుకోవచ్చు.'

జయంతి మొహం కందగడ్డలా తయారైంది. శేఖరం యిది గమనించి గడ్డంపట్టి పైకెత్తుతూ 'భయపడకు. నాలాటి మనిషిని భర్తగా భరించడం నీకు అసాధ్యమనిపిస్తోందా ? ప్రయత్నం చేసిచూడు. నువ్వనుకున్నంత భయంకరంగా వుండదేమో! తర్వాత నీకు యింకోటిగూడా హామీ యిస్తున్నాను. వివాహం నామమాత్రమే. అనుక్షణం అంగరక్షకుడిలా దగ్గరగా వుండటంకోసం. అంతే. నీనుంచి నీయంత నువ్విచ్చేంతవరకూ నేనేమీ ఆశించను—'.

'ఎవరొచ్చా —' లోపలికి రాబోయిన వాసు ఖంగారుగా వెనక్కు తిరిగి పారిపోయాడు.

శేఖరం చేతిలో యింకా జయంతి గడ్డం అలాగేవుంది.

వాసు వెళ్ళిపోగానే యిద్దరూ మొహాలు చూసుకున్నారు.

'చెప్పు. నామీద అసహ్యం లేదని ఒకసారి అన్నావు. అది నాకుగుర్తుంది. కోపం వుందని నాకు తెలును. దానికి కారణాలుగూడా నాకు తెలును. కాని మన పెళ్ళయిపోతే అన్నీ చక్క బడిపోతాయని ఆశ జయంతీ!' కళ్ళలోకి వెతుకుతున్నాడు. జయంతి నుంచి సమాధానం యేమీ రాలేదు.

'వస్తాను. యెవరో వచ్చారుట—' మెల్లగా జయంతిని వదిలేసి బైటకి వెళ్ళిపోయాడు.

ఒంటరిగా గదిలో మిగిలిపోయిన జయంతి చిత్తరువులా నిలబడిపోయింది.

● ● ●

హఠాత్తుగా షాక్ తిన్న మనిషిలా మూగవోయిన మనసుతో ఒంటరిగా అలా నిలబడిపోయిన జయంతికి టైమెంత గడిచిందో స్పృహలేదు.

'హలో' వెనకనుంచి ఎవరిదో కంఠం విన్పించటంతో మెల్లగా మెడ తిప్పి ప్రక్కకు తిరిగి చూసింది.

'శేఖరం లేడా ?—' అంటూ రేఖారాణి లోపలికి వచ్చింది.

'లేరు. బైటకి వెళ్ళారు—' యాంత్రికంగా వచ్చింది జవాబు.

తీవ్రమైన అఘాతం తగిలితే ఆ బాధని తట్టుకోలేక ఆత్మ దూరంగా పారిపోయింది. మామూలుగా మాట్లాడ్తున్నా—కూర్చున్నా—నుంచున్నా వాటి వేటిమీదమనసున్నట్టు ఉండదు. ప్రస్తుతం జయంతి పరిస్థితిగూడా అలాగేవుంది.

'ఓ హెూ !—' జయంతి అనుకున్నట్టు రేఖారాణి తటపటాయించలేదు. వెనక్కి తిరిగి వెళ్ళిపోలేదు. సరాసరి గదిలోకివచ్చి కూర్చుంటూ 'అలా వున్నావేం ? ఒంట్లో బాగా లేదా ?—' అంది.

జయంతి బాగానేవున్నానుఅన్నట్టు తల ఊపింది.

'కూర్చో—'

అప్పటికి గుర్తు కొచ్చింది. చాలాసేపటినుంచి నిలబడి వుండడంవల్ల కాళ్ళు గుంజుతున్నాయని. మెల్లగా ప్రక్కనేవున్న కుర్చీలో కూర్చుంది.

'మొహంఅంత పాలిపోయివుందేం? ఒంట్లో బాగాలేనిమనిషిలా వున్నావు. శేఖరం గమనించలేదా?'

జయంతికేం చెప్పాలో తోచలేదు.

'అవున్లే! మనిషిమీద ఏదయినా ఆసక్తి వుంటేగా మనను పసిగట్టటానికి ? కేవలం దయా ధర్మంగా జాలికోసం దగ్గరుంచుకున్నవాళ్ళు యింతకంటే ఏం బాగా చూస్తారు!'

రేఖారాణి ఏం చెప్తోందో బొత్తిగా అర్థంగాని జయంతి అర

చేతుల్లోకి చూసుకుంటూ కూర్చుండి పోయింది. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఏర్పడింది.

'జయంతీ! నీకు కష్టం కలిగినా ఒక మాట చెప్పాలి. నువ్వు చిన్న దానివి. బొత్తిగా లోకజ్ఞానం లేని దానివని చెప్పచ్చు. నిన్ను హెచ్చరించేందుకు పెద్దవాళ్ళెవరూ లేక పోవటం యింకో లోపం. ఎక్కువ రోజులు నువ్విలా వంటరిగా అతనితో వుంటే ఇతని భాగస్వాములు తప్పుకుంటా మంటున్నారు. వాళ్లు తప్పుకుంటే మా వారుగూడా విరమించుకుంటారని ప్రత్యేకం చెప్పనవసరం లేదు. ఇందరు పెద్ద పెద్దవాళ్ళుఅకస్మాత్తుగా యిందులోనుంచి వదిలేసి వెళ్ళిపోయారంటే మిగతావాళ్ళకికూడా అనుమానానికి కారణం అవుతుంది. అందులో ఆ కరుణాకరం అసలు మంచిమనిషిగాదు. ఏదైనా సృష్టించగలడు. ఎట్లైనా తిప్పగలడు.'

జయంతి మొహం తిప్పేసుకుంది. ఈ లెక్చర్లన్నీ తన కెందుకు! చెప్పదల్చుకున్న దేదో సూటిగా ఒక్క మాటలో చెప్పగూడదూ! రేఖారాణి సరిగ్గా అదే అంది. 'పరిస్థితులివి. మీరు పెళ్ళిచేసుకోదలుచుకుంటే వెంటనే చేసుకోండి. లేకపోతే శేఖరం వెంటనే ప్రయత్నాలను చేసుకునేలా ఒప్పించు—'

'నేనా?—'

'నువ్వు కాబోతే యింకెవరు? అతను స్వయంగా ఏదీ. చెప్పలేక పోతున్నాడు. కారణం నాకుతెలుసు. ఏం చేస్తాడు. పరిస్థితి అడకత్తెరమధ్య పోకలా తయారైంది అందుకే నిన్ను నేను స్పష్టంగా అడుగుతున్నది. అతనికి నీ మీద కేవలం జాలేనా? లేక—'

"నాకెలా తెలుస్తుంది?—'


'తెలియవంటే యెలా? వయసు వికసించినదానివి ఆమాత్రం అర్థం చేసుకోలేవంటే మే మెలానమ్ముతాం—'

క్షణంక్రితం నువ్వు పసిదానివి నీకేం తెలియదన్న మనిషి! జయంతికి కోపం వచ్చింది.

'క్షమించాలి. ఇందులో నేను చేయ గలిగిందేమిటో నాకు కన్పించడం లేదు:"

'శేఖరం అంటే నీకేమాత్రం ఆసక్తి లేదని చెప్పు."

'ఎలా?—' జయంతి గుండెలు ఆగినట్టయింది. శేఖరం అంటే తనకి ఆసక్తిలేదూ! అతనంటే అసహ్యం వున్నమాట నిజమే! కాని గౌరవానికికూడా యేం తక్కువలేదే! యెలా ప్రవర్తించినా, యెంతమూర్ఖంగామాట్లాడినా ఒక్కసారి అతని కళ్ళలో కన్పించే ఆప్యాయతకి తనెంత కరిగిపోతుంది! తనకి ప్రపంచంలో అప్తులంటూవుంటే సునంద తర్వాత అతనేగా!



'దగ్గర వుండటం మంచిదిగాదు. రాజశేఖరానికి ఎంతసేపూ తన ధోరణి తనది కాని బైట ప్రపంచపు గొడవే పట్టదు. అనేవాళ్ళెప్పుడూ మనదగ్గరకొచ్చి మొహం మీద అంటారా చెప్పు? అక్కడక్కడా వ్యంగ్యంగా మాట్లాడుకుంటూరు. ఒక విధంగా శేఖరం మా అందరికీ చాలా దగ్గిరవాడు. అతన్ని గురించి అసహ్యంగా ప్రచారం జరుగుతుంటే బాధేస్తుంది. అక్కడకీ ఒకటి రెండు సార్లు హెచ్చరించబోతే నిర్లక్ష్యంగా తలతిప్పేసి వూరుకున్నాడు. ఎంతయినా మగవాళ్ళు మగవాళ్ళే. కనీసం నువ్వయినా దీన్ని గురించి కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది' అంది.

జయంతి తలెత్తి చూసింది.

'మీ ఇద్దరికీ ఒకరిపట్ల ఒకరికి అనురాగంవుంటే వెంటనే పెళ్ళి చేసేసుకోండి. ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు?—"

జయంతి కళ్ళు క్రిందకు వాలిపోయినాయి. రేఖారాణి మాటల్లో. హుందాతనం, ఆ దర్పం, మాటాడే తీరు తనేదో తప్పుచేసినట్లు భయపడేలా చేశాయి.

'అసలు నీతో అలాటి ఉద్దేశ్యం ఏమైనా వున్నట్టు ఎప్పుడైనా బైట పెట్టాడా?—'

జయంతి సమాధానం యిచ్చేందుకు ఒక్క నిమిషంగూడా అవకాశం యివ్వకుండానే 'నాకు తెలుసులే. నేను యీ ప్రసక్తి తెచ్చి

నప్పుడు కేవలం జాలితప్ప తనకే వుద్దేశ్యం లేదని చెప్పాడు. అది యెవరు కాదంటారు? నీ పరిస్థితులు అలాంటివి. కాని చిక్కెక్కడంటే— ప్రపంచం అతన్ని పూర్తిగా అపార్థం చేసుకుంటోంది. వెధవప్రపంచం. దిక్కుమాలిన సంఘం. వయసులో వుండడమే అపరాధం. అందరి విషయాలూ వీళ్ళకే కావాలి. సహాయం చేసే వాళ్ళు — తీసుకునే వాళ్ళు నిష్కల్మషంగా వున్నా మధ్యవాళ్ళకెందుకో యేడుపు—' క్షణంసేపు ఆగి 'ఏదయినా—ప్రపంచానికి మనం అక్కరలేకపోయినా మనకి ప్రపంచం కావాలి. మనిషి అన్న తర్వాత ఒంటరిగా బ్రతకలేం కదా! ఈ అపవాదుల వల్ల నీకేంనష్టం లేకపోయినా అతను చాలా నష్టపోతున్నాడు. ఇంకా నష్టపోతాడుకూడా!—'

జయంతి తలెత్తి చూసింది.

'ఈవిధంగా జరిగి— ప్రమీలని పెళ్ళి చేసుకోవడం జాప్యం చేసేటట్లయితే కరుణాకరంగారు వ్యాపారంలోంచి...' రేఖారాణి కనుబొమలు ముడిపడ్డాయి.

'ఎలా అని నన్నడగాల్సిన ప్రశ్న కాదు. ఆడవాళ్ళకి ఎదటివాళ్ళని అసహ్యించుకుంటున్నట్లు, అభిమానిస్తున్నట్లు ఈ రెండూ తెలియజేయటం పుట్టుకతో వస్తుంది. ఒక విషయం నువ్వు కల్లోగూడా మర్చిపోవద్దు జయంతీ! శేఖరానికి నువ్వంటే మనఃపూర్వకంగా యిష్టం వుందని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాడని తెలిస్తేసరే! నేను చెప్పేది ఏమీ లేదు. కాని కేవలం అతను జాలితో వివాహం చేసుకోటానికి సిద్ధపడ్తే నువ్వు ఒప్పుకోకు. ఈ విషయం నేను స్వానుభవంతో చెబుతున్నాను. అదెంతవరకో నీకు తెలియదు' రేఖారాణి మొహంలో బాధ మనసులో వెలితికి ప్రతిబింబంలా కన్పించింది.

'నువ్వాలోచించుకో! శేఖరం క్షేమం కోరేవాళ్ళలో నువ్వుగూడా ఒకదానివన్న సంగతి నాకూ తెలుసు. అందుకే యింత ధైర్యంగా చెప్పటానికి వచ్చాను. జయంతీ! మగవాడయినాసరే, ప్రపంచం అయినా సరే పెళ్ళికాగానే భర్తకి అన్ని విధాలా కలిసివస్తే గౌరవిస్తుంది. అపురూపంగా చూస్తుంది. ఏదైనా ఎగుడు దిగుడు జరిగితే పాదం మహిమ అంటూ వెక్కిరిస్తుంది. అప్పుడూ యీ జాలీ—ఈ మోజు గాలిలో ధూళిలా చెల్లాచెదరైపోతుంది. ఎటుచూసినా నరకం తప్ప యింకేం మిగలదు. ఆతర్వాత నీ యిష్టం. నే వస్తా—' రేఖారాణి వెళ్ళటానికి లేచింది.

'నీకీ విషయాలన్నీ బాధ కలిగిస్తాయేమోనన్న అనుమానం నాకు లేకపోలేదు. కాని యింతకంటే మార్గం లేకపోయింది. ఏమనుకోకు—నువ్వు నాకు చెల్లెలిలాంటిదానివి.'

ఓ సారి జయంతి భుజంమీద ఆప్యాయంగా తట్టి రేఖారాణి వెళ్ళిపోయింది. మాటల్లో ఎంత తీపి!

హోరుగాలిలో చిగురుటాకులా జయంతి మనసు ఉనికి తెలియకుండా కొట్టుకుపోసాగింది. ఏమి టిది? ఎందుకిలా అయింది! ఎందుకిలాఅయింది!

శేఖరానికి తనంటే జాలితప్ప ఏంలేదూ! పెళ్ళి చేసుకుంటానని నిశ్చయానికి రావటానికి కారణం కేవలం జాలేనా? అతని మనసులో అంతకుమించి యింకేమీ లేనేలేదా? కాదు, వుందనటానికి సాక్ష్యం ఏది? బాధనిపించినా మనసు ముక్కలుగా కోసినట్టున్నా రేఖారాణి మాటలెంత నిజం. ఎన్నిసార్లు తనని దగ్గరకి తీసుకున్నాడు. అందులో ఉద్రేకంలేదు. కోర్కె లేదు. అదంతా తన వూహేనేమో! నిజంగా ప్రేమించిన మనిషయితే ఇన్నిరోజులు ఇలా కలిసివుంటే ఏ అనుభూతి లేకుండా వుండగలడా! ఏమో తనకెలా తెలుస్తుంది. కేవలం జాలే అయితే ప్రమీలని చేసుకోటానికి ఆలస్యం ఎందుకు చేయాల? ఇంకోరకంగా ఆదుకోవచ్చుగా! రేఖారాణి అసలు వుద్దేశ్యం ఈ పెళ్ళి జరిగితే అతను పొందిన దానికంటే పోగొట్టుకునేది ఎక్కువని చెప్పటమా! భగవాన్! అసలు శేఖరం ఎవరు – తనెవరూ – ఇద్దరి జీవితాలూ ఇలా ఎందుకు చిక్కుపడినాయి?

జయంతి చాలా కష్టంమీద తన గదిలోకి వెళ్ళగలిగింది. అతనెలాటివాడయినా కానీ! తనకెంత సాయం చేశాడు! ప్రపంచం అసహ్యంగా మాట్లాడుందని తెలిసిగూడా నిర్లక్ష్యంగా వూరుకున్నాడు. కారణం? తను వంటరిదని, యింకెవరూ లేరని—ఈ సమయంలో ఆదుకోవడం తనవిధి అనుకోబట్టేగా! దీనికంతటికీ పర్యవసానం అతని సర్వనాశనమా! ఛి—ఛి—అసలు యిన్నిరోజులు యీ యింట్లో వుండడం యెంత తెలివితక్కువతనం! యేం చెయ్యాలి — యెక్కడికైనా వెళ్ళిపోతానంటే వెళ్ళిపోనివ్వడు. భగవాన్! భగవాన్! నా కేదయినా

● ముద్దాయి : 'పీడరుగారూ! తవఁరు నన్నీకేసునుంచి గట్టెక్కిస్తే ఒక జేబుగడియారం, ఒక రవ్వలుంగరం ఫీజుగా ఇచ్చుకుంటానండి.'

ప్లీడరు : 'సరే. ఇంతకీ నీమీద కేసేమిటి?'

ముద్దాయి : 'జేబుగడియారం, రవ్వలుంగరం దొంగిలిచానని, బాబూ!'

—ఆర్. వి. సుబ్బారావు.

డోవచూపించు—జయంతి దిండులో తలదాచుకుని నిశ్శబ్దంగా యేడవ సాగింది.

చాలా సేపయిం తర్వాత—

'జయా!—' అంటూ గుమ్మం లోంచి పిలుపు వినగానే జయంతి గుండెలు కొట్టుకున్నాయి.

'చీకట్లో పడుకున్నావేం? —' శేఖరం లోపలికివచ్చి లైటు వేసే లోపల చప్పున కళ్ళు గట్టిగా వత్తుకుంది.

'అదేమిటి అలా పడుకున్నావేం?—'

మాట్లాడే సాహసం లేక వూరుకుంది.

'ఏదీ యిటు తిరుగు—'

జయంతి తిరగలేదు. అతను దగ్గరగా వచ్చి బలవంతంగా తిప్పి చూస్తాడు. అప్పుడు చెప్పక తప్పదు. పోనీ—చెప్పేస్తుంది. చెప్పేస్తే ధైర్యం చెబుతూ యేదైనా చెప్తాడు. కాని జయంతికి నిరాశ కల్గింది. శేఖరం దగ్గిరగా రాలేదు. దూరంగా నిలబడే 'నేను రేపు ఉదయం విజయవాడ వెడ్తున్నాను. ఎల్లుండి సాయంత్రానికి వచ్చేస్తాను. సునందా వాళ్ళని మనింటికి రమ్మనమని కబురు చేశాను. ఎవరో బంధువులు వచ్చారని భర్త చెప్పాడు. లేకపోతే నువ్వే వెళ్ళు—'

జయంతి మాట్లాడలేదు.

శేఖరం క్షణంసేపాగి 'వాళ్ళింట్లో గొడవగా వుంటుందనుకుంటే డాక్టరు గారింటికి వెళ్ళు. వెడ్తావా?—'

అలా బోర్లా పడుకునే వెడ్తానన్నట్టు తలూపింది. వెళ్ళిపోబోతూ గుమ్మందగ్గర మళ్ళీ ఆగిన శేఖరం 'ఈ ఒక్కసారి అలా చెయ్యి. ఈ సారినుంచీ వూరు వెళ్ళేటప్పుడు నా వెంటే ఉంటావు. ఇం కెప్పుడూ అలాటి అవసరం వుండదు' అన్నాడు. అతను మెల్లిగా నవ్విన శబ్దం విన్పించింది.

'నేను తెల్లవారుఝామునే వెళ్ళిపోతాను. నువ్వు నిద్రపోతూ వుంటావు. లేపను,' అని వెళ్ళిపోయాడు.

● ● ●

మర్నాడు జయంతి లేవకముందే వెళ్ళిపోయాడు శేఖరం. జయంతి మనసుమీద యినపదూలం పెట్టినట్టు బరువుగావుంది. ఏం చెయ్యటానికి— ఏం చెయ్యాలని ఆలోచించుకోవటానికి 24 గంటల టైమ్. శేఖరం తిరిగి వచ్చేసరికి తను కన్పించకూడదు. కాని యెలా—యెలా? సునందావాళ్ళింటికి వెళ్ళినా, డాక్టరుగారింటికి వెళ్ళినా, లాభంలేదు. తిరిగి రాగానే వెంటనేవచ్చి తీసుకెళ్ళిపోతాడు. అతని మాటల్లో మృదుత్వమేగాక కళ్ళలో యేదో ఆకర్షణ వుంది. ఆ ఆకర్షణ పెంపుడు కుక్కలా వెంట వెళ్ళిపోయేటట్టు చేస్తుంది.

సాయంత్రం గూడా అయింది. జయంతికి యెంత ఆలోచించినా యేమార్గం దొరకలేదు.

'మా బాస్ లేరా—' శివరామ్ దగ్గరగావచ్చి అడిగినప్పుడు కాని అతను వచ్చినట్టు గుర్తించలేదు.

'శివరామ్!—' అనుకోకుండా అతను కన్పించేసరికి ప్రాణం లేచి వచ్చింది. ఇదేమిటి? ఇంతసేపు ఆలోచనలో ఒక్కసారికూడా ఇతను గుర్తు రాలేదేం?—

'ఏమిటి? అలా ఒంటరిగా కూర్చున్నారే? — తపస్సు చేస్తున్నట్టు—'

'తపస్సు కాదు—ప్రార్థన—'

'ఎవర్ని?— ఏమని—' ఆసక్తిగా అడిగాడు.

'భగవంతుడిని—ఒక ఆప్తుడిని ప్రసాదించమని—'

'సారీ! నేను డిస్టర్బ్ చేశా ననుకుంటాను—'

'ఉహు! ఇంతలో సరిగ్గా మీరు వచ్చారు.'

'చిత్రంగా వుందే! అంటే మీ ఉద్దేశ్యం ఆ ఆప్తమిత్రుప నేనే అనా?—'

'ఖచ్చితంగా!—'

శివరామ్ సర్దుక్కూర్చున్నాడు.

జయంతి మొహం ఎర్రబడింది. తనేమని అడగబోతోంది?

'చెప్పండి. ఏమిటి మీ కొచ్చిన కష్టం—'

'సాయంకావాలి—'

'కష్టాలొచ్చినవాళ్ళకి కాకపోతే—ఇంకెవరికి సాయంచేసేది—'

'శివరామ్!—' జయంతి ఆగిపోయింది.

'చెప్పండి. సందేహించకండి—'

'తీరా నే చెప్పింతర్వాత కాదంటే—'

'అనను.'

'నన్ను—నన్ను—'

'మిమ్మల్ని—?'

'పెళ్ళిచేసుకో శివరామ్.'

శివరామ్ నిశ్చేష్టుడైపోయాడు.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం ఏర్పడింది.

'శివరామ్! ఇలా సూటిగా అడిగేశానని నన్ను సిగ్గులేని దానిగా అనుకోవుగా!—'

శివరామ్ యింకా చూస్తూనే వున్నాడు.

'నీకూ యెవరూ లేరు—నాకూ లేరు. మనం రిజిష్టర్ మ్యారేజ్ చేసేసుకుందాం—'

శివరామ్ కొద్దిగా తెప్పరిల్లాడు.

'నిన్నెప్పుడూ దేనికీ బాధపెట్టను. కావాలంటే కాగితంమీద వ్రాసియిస్తాను. శివరామ్! ప్లీజ్. ఈ యింట్లో ఒక్కక్షణంగూడా నేను

వుండలేను. నన్ను దీన్నుంచి రక్షించవూ!—'

ఎంతసేపటికి సమాధానం రాక పోయేసరికి జయంతి అనుమానంగా తలెత్తి చూసింది. శివరామ్ మొహం పాలిపోయివుంది. వచ్చినప్పుడున్న హుషారు మచ్చుకికూడా లేదు.

'చెప్పు — నేనంటే యిష్టం లేదా?—'

'వుంది—కాని—'

'అమ్మయ్య. క్షణంలో యెంత భయపెట్టావు.'

'జయంతీ!—'

'చెప్పు—'

'కాని—'

'కానీ?—ఏమిటి 'సందేహం? ఓ! నాకు తెలుసులే! అర్థమైంది. శేఖరం ఏమైనా అంటాడనేగా! అంటానికి అతనెవరూ మధ్య— మనిద్దరం యిష్టపడి పెళ్ళి చేసుకుంటుంటే—'

'అదికాదు—'

'ఏదికాదు—'

'కాని జయంతీ!—' మళ్ళీ ఆగిపోయాడు.

'త్వరగా చెప్పు—'

'నిన్నెప్పుడూ నే నా దృష్టితో చూడలేదు—'

'పోనీ! మంచివాడివి కాబట్టి నీ కలాటి ఉద్దేశాలు రావని నాకు తెలుసు. అందుకే నాకు నచ్చావు.'

శివరామ్ చేష్టలుడిగిన వాడిలా చూడడం మొదలుపెట్టాడు.

'నిజంగా! నేను మనస్ఫూర్తిగా చెప్తున్నాను. నీకేం అభ్యంతరం లేదుగా!—'

చటుక్కున లేచి కిటికీ దగ్గరగా వెళ్ళి బైటకి చూస్తూ నిలబడిపోయాడు.

జయంతి లేచి వెనకాలే వెళ్ళింది.

'శివరామ్! కనీసం' వాక్యం పూర్తి కానేలేదు. అతను చివ్వున వెనక్కు తిరిగి 'సారీ! జయంతీ! నేనేం సాయం చేయమన్నా చేస్తాను కాని—యిదిమటుకు—' ఆ క్షణం సేపు ఆగిపోయి 'జయంతీ! యిది నువ్వు నిజంగా అనలేదని, నాతో తమాషా చేస్తున్నానని చెప్పు—' అన్నాడు.

జయంతి అతనివైపు రెప్పవాల్చకుండా చూస్తుండిపోయింది.

'ఆయనకి తెలిస్తే యేమనుకుంటారు?—' అన్నాడు.

'ఓ!—' జయంతి గిరుక్కున తిరిగి కుర్చీదగ్గరకివచ్చి నిలబడింది. 'నాకు తెలిసిందిలే! అతనికి యేం జవాబు చెప్పాల్సి వస్తుందోనని నీ భయం—'

'కాదు—'

'ఇంకేమిటి?—'

శివరామ్ మౌనం వహించాడు.

'ఛీ! నువ్వింత పిరికివాడవని కల్లోకూడా అనుకోలేదు—'

'నాది పిరికితనం కాదని తర్వాత తెలుస్తుంది. నా మాట విని—ఇలాటి ఆలోచలను కనుచూపు మేరలోకి కూడా రానివ్వద్దు—'

'నీ సలహాలు నా కవసరం లేదు—' విసురుగా అంది జయంతి.

ఇద్దరూ చాలాసేపు నిశ్శబ్దంగా నిలబడిపోయారు. జయంతికి సిగ్గుతో, అవమానంతో ప్రాణం పోతోంది.

'నే వెళ్తాను. ఈ సారి ఆయన కన్పిస్తే మిమ్మల్నిలా వంటరిగా ఉంచటం మంచిదికాదని ఎప్పుడూ వెంట ఉంచుకోమని సలహాకూడా చెప్తాను. జయంతీ! తొందర అభిప్రాయలవాళ్ళకి వంటరితనం ఎంత హాని చేస్తుందో నాకు తెలుసు—'

శివరామ్ అందేంత దూరంలో వుంటే చాచి చెంపమీద కొట్టాలన్నంత కోపం వచ్చింది. కళ్ళలో కోపం నిప్పులు చెరిగింది. అప్పటికే శివరామ్ వెళ్ళిపోయాడు.

• • •

కారు వద్దని డ్రైవర్ని పంపేసి సునందా వాళ్ళింటికి బస్సుమీద వెళ్ళటానికి వంటరిగా బైలుదేరింది జయంతి. రబ్బరుబంతి నేలమీదికి కొట్టగానే పైకెగిరినట్టు జీవితం శేఖరాన్నుంచి యెంత దూరం పారిపోవాలని ప్రయత్నిస్తే అంత దగ్గరకి లాగుతోంది. ఇహ తప్పదు. ఎవర్ని అడిగినా ఒకటే సలహా. ఒకటే మాట. ఎవర్నీ అడక్కుండా చేసేందుకు తనకి స్వయంగా ఏ వుపాయం తోచటం లేదు. ఏం చెయ్యాలి? పరధ్యాసగా రోడ్డుమీద నడుస్తున్న జయంతి వెనకనుంచి వస్తున్న కారుని గమనించలేదు. బొంయ్‌మంటూ మోగిన హారన్‌తో కారు ప్రక్కకెళ్ళి సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. డ్రైవర్ కోపంగా చూశాడు. జయంతి గూడా అతనివేపే చూసింది.

'అరె! మీరా — చంపారు పొండి. క్షణంలో ఈ రోజు నా చేతులో మీ చావుని తప్పించుకున్నారు—'

కారులోంచి దిగివస్తున్న ప్రకాశం నవ్వుతూ అన్నాడు. ఈ మధ్య అతను కన్పించి చాలారోజులైంది. మనిషి యిదివరకుకంటే కొద్దిగా చిక్కినట్టు, యింకొంచెం పొడుగైనట్టు అన్పిస్తున్నాడు.

'సారీ!—' అంది జయంతి.

'క్షమార్పణలు తర్వాత—యీ విచిత్రం మేమిటి? మీరు కాలినడకని బైలుదేరారు యెందుకు?

కేవలం నాలాటి వాళ్ళని జైలుకి పంపాలని కాబోలు—'

జయంతి మాట్లాడలేదు. ఇదివరకు తనుగడిపినజీవితం వాళ్ళంతా మర్చిపోయినట్టున్నారు.

'చెప్పండి. ఎందాక?—'

'సునందావాళ్ళింటికి —'

'రండి. నేను డ్రాప్ చేస్తాను.'

జయంతి క్షణంసేపు ఆలోచించి వచ్చికూర్చుంది.

ప్రకాశం డ్రైవ్ చేస్తున్నాడు. జయంతి మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోయింది.

'మీ కభ్యంతరం లేకపోతే నా రూమ్ యిక్కడే—ఒకకప్పు కాఫీ తాగి వెల్దురుగాని—'

పరధ్యానగా వున్న జయంతి సమాధానం చెప్పలేదు.

ప్రకాశం మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడు.

కారు తెల్లగా చిన్నగావున్న ఓ డాబాముందు వచ్చి ఆగింది.

'ఇదేమిటి ?—' అంది జయంతి ఆశ్చర్యంగా.

'మా యిల్లు. ఓ అరకప్పు కాఫీ తాగి వెళ్దురుగాని—'

జయంతి సందేహంగా చూస్తూ కూర్చుంది.

'దిగండి—ఫరవాలేదు. నేను అదృష్టంగా భావిస్తున్నదాన్ని మీరు అనవసర భయాల్తో నిర్లక్ష్యంచేసి వెళ్ళిపోవద్దు—'

జయంతి దిగి లోపలికి వచ్చింది. గదికంటే పెద్దగా, హాలు కంటే చిన్నగావున్న రూము. టేబిల్, మంచం, గోడకున్న అలమరలో నీట్‌గా పెట్టుకున్న పుస్తకాలు యజమాని వ్యక్తిత్వాన్ని వాటికి చేతనైనంతివరకూ చెప్పటానికి ప్రయత్నిస్తున్నాయి.

ప్రకాశం గోడకున్న ఫ్లాస్క్ తీసి బోయ్‌ని పిలిచి కాఫీ తెమ్మనిచెప్పాడు.

'అరె! ఇదేమిటి—'

మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకుని ఎటో చూస్తున్నదల్లాతన ఫొటోని చూసి జయంతి తెల్లబోయింది.

ప్రకాశం గిరుక్కున వెనక్కు తిరిగిచూసి వెంటనే సర్దుకుంటూ 'ఓ! అదా! హిమాయత్ సాగర్ దగ్గర—ఆరోజు పిక్నిక్ వెళ్ళినప్పుడు మీకు తెలియకుండా నేను తీసుకున్నాను—'

'ఎంత ధైర్యం—' మొహంలో కోపం కన్పిస్తుండగా అంది.

'అందమైన వస్తువుని ఆరాధించడంలో ధైర్యం ప్రసక్తి ఏం లేదు. మీకు అభ్యంతరం ఏమైనావుంటే ఆ ఫొటో మీరు తీసుకెళ్ళిపోవచ్చు. కాని వెనక ప్రెజెంటెడ్ బై ప్రకాశం అని వ్రాసిగాని యివ్వను—'

'ఈ ఫొటో ఇక్కడ చూస్తే ఎవరైనా ఏమనుకుంటారు.'

'ఎవరూ చూడరు. అసలు దాని స్థానం నా పెట్టెలో. ఉదయం ఎందుకో సర్దుతూ తీసి టేబిల్ మీదపెట్టి మర్చిపోయాను. అందాన్ని పొందాలంటే అదృష్టం కావాలి. ఆరాధించటానికి హృదయముంటే చాలనుకుంటాను.' అన్నాడు.



బోయ్ కాఫీ తీసుకురావటంతో ప్రసంగం ఆగిపోయింది.

'చెప్పండి. ఇంకేమిటి విశేషాలు ?—శివరామ్ ఈమధ్య కలిశాడా ?—' కాఫీకప్పు అందిస్తూ అడిగాడు.

జయంతి కనుబొమలు ముడుచుకున్నాయి. మొహంకూడా ముకుళించుకుంది. 'ఇంతక్రితమే కన్పించాడు.' అంది ముభావంగా.

'ఏం! మీ యిద్దరిమధ్య

భేదాభిప్రాయం యేమైనా వచ్చిందా?...'

'ఎందుకలా అడుగుతున్నారు?'

'శివరామ్ పేరు చెప్పగానే మీ ముఖం అప్రియమైన సంగతి విన్నట్టు మారింది. సహజంగా మీ రిద్దరూ మంచి స్నేహితులని నాకుతెలుసు-'

జయంతి నిట్టూరుస్తూ 'స్నేహానికి నిర్వచనం చెప్పగలరా?—'అంది.

'నాకు తెలిసినంతవరకూ మన స్థితిగతులతో ప్రమేయం లేకుండా అన్ని వేళలా మన మనసుని అర్థంచేసుకోగలిగి—అవసరంలో ఆదుకోటానికి సిద్ధపడే మనిషిని స్నేహితుడని చెప్పుకోవచ్చు'

'అయితే నాకు శివరామ్ స్నేహితుడు కాడు—'

'అంటే?—'

'ఇంతక్రితమే నేనో సహాయం అడిగితే కాదన్నాడు'

'నిజంగా? చెయ్యననటానికి ఎంత ధైర్యం. ఇంతకీ ఏమిటా సహాయం—'

జయంతి జవాబు చెప్పలేదు.

'చెప్పండి—పోనీ అతను చేయలేని పరిస్థితుల్లోవుండి నేను చేయగలిగిన స్థితిలోవున్నానేమో!—'

జయంతి అతన్ని పరీక్షగా చూసింది.

'చెప్పండి. భగవంతుడిసాక్షిగా చెప్తున్నా. నేనుమీకుసహాయంచేయటంలో మీకేం ఆపద రాకుండా గూడా చూడగలను—'

'ఈ వూరునుంచి పంపేసి నన్నెక్కడైనా ఓ పదిరోజులపాటు దాచి వుంచగలరా!—'

ప్రకాశం తెల్లబోయినట్టు చూశాడు.

'ఎక్కడికైనాసరే! కాని నా ఉనికి ఎవరికీ తెలియకూడదు—'

అతనింకా అలాగే చూస్తున్నాడు.

'ఎందుకు, యేమైంది, అవన్నీ నేనిప్పుడు చెప్పలేను. తర్వాత మెల్లగా చెప్తాను—'

'(... ... ...)'

'ఏం మాట్లాడరేం?—'

ప్రకాశం యిప్పటికి తేరుకున్నాడు.

'మీరంతా యీ వూరునుంచి వెళ్ళిపోవాలనుకుంటే యీ రాత్రి ట్రెయిన్‌కే మిమ్మల్ని బెంగుళూరు పంపించ గలను—'

జయంతి క్షణంసేపు ఆలోచించింది. వెంటనే ఒక నిశ్చయానికి వచ్చేసినట్టు 'దయయుంచి వెంటనే ఆ ప్రయత్నం చేయండి. ట్రెయిన్ యెన్నింటికి వుంది?—' అంది.

'మీరు నిజంగానే చెబుతున్నారా?'

ప్రకాశం అనుమానంగా చూశాడు.

'నిజంగా! భగవంతుడి సాక్షిగా చెబుతున్నా. కొద్దిరోజులు నేనెక్కడుందీ — అసలు వచ్చిపోయిందీ బ్రతికివుందికూడా యెవరికీ తెలియకూడదు. ముఖ్యంగా శేఖరానికి—'

ప్రకాశానికి సగం అర్థంఅయింది. కారణం యేమిటో తెలియదు కాని జయంతి రాజశేఖరం నుంచి పారిపోవాలనుకుంటోంది. అందుకే బహుశా శివరామ్ ఒప్పుకునివుండకపోవచ్చు.

'చెప్పండి. మీరు నన్ను దాచగలరా?—'

'దాచగలను—'

మళ్ళీ నిశ్శబ్దం ఏర్పడింది.

'కాని నా దగ్గర డబ్బులేదు—'

'నాన్సెన్స్! డబ్బుగురించికాదు—'

'నా గురించా?—నేనిది మనస్ఫూర్తిగా చెప్తున్నాను. మీరు నమ్మకపోతే నేను స్వయంగా వ్రాసి యిమ్మంటే యిస్తాను. ఇదంతా కేవలం నా ప్రోద్బలమేనని— ఇందులో మీకేం భాగం లేదని—'

'థ్యాంక్స్. వద్దు. మీ మాట చాలు—' ప్రకాశం టేబిల్‌దగ్గర కెళ్ళి ట్రెయిన్ గైడ్ తీసి చూశాడు.

'8-30 కి ట్రెయిన్ వుంది, కాచిగూడానుంచి—'

'దానికి పంపే ఏర్పాటు చేయగలరా—' అంది.

'చేయగలను—' చేతి వాచి చూసుకుని 'ఇంకా చాలా టైముంది. నేనిప్పుడే బజారుకి వెళ్ళివస్తాను. అన్నాడు.

'బజారెందుకు?—'

'మీకు కావాల్సిన అవసరమైన సామానులు తీసుకొస్తాను.'

'ఓ!—' జయంతికి ఏం చెప్పాలో తోచలేదు.

త్వరగా వచ్చేస్తాను. ఈలోపల మీరింకా బాగా ఆలోచించుకోండి. చివరి నిమిషంలో మీరు కాదన్నా నే నేమీ అనుకోను. ఈ క్షణం నుంచి నేను మీకు స్నేహితుడిని.' అన్నాడు నవ్వుతూ.

'థ్యాంక్స్—'

ప్రకాశం వెళ్ళబోతూ క్షణం ఆగి 'బైదిబై మీరేమీ అనుకోనంటే' అని ఆగిపోయాడు.

'చెప్పండి—'

'నేను గదికి బైట తాళంవేసి వెడ్తాను. సాయంత్రంకాబట్టి సహజంగా ఎవరైనా రావచ్చు. మిమ్మల్ని యిలా ఒంటరిగా నాగదిలో చూస్తే—'

'సరె—సరె—' అంది జయంతి.

ప్రకాశం బైట తాళంవేసి వెళ్ళిపోయాడు. ఏం చేస్తున్నాను. ఇది సరైందేనా? ఇందులో ప్రమాదం ఏమీలేదు గదా అన్పించ సాగింది మనసులో — కాని — ఇంతకంటే ఇంకో మార్గం లేదు. బెంగుళూరు వెళ్ళిపోతే అక్కడేదయినా ఉద్యోగం చూసుకోవచ్చు. మెల్లగా సునందకి మటుకు వుత్తరం వ్రాయచ్చు. అనుకుంది జయంతి.

(సశేషం)

యింకా రారేం? ఈ వెధవ శీతాకాలంలో యిట్టే చీకటిపడుతుంది సుమండీ. ఆఫీసునుండి యింటికొచ్చే సరికే దీపాలు పెట్టేస్తున్నారు" అన్నాడు మళ్ళీ విశ్వనాధమే.

డాక్టరు చిరునవ్వే అతనికి సమాధానం.

"మీకు పూలమొక్కల్లో ఎంత ఇంటరెస్టండీ. నిజంగా వూళ్ళోవున్న పార్కులోకూడా యిన్ని రకాల మొక్కల్లేవంటే నమ్మండి" చుట్టూ వున్న మొక్కలని చూస్తూ మెచ్చుకున్నాడు విశ్వనాధం.

"సారీ! ఇవాళ ఏదో వెధవ కాంట్రాక్టుపని చూసేసరికి బాగా లేటయిపోయింది" అంటూ ఇంజనీరు సిరాజ్ వచ్చి విశ్వనాధం ప్రక్కనే చతికిలపడ్డాడు. ఆరడుగుల పైచిలుకు పొడవున్న సిరాజ్ తన తోటివారి కంటె నైతికంగాను, శారీరకంగాను ఎంతో ఎత్తున ఉన్నట్టుంటాడు.

"అదేమిటి! మీరుకూడా క్రింద కూర్చున్నారా? ఫర్వాలేదు. కుర్చీలో కూర్చోండి. నా కిలా పచ్చికమీద పడుకోవడం అలవాటేగా" అన్నాడు డాక్టరు.

"ఐనా యింతవరకూ ఆ కుర్చీల్లో కూర్చున్న వాళ్ళమే కదటండీ. కాస్సేపు మెత్తగా ఇక్కడే కూర్చుందాంలెండి" అన్నాడు సిరాజ్ ఓ కుర్చీకి చేరబడుతూ.

"డాక్టరుగారి కివాళ పని ఎక్కువున్నట్టులేదే? తీరుబడిగా పడుకున్నారు" అన్నాడు విశ్వనాధం బోర్లా పడుకొని గడ్డిపరకల్ని లెక్కపెడుతున్న డాక్టరుతో. డాక్టరు సమాధానం చెప్పేలోగానే "ఆఁ! ఆఁ! తీరుబడిగా పడుకోరూ మరి? తన పనీ, నా పనీకూడా నాకే అప్పగిస్తే తీరుబాటుకాక యింకేమిటి? అయ్యో! అదొక్కర్తే అఘోరిస్తోంది. పోనీ కాస్త సాయం చేద్దామన్నమాట ఏకోశానా ఉంటేగా?" అని అంటూ సుడిగాలిలా చీదరగావచ్చి డాక్టరు పక్కనున్న కుర్చీలో కూర్చుంది డాక్టరుభార్య డాక్టరు విశాల. కుడీ ఎడమా భేదంలేకుండా మాట్లాడే స్వభావం ఆమెది. విభిన్న మనఃప్రవృత్తులుగల ఆమెదీ, ఆమెభర్తదీ ఎంతో అనుకూల దాంపత్యం.

"బాగా అలసి పోయినట్టున్నారు" అన్నాడు సిరాజ్ అభిమానం ప్రతిధ్వనించే కంఠంతో.

"అలసి పోవడమాఁ! ప్రాణాలు పోతున్నాయంటే నమ్మండి. అందులోనూ యీ డెలివరీ కేసులున్నాయే ఒకవేళా పాళాలేదు. ప్రాణాలు తోడేస్తున్నా యనుకోండి. అయినా వీటికి ఒక సీజనో లేకపోతే ఒక టైమో వుంటే బాగుండును" అంది విశాల అతిచిరాగ్గా.

"గిరీశం చెప్పినట్టు ప్రపంచంలో ఛైల్డ్ విడోస్ ఎక్కువమంది వుంటే మీ శ్రమ కొంతతగ్గేదేమో" అన్నాడు విశ్వనాధం మామూలు ప్రకారంతనకు లేని హ్యూమర్ ప్రదర్శిస్తూ.

"అప్పుడు మాత్రం ఏమిటి మహా గ్యారంటీ" సమాధానం చెప్పింది విశాల.

డాక్టరూ, విశ్వనాధం ఒక్కసారి ఫక్కున నవ్వేరు.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో విశ్వనాధానికి అర్ధం అయ్యేలోగా తన కాళ్ళవద్ద వెల్లకిలా పడుకొని తన చీర కుచ్చెళ్ళు చిన్న పింజెలుగా పెడుతున్న డాక్టరుతో "ఏమిటండి బాబూ! నాకాళ్ళదగ్గర పడుకున్నారు. ఇప్పటికే నేను మిమ్మల్ని కాల్చుకు తింటున్నానని, మీరు నా బానిస అని అంతా నన్ను తిట్టుకుంటున్నారు. మీకు పుణ్యముంటుంది. ముందు యిక్కడినుంచి లేవండి" అంటూ దూరంగా జరగబోయింది విశాల. డాక్టరు అదేమీ గమనించకుండా ఆమె తెల్లనేత చీర అంచులో ఎగిరే జరీపువ్వులను సీతాకోక చిలకలను చూస్తూ "యీచీర అంచు చాలా బాగుంది విశాలా. ఇది నేసిన వాడెవడో కవై యుండాలి." అని మెచ్చుకున్నాడు.

"ఎందుకండీ యీమాయమాటలు. ఈ చీకట్లో మీకు చీర అంచు పనితనం కన్పిస్తోందా? చేసే పనులు చేస్తూ నన్ను వుబ్బెయ్యడానికి చూడకండి. ఏదైనా అంటే పెద్ద ఆర్టిస్టునంటారు. మీరు పెన్సిలు పట్టుకోవడం నాకళ్ళతో ఎన్నడూ చూడలేదు" అంటూ దెప్పింది విశాల.

సిరాజ్ కాళ్ళు చాపుక్కూర్చొని గడ్డిపరకలు తెంచుతూ వీళ్ళ సంభాషణ వింటున్నాడు.

"ఇదివరకు వేసేవారుట గదండి బొమ్మలు?" అంటూ డాక్టరుని సమర్ధించ బోయేడు విశ్వనాధం.

"అదేనండీ నా ఏడుపు కూడా! నన్ను కట్టుకోకముందు వేసి నన్ను కట్టుకున్నాక మానేసేరంటే అర్ధమేవిఁటి? అక్కడికి నేనేదో ఆయన బొమ్మలేసుకుంటూ వుంటే అడ్డుపడినట్టు..." విశాల మాటపూర్తిచేయకముందే—

"ఏఁవిటి! ఏవో బొమ్మలంటున్నారు" అంటూ వుండలా దొర్లుకొచ్చేరు లావుపాటి బట్టతల సబ్ జడ్జిగారు. ఆయన, ఆయనతో వచ్చిన లెక్చరరు శంకర్రావు విశ్వనాధం పక్కనే కూర్చున్నారు.

"అయ్యయ్యో! మీరంతా క్రింద కూర్చుంటే నేనేవిఁటి తగుదునమ్మా

● బట్టతలాయన : "నా కంతా బట్టతలేగదోయ్. సగం రేటుకి చెయ్యొచ్చు."
మంగలి : "నిజమేగానండి, వెంట్రుకలు వెతికి పట్టుకోడానికి టైం పడుతుంది కదండి."

అని కుర్చీ ఎక్కేను. నేనూ కిందే కూర్చుంటాను' అంటూ లేవబోయింది విశాల.

'ఫర్వాలేదు. కూర్చోండమ్మా. మేమంతా యిప్పటివరకు నడుం కొట్టినట్టు కుర్చీల్లో కూర్చుని కూర్చుని విసిగిపోయినవాళ్ళమేకదా. మీ కూర్చోటానికే టైముండదు. ఎప్పుడూ నిలబడే వుంటారు. మీరలాగే కూర్చోండి. ఐనా యిక్కడెవరూ పరాయివాళ్ళం లేముగా' సర్దిచెప్పేరు జడ్జిగారు.

'మరి యింత చీకటిపడేవరకూ ఆ కోర్టులో ఎలా పనిచేస్తున్నారండీ?' అన్నాడు సిరాజ్.

'అదేనయ్యా బాబూ! ప్రపంచం అంతా అన్యాయంతో నిండిపోతోంది. ఎంత అన్యాయం పెరిగితే కోర్టుల్లో అంత పీకలు మునిగే పనుంటుంది? పాపం పెరిగిపోతోంది. కోర్టులు నిండిపోతున్నాయి' అన్నారు జడ్జిగారు. తన జీవితంలో ఎక్కువభాగం అన్యాయం అనే వాతావరణంలోనే గడిపినా అధర్మం ఆయన సహించలేరు. అందులో ఆయనకి రోజూ భయంకరమైన కొత్తదనం కన్పిస్తూనే ఉంటుంది.

'ఐతే మీ కోర్టుకి అన్యాయం, పాపమే వస్తాయంటారు?' అన్నాడు విశ్వనాథం హేళనగా.

'అధర్మం ఒక్కటే ఎప్పుడూ రాదు. దాన్ని ఎప్పుడూ ధర్మం, న్యాయం వెన్నంటే వుంటాయి. కోర్టుకి వచ్చిన ఒకరిది అధర్మం అయితే, న్యాయం రెండోవాడిదైయుంటుంది' తిప్పికొట్టేరు జడ్జీగారు.

'ఐతే జడ్జీగారూ! ప్రపంచంలో కల్లా ఎక్కువ అన్యాయం ఎవరికి జరిగిందంటారు?' విశాల చీరకుచ్చెళ్ళని వదలి ఆమె పాదాలని రకరకాలుగా పరిశీలిస్తూ ప్రశ్నించేడు డాక్టరు.

'నాకు' అంది తక్కున విశాల. 'మీలాంటి వార్ని కట్టుకోడం అన్యాయంకాక యింకేమవుతుందీ?' అని సాగదీసింది.

'ఈమాటలకేంగాని, నామట్టుకు నాకు అందరికంటె ఎక్కువ అన్యాయం శ్రీరాముడికి జరిగిందని తోస్తుంది' అన్నాడు సిరాజ్.

'అదేమిటోయ్! ఇలా రాముణ్ణీ, భీముణ్ణీ ఆరాధిస్తూ మాట్లాడేవంటే నిన్ను మీ వాళ్ళంతా వెలేసేస్తారు సుమా!' అన్నారు ఘొల్లున నవ్వుతూ జడ్జిగారు.

'మరి మనం అంతా మరిచిపోతుంటే అతనింకేం జేస్తాడు? ఇంత చదువుకునీ మనం యిలా దేముళ్ళకి జాతులు, మతాలు అంటగట్టడం అధర్మం' అంది విశాల.

'ఇంతకీ జడ్జిగారు నే నడిగిన దానికి సమాధానం చెప్పేరేకాదు' మళ్ళీ అడిగేడు డాక్టరు.

'ఏం చెప్పమంటావోయ్! ప్రతీదీ అన్యాయమే. ప్రతీ చోటా అన్యాయమే. మాటవరసకీ వేళ నేను చేసిన కేసే తీసుకో. పాపం! వాది ఒక పాతికేళ్ళమ్మాయి. చూడ్డానికూడా బాగానే వుంటుంది. కొద్దో గొప్పో చదువుకుందికూడా. చిన్నప్పుడే పెళ్ళయింది. పెళ్ళైన తర్వాత ఆమె మొగుడు ఎందుకో ఆవిడని కాపరానికి తీసికెళ్ళలేదు. చూసిం జూసింది. ఎన్నాళ్ళూరుకుంటుందీ? పదేళ్ళు ఛూసి యిప్పుడు మనోవృత్తి దావా పడేసింది... ...' చెప్పుకుపోతున్నారు జడ్జిగారు.

'అయినా ఆ మొగుడికేం రోగమండీ, పాపం ఆ అమ్మాయి నోదితెయ్యడానికి?' సానుభూతిగా అన్నాడు సిరాజ్ తనూ డాక్టరు పక్కనే పడుకుంటూ.

'బహుశా ఆ అమ్మాయి పూర్వచరిత్ర మంచిది కాదేమో' అన్నాడు విశ్వనాథం మహా తెలివిగా చెప్పాననుకుంటూ.

'ఆ అమ్మాయెవరో సత్తెకాలందై వుంటుంది. నేనైతేనా వాడి అంతేమిటో అప్పుడే తేల్చేద్దును' కోపంగా అంది విశాల.

'అదేంకాదు. ఆమె మొగుడు తన మామే తనకేదో అన్యాయం చేసేడంటాడు. కొందరిమనః ప్రవృత్తే అంత. అన్యాయానికీ, అధర్మానికీ పెద్ద సంఘటనలే ఉదాహరణలు కావు. మనకు ఎంత చిన్నగానో కనిపించే ఒక విషయం యింకోరికి ఎక్కువ కష్టం కలిగించవచ్చు. మనంతిట్టక్కర్లేదు. కొట్టక్కర్లేదు. మనం మోటుగా ప్రవర్తిస్తే చాలు బాధపడతాడు సున్నిత హృదయం గలవాడు...' అంటూన్న జడ్జీగార్ని 'మీరు చెప్పింది అక్షరాలా నిజం' అంటూ ఆటంక పరిచేడు డాక్టరు. ఒక్కక్షణం ఆగి 'మీరు చెప్పింది వింటూ వుంటే ఎప్పుడో జరిగిన సంఘటన జ్ఞాపకం వస్తోంది' అని కలిపేడు.

'అదేదో కాస్త సెలవియ్యండి' అన్నాడు విశ్వనాథం.

'డాక్టరుగారికి ప్రతీదీ అలాంటి సంఘటనే. అసలీయన ఏ కవిత్వం రాసుకుంటూనో, ఏ బొమ్మలేసుకుంటూనో గడపక యీ డాక్టరీ ఎందుకు చదివేరో నా ప్రాణానికి? పేషెంటు బాధ పడితే చూళ్ళేరు; పేషెంటు తాలూకువాళ్ళు ఏడిస్తే చూళ్ళేరు; వాళ్ళతో పాటు, తనూ ఏడిచినంత పనిచేస్తారు. ఏదో గవర్న

● భార్య : 'మీరు నా అందంచూసి చేసుకున్నారా, నా డబ్బుచూసి చేసుకున్నారా?'

భర్త : 'అందమైన నీ డబ్బుచూసి!'

మెంటు డాక్టరు గాబట్టి సరిపోయింది. ఏదో జీతం పారేస్తున్నారు. ఇదే ప్రైవేటు ప్రాక్టీసైతే మేమింత గడ్డితినేవాళ్ళం" అంది విశాల.

"డాక్టర్‌ది సున్నితమైన హృదయం—క్రితం జన్మలో ఎంతో పుణ్యం చేసుకుంటేగాని లభించదు" అన్నారు జడ్జీగారు.

"కథ కానివ్వండి" అన్నాడు సిరాజ్ ఆత్రంగా.

"ఇంతకీ కథ అందరికీ నచ్చకపోవచ్చు" అపరాధిలా అన్నాడు డాక్టరు.

"నన్నేనా మీరు ఎత్తిపొడిచేది?" అంటూ గొణిగేడు విశ్వనాథం.

"ఆయన అలా ఏం అనలేదు గదండీ" విసుక్కున్నాడు సిరాజ్.

"ఇది జరిగి చాల్నాళ్ళయింది" కథ ప్రారంభించేడు డాక్టరు. "వివరాలు అస్పష్టంగా జ్ఞాపకం వున్నాయి. మిగిలివున్నది మాత్రం ఒక చెరగని మాసిపోనిముద్ర." డాక్టరు ఒక్కక్షణం ఆగి మళ్ళీ ప్రారంభించేడు.

"అప్పుడు నేను మెడిసిన్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాను. ఏకాంతం కోరుకునే నాకు హాస్టలులో వుండడం యిష్టం వుండేది కాదు. ఎప్పుడూ ఊళ్ళోనే ఏదోగది తీసుకొని వుండేవాడిని. అదివరకు నేను వుంటున్న గది ఎందుకో ఖాళీ చేయవలసి వచ్చింది. పగలనక రాత్రనక తిరిగేను గదికోసం"

"అలా తిరగడంవల్లే కాబోలు మీకో పార్టుపోయింది" కథకి అడ్డొచ్చింది విశాల.

"కాదు విశాలా! ఆ సంవత్సరమంతా ఆరోగ్యం సరిగా వుండేది కాదు. చదవ్వలసినంత చదవలేకపోయేను, పరీక్ష తప్పేను.

"ఆ విశాఖపట్టణం సంగతి వేరే చెప్పాలా? కారుషెడ్లలో కాపురం వుండేవి కుటుంబాలు ఇళ్ళు దొరక్క! చివరికెలాగయితేనేం ఒక మేడ మీద వున్న ఒక్కగది సంపాదించగలిగేను. ఇంటాయన ఏదో బేంకు ఏజంటు. క్రింది భాగంలో వుండేవాడు. ఆ పురుషుడు యింట్లోవున్న అలికిడే వుండేదికాదు. ఎప్పుడువచ్చేవాడో, ఎప్పుడు పోయేవాడోగాని నా కంటపడేవాడుకాదు. ఎప్పుడూ కనిపించేది అతని భార్య. అప్పుడప్పుడు కనిపించేది అతని కూతురు. ప్రథమకుసుమం. ఆ తర్వాత ముగ్గురు కొడుకులున్నారు అతనికి. వాళ్ళలో ఎవరు బళ్ళోకివెళ్ళి దెబ్బలు తింటున్నారో, ఎవరు యింట్లోనేవుండి వాళ్ళమ్మ చేతిమీదుగా ఆ భాగ్యం అనుభవిస్తున్నారో నేనెప్పుడూ పట్టించుకోలేదు. వాళ్ళ ముగ్గురికీ వయస్సుక్రమంలో వాళ్ళమ్మ పెట్టిన మువ్వరస ముద్దుపేర్లు, జెష్ట వెధవ, రెండోగాడిద, చంటివెధవ. ఆవిడ కాలంలో వున్నప్పుడు రూపవతే అని చెప్పాలి. వయసు ముదిరేక కనినా తన సంతానంమీద ఏమాత్రం ప్రేమలేదావిడకు. మనిషిది తెల్లతొక్కే. లాలిత్యం, సున్నితం అలవర్చుకుంటే ఎంతో సున్నితంగా వుండివుండేది. కాని వాటిజోలికి ఆమె ఎన్నడూ పోయేదికాదు.

ఈ సాయంత్రం జుట్టు దువ్వుకుంటే మళ్ళీ మర్నాడు సాయంత్రం వరకూ ఆ జుట్టు తనది కాదన్నట్టు తిరిగేది. నిరంతరం దేన్నిగురించో ఆరాటపడుతూ అలసిపోయి గడిపేది రోజులు. ఎప్పుడుచూసినా అంటగిన్నో, చీపురుకట్టో చేతిలో వుండేది. ఎప్పుడూ ఎవరినో కసురుతూ, దాసీదాన్నో, బేంకుబంట్రోతునో తిడుతూ కోలాహలంగా గడిపేది కాలం. మనిషిమాట వింటే గంగాళాలు, సంక్రాంతిరోజుల్లో ఆంబోతుచుట్టూ వాయించే తాళాలు గుర్తుకు వస్తాయి. ఇంతకీ ఆవిడ తోటి స్త్రీలకంటె చెడ్డదనికూడా అనలేను.

"ఒసే, అమ్మాయ్! ఆ చంటివెధవకి మొహం కడిగేవే?" "వీరన్నా! జెష్టవెధవని నిద్రలేపు, బడి టైమవుతోంది." "ఒరేయి చంటీ! పాలగిన్నె ముట్టుకోకురా వెధవా, చురుకుతుంది." "ఒసే రాజమ్మా! ఇంకా అంటగిన్నెలు తోమిచావకపోతే పిండాకూడు ఎలా తగలెట్టేదే?" "వీరన్నా! నువ్వు వేగం బజారుకి తగులడు. లేకపోతే కూరలు చచ్చువి, పుచ్చువి మిగులుతాయి." ఇవీ రోజూ నాకు మేలుకొలుపువచనాలు. ఈ రాగవరసలోనే వుండేది రాత్రి జోలపాట కూడా. వాళ్ళ కుటుంబంతో నేను ఎటువంటి జోక్యం పెట్టుకొనేవాడిని కాను. వాళ్ళకీ నాకూ ఏమేనా సంబంధం వుందంటే వాళ్ళదాసీ రాజమ్మే. అదే నా గది కూడా ఊడిచేది.

కాలం ప్రవహిస్తోంది. రెండు ఋతువులు మారేయి నేను ఆ గదిలో చేరేక. చెప్పుకోదగినదీ, జ్ఞాపకం ఉంచుకోవలసినదీ ఏమీ జరగకుండానే రోజులు గడిచిపోయేవి. ఇంతలో అనారోగ్యం నన్ను వశం చేసుకుంది. అందోళన పడవలసిన

● రోడ్డుపక్కన కూర్చుని మందులమ్మేవాడితో ఒకడు : "ఈ లేహ్యం పుచ్చుకుంటే లావెక్కుతారంటున్నావు. మరి నువ్వింత బక్కగా ఉన్నావేం?"

"మందు పుచ్చుకోకముందు మనిషినన్నమాటండి, నేను. అడుగో అక్కడ కూర్చున్న ఏనుగులాంటి మనిషి, మా తమ్ముడు. మందు పుచ్చుకున్నతరవాత మనిషన్నమాటవాడు."

జబ్బు కాకపోయినా మంచం పట్టించింది పదిహేనురోజులు. ఆ జబ్బుకి ఆహార నిబంధనలేవీ లేకపోయినా ఒక సమస్య తలెత్తింది. హోటలు నుండి కాఫీ, భోజనం, బజారునుండి సిగరెట్లు, పళ్ళు తేవడానికి ఒక మనిషి కావాల్సి వచ్చింది. రాజమ్మ ఉదయం, సాయంత్రం ఒకగంటలో క్రిందవారిపని, నాపని చేసిపోయేది. అది చాలాయిళ్ళలో ఊడిగం చేసేది. ఇవిగాక రిక్షాలాగే తన మొగుడికి వండి పెట్టుకోవాలి. నాకు కొత్తగా కలిగిన పనులు ఆమె చేయలేదు. కాబట్టి ఆవిడనే కోరేను ఎవరైనా ఒక పిల్లనిగాని పిల్లాడినిగాని చూసి పెట్టమని. దానికేంభాగ్యం బాబూ రేపంపుతా మా చిన్నదాన్ని అంది. ఆ మర్నాడుదయమే వచ్చింది ఆమె కూతురు. నలుపైనా పేరుకుతగినట్టు లక్ష్మిలా కళకళలాడేది. ముఖంలో అర్థంలేని ఆకర్షణ, కళ్ళలోని అమాయకత్వం ఆమెకెంతో అందం చేకూర్చేయి. వయస్సు పది సంవత్సరాలు మించివుండదు.

మొదటిరోజు ఏపనితర్వాత ఏపని చెయ్యాలో తెలీక కంగారు పడింది. కాని మర్నాటి నుండీ నేనేమీ చెప్పనవసరం లేకుండా సర్వం తానే చక్కపెట్టుకుపోయేది. ఏ మాటకు తిరిగి సమాధానం చెప్పేదికాదు. విసుగు, అలసట ఆమెలో నేను చూడలేకపోయేను. ఏపని చెప్పినా నవ్వుతూ గెంతుతూ చేసేది. సాయంత్రం యింటికి పోతున్నప్పుడు నాదగ్గరున్న పండో, కాయో యిస్తే పుచ్చుకొని నేను చూడకుండా నా గదిలోనే వదిలి వెళ్ళిపోయేది. కేరియరులో అన్నం మిగిలితే నువ్వు తినవే అంటే తినకుండా పొట్లంకట్టి యింటికి తీసుకుపోయేది. మొదట్లో కొత్త పరిసరాలలో తినడానికి బిడియమేమోనని సంతృప్తిచెందేను కాని బహుశా తన కుటుంబంవారి కోసం పట్టుకెళ్తున్నదేమోనన్న ఆలోచన కలిగేసరికి నేను ద్రోహం చేసినవాడిలా బాధపడ్డాను. ఆపిల్లే పెద్దదైవుంటే నేను బాధపడివుండేవాడినికాను. ఆయీడు మన పిల్లలకు అన్నంకూడా సరిగ్గా తినడం రాదే? ఆపిల్ల చేసినపాపం ఏమిటి? నేను యిచ్చే విడిరూపాయలకు పరాయివాడినైన నాకు ఎందుకు వూడిగంచెయ్యాలి? ఇలాంటి ఆలోచనలతో శారీరకంగా నయమవుతున్నా మానసికంగాబాధపడేవాడిని.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆ పిల్ల నాకొక సమస్యగా, ఒక వ్యథగా తయారైంది. ఆ పిల్ల మంచితనం నాకు శూలంలా గుచ్చుకొనేది. ఆ పిల్ల ఏదైనా తప్పుచెయ్యాలని, మామూలు మనిషికుండే లోపాలు ఆమెలోనూ వుండాలని వెయ్యి దేముళ్ళకి మొక్కుకున్నాను. నేనిచ్చినది తీసుకున్నా, కేరియర్‌లో అన్నం అదికడిగేలోగానే తినేసినా ఆ పిల్లని సామాన్యంగానే చూసి సంతృప్తి చెందేవాడిని. ఆమెవల్ల పడేబాధ ఆమెను పాపంలోకి దింపాలన్న భయంకరమైన వింత కోరికగా మారింది. జబ్బుగది వాతావరణమే దానికి కారణం అయివుండవచ్చు. ఆఖరుకు ఆ పిల్లచేత దొంగతనం చేయిద్దామని ఒకనాడు అనువైన చోటుల్లో చిల్లరడబ్బులుపెట్టి ఆమె గదిలో వుండగా డాబామీదకు వెళ్ళిపోయేను. ఒక్క పైసాకూడా ముట్టలేదా అమ్మాయి. బహుశా డబ్బులు చూడలేదేమోనని సమాధానపరుచుకున్నాను. ఆ మర్నాడు కూడా అలాగే చేసేను. కిటికీ వూడుస్తున్నప్పుడు కిటికీలో నేనుపెట్టిన డబ్బుని కిటికీలోనే మరోచోటపెట్టింది. ఆఖరుకు సినీమాకు వెళ్ళమని ఒకనాడు డబ్బులివ్వబోయేను. మంచి ఆట వచ్చినప్పుడు తీసుకెళ్తానంది.

ఓటమి ఆనందంగా అంగీకరించేను. ఆమెను పాపానికి దింపిన పాపం అంటుకోలేదని సంతోషించేను. ఆ తర్వాత ఆమెను ఒక పరాయి మనిషిగా చూడలేకపోయేను. ఆత్మీయురాలిగా అంగీకరించి సంతృప్తి చెందేను. ఆమెలో దైవత్వం చూడగలిగేను.

నీటిలో సుళ్ళులా రోజులు దొర్లిపోతున్నాయి. నా పనికోసమే నియమింపబడినా ఆ పిల్లను పూర్తిగా వినియోగించుకొనే దాయింటావిడ. ఆ పిల్లకు అందువలన ముట్టే ప్రతిఫలం చీవాట్లు, చీదరింపులు. నా ఆరోగ్యం బాగా కోలుకోగలేను. కాని యింకా నీరసంగా వుండడం వల్లనైతేనేమి, ఆ పిల్లకు తృణమో, ఫణమో ముట్టచెప్దా మనైతేనేమి హోటలు భోజనమే చేసేవాడిని. ఈ లోగానే సంక్రాంతి వచ్చింది. వరసగా వారంరోజులు శలవులు వచ్చేయి. శలవల్లో స్వగ్రామం పోదామని నిశ్చయించుకున్నాను.

ఆ రాత్రి బయలుదేరుతాననగా యింటివారమ్మాయి లక్ష్మితోసహా నా గదిలోకి వచ్చింది. ముచ్చటగా ముద్దబంతిపూవులా ముస్తాబయింది పండుగకు కుట్టించుకున్న పచ్చపట్టు పరికిణీ, కెంపురంగు జాకెట్టు తొడుక్కొని నాకు చూపించాలని వచ్చింది. ఆమె అలంకరణలో చూడగానే ఆకర్షించేది ఆమె తల్లోని లేత నీలినైలాన్ రిబ్బను. ఇటునుండి చూస్తే అటు కనిపిస్తూ తూనీగరెక్కలా వుంది. దానిమీద అక్కడక్కడ ఎగిరే చిన్న

● "ఒరేయ్ రాముడూ! ఆవుమీద నువ్వు రాసిన కాంపోజిషన్ కృష్ణుడి దాంట్లో చూసి మక్కికి మక్కీ కాపీ కొట్టావా లేదా ?"

"కాపీకాదు మేష్టారూ! నేనుకూడా అదే ఆవుమీద రాశానండీ."

రంగురంగుల పిట్టలున్నాయి. బట్టలు బాగున్నాయని మెచ్చుకున్నాను. సంతోషించి వెళ్ళిపోయిందా అమ్మాయి.

ఆ అమ్మాయిని చూసిన కళ్ళతో చినిగిన గౌను, రేగిన జుట్టుతోవున్న లక్ష్మిని చూసి నన్ను నేను క్షమించుకోలేకపోయేను. పేగులు ముడి పడినట్టయింది. కాని మనలో లేని సద్గుణాలు ఆ నిర్భాగ్యురాళ్లో వున్నాయి, అవే ఆమెసిరి అని నన్ను నేను మోసం చేసుకున్నాను. సాయంత్రం మామూలుగా కేరియరు తీసుకొని వచ్చింది. నేను ఊరెళ్ళిపోతున్నాను, కేరియరు నువ్వు యింటికి పట్టుకుపో అన్నాను. ఇద్దరం డాబామీదకు వచ్చేము. సాయంత్రం ఏడయింది. రాత్రి సాయంత్రాన్ని తరుముతోంది. రోడ్డుమీద జనం సముద్రంలా రొదపెడుతున్నారు. నేను తలుపు తాళంవేస్తూ వుంటే గోడనానుకుని నిలబడింది లక్ష్మి. కళ్ళల్లో ఎన్నడూ లేని ఆత్రం, దైన్యం కనిపించేయి. నా చెల్లెలిని వదిలి వస్తున్నప్పుడు కూడా నాకు అంతబాధ ఎన్నడూ కలగలేదు. గుండెకొట్టుకొనే క్రమం ఒకసారి తప్పింది. సుఖాన్నివున్న ప్రాణానికి యీ బంధం కలిగించి ఎందుకు దుఃఖం కలిగించుకున్నానా అని కూడా విసుక్కున్నాను. విసుక్కున్నందుకు పశ్చాత్తాపంగా ఆమెమీద జాలికూడా ఎక్కువైంది. మట్టిపట్టివున్నా ఆమె బుగ్గలు తాకకుండా వుండలేకపోయేను.

"ఏం కావాలి లక్ష్మి?" అన్నాను. నేలనిచూస్తూ అర్ధరూపాయి కావాలంది దీనంగా. స్వర్గం చేతిలో పెట్టినట్టయింది నాకు. గుడ్డిగా డాబామీద పడుతున్న వెన్నెలకి పరిమళం వచ్చినట్టయింది. నా జన్మ సఫలం అయిందనిపించింది. వెంటనే జేబులోనుండి అర్ధరూపాయి తీసి యిచ్చేను. గుప్పెట్లో దాచుకుంది. మౌనంగా మెట్లవరకు వచ్చేము. డబ్బు ఏం చేస్తుందోనన్న కుతూహలం, తన తమ్ముళ్ళకి పండుగకు ఏవైనా కొంటానంటుందేమోనన్న భయం నన్ను వశం చేసుకున్నాయి. కాని కుతూహలం జయించింది.

"ఏంచేస్తావే డబ్బుని?" సాధ్యమైనంత మెత్తగా అడిగేను. ఆ అమ్మాయి రిబ్బనులాంటిది కొనుక్కుంటానంది మృదువుగా. నామనసు తేలికైంది. ఆపిల్లకు కలగక, కలగక, కలిగిన కోరిక తీరడానికి సాయపడగలిగేనని గర్వించేను. విడిపోయే ముందు సోమవారం మధ్యాహ్నానికి తిరిగివస్తాను, కేరియరు తెచ్చి వుంచమని చెప్పేను. కృతజ్ఞతతో తల వూపింది. రైల్లో లక్ష్మి నన్ను కలవర పరచింది. పట్టుబట్టలు కోరలేదు. బంగారు నగలు కోరలేదు. కోరినదల్లా ఓరిబ్బను ముక్క. నాటిరాత్రి నాకలలో రిబ్బను ముక్కలు, అర్ధరూపాయలు మరువలేక పోయేను.

సంక్రాంతి రంగులతో వచ్చింది. మాయింట్లో కోలాహలంగా వున్నారంతా. కాని నాకు మాత్రం ఏదో విలువైన వస్తువు పోగొట్టుకొన్నట్టనిపించింది. కొత్తబట్టల్లో ఏ పిల్లని చూసినా లక్ష్మి గుర్తుకువచ్చేది. సోమవారం ఉదయం బయలుదేరుతూంటే రాక రాక వచ్చేవు మరొక పూట వుండమన్న అమ్మమాట కాదనలేకపోయేను. సాయంత్రంఇల్లువదులుతున్నప్పుడు నా జీవితంలో మొదటిసారిగా సంతోషించేను. కాని నన్ను ప్రాణప్రదంగా చూసుకునే వదిన నేనముకోకుండా నన్ను దిగబెట్టడానికి స్టేషనుకి రావడం, రైలు కదులుతూ వుంటే రెండవవైపు చూస్తూ జాలిగా "బారసాలకు తప్పకరావయ్యా" అని అర్థించడం బాధపెట్టేయి. పదేళ్ళు కాపురం చేసిన ఆమెకు అదే తొలి కాన్పు.

రైలు రెండుగంటు లాలస్యంగా చేరింది. ఇల్లు చేరేసరికి రాత్రి ఎనిమిదిన్నర దాటింది. వదినెకు ఏపిల్ల పుడుతుందా అని ఆలోచిస్తూ మెట్లెక్కుతున్న నాకు డాబామీద గోడకి ఆనుకొని ముడుచుకూర్చున్న లక్ష్మిని చూసేసరికి ప్రాణం ఎగిరిపోయింది. ప్రక్కనే కేరియరు వీధిలైటుపడి మెరుస్తోంది. సంక్రాంతి చలి ఎముకలు కొరుకుతోంది. చినిగి పేలికలైన గౌను కూడదీసుకొని చలికి అడ్డంపెట్టడానికి ప్రయత్నిస్తోంది లక్ష్మి. అంతవరకూ ఆ పిల్ల నాకోసం కాచుక్కూర్చుంటుందన్న ఆలోచనే లేదు నాకు. గది తాళంతీస్తూ "కింద వరండాలో కూర్చోలేకపోయేవా లక్ష్మి?" అని ప్రశ్నించేను. ఆమె జవాబివ్వలేదు. కేరియరు రేపు తోముకోవచ్చనిచెప్పి ఆమెను యింటికి పంపించేశాను.

ఆ మర్నాటి నుండి కాలేజీలో ఏవో ఫంక్షన్సు జరుగుతూ వుండడంవల్ల రూము గురించి ఎక్కువగా పట్టించుకోలేదు. కాలేజీలో నాటకాలూ, డైరెక్షన్లూ, ఆటలలో మునిగి తేలుతున్నాను. నేను ఎంత నిర్లక్ష్యం చేసినా లక్ష్మిలో మార్పు గమనించకుండా వుండలేకపోయేను. కళ్ళల్లో పూర్వం మెరుపు స్థానే దైన్యం నైరాశ్యం ఆక్రమించుకున్నాయి. పెదవులమీద చిరునవ్వు చెరిగిపోయింది. అడుగుల్లో బరువు కన్పిస్తోంది. నేను వూరుచేరిన నాల్గోరోజుకల్లా ఆమెలోని మార్పు పూర్తిగా గ్రహించగలిగేను. అలా వున్నావేమని అడిగితే ఏం లేదంది.

● సెకండ్‌ఫారం కుర్రాడు తండ్రితో : "నాన్నా! వచ్చేయేడు నా చదువుకు అట్టే ఖర్చుకాదు."

"ఎందుకని?"

"పరీక్ష పోయింది. కొత్తపుస్తకాలు కొనక్కర్లేదు."

మరో మూడ్రోజులు గడిచేయి. అప్పటికిగానీ నా మందకొడి బుర్రకి లక్ష్మి కోరుకున్న రిబ్బను జ్ఞాపకం రాలేదు. రిబ్బను కొనుక్కున్నావా అని ఆశగా అడిగేను. కొనుక్కున్నానని తల వూపింది. మరి పెట్టుకోవేం అని అడిగేను. జవాబుగా రెండు బొట్లు ఆమె కళ్ళనుండి జారేయి. ఏం జరిగింది లక్ష్మి అని బుజ్జగించేను. సంక్రాంతినాడు వాళ్ళమ్మకి నలతగా వుంటే ఆవిడబదులు తనే ఏజంటుగారింటికి పనికి వెళ్ళిందట. పనిలోకి వస్తూ కొనుక్కున్న రిబ్బను పని అయ్యేక వీధిలో కూర్చుని వేసుకుందట. అప్పుడు ఏజంటుగారమ్మాయి ఎక్కడికో వెళ్ళిందట. వాళ్ళమ్మాయి రిబ్బను దొంగిలించిందని, తక్కువ వాళ్ళకు దొంగబుద్ధు లెక్కడకు పోతాయని తిట్టి ఆ రిబ్బను లాక్కుందట ఆ యింటి కాళి. నేను కొనుక్కున్నాను మొర్రో, మీ అమ్మాయి రిబ్బను మీ అమ్మాయి పెట్టుకొనే వెళ్ళింది. కావలిస్తే ఆమె వచ్చేక చూడండి అని లక్ష్మి మొత్తుకున్నా లక్ష్యపెట్టలేదట.

మళ్ళీ కొనుక్కుందాం ఫరవాలేదని నేను చెప్పేలోగానే మేకల మందలా ప్రవేశించేరు నా స్నేహితులు. కాలేజీ ఫంక్షన్ల హడావిడి వల్ల వాళ్ళతోనే హాస్టల్లో మూడురోజు లుండిపోవడానికి అదివరకే అంగీకరించేను. ఆ రాత్రి, ఆ తర్వాత మూడురోజులు కేరియరు తేవద్దని లక్ష్మితో చెప్పి, కావలసిన బట్టలు తీసుకొని వెళ్ళిపోయేను.

చూడండి! ఇది అన్యాయం కాదా? ఆపిల్ల మనపిల్లలకంటే ఏం తక్కువ? మన పిల్లలు చాకొలెట్లు, బిస్కట్లు కావాలని ఏడుస్తుంటే ఆపిల్ల ఒక్క అర్ధరూపాయి ఖరీదు చేసే రిబ్బనుముక్క కోరింది. తీరే అవకాశం కూడా యిచ్చేడు భగవంతుడు నారూపంలో. కోరినది చిక్కేక, అనుభవించే లోగానే విధి వెక్కిరించింది. ఆ యింటావిడ రూపంలో కాళి ప్రత్యక్షమై పసిపిల్ల కోరికనే బలిగా తీసుకుంది. ఇదంతా ఆ యింటావిడకు స్ఫురించకపోవచ్చు. ఆమె దృక్పథంలో ఆ సంఘటన చిన్నదే కావచ్చు. వెయ్యిరూపాయల జీతగాళ్ళకి అర్ధరూపాయి చిన్న పెంకే కావచ్చు.

కాని... లక్ష్మికి... ఆమెకు తీరని అన్యాయం జరగలేదంటారా? ఆ చిన్నగా కనిపించే సంఘటన మానసికంగా ఆమెను ఎంత గాయపరచిందో ఊహించలేను గాని, బహుశా శాశ్వతంగా ఆమెకు మానవత్వంలోని నమ్మకాన్ని చంపెయ్య లేదనగలరా? ఆ యింటావిడ చేసినది అన్యాయం కాదా? ఆమెను క్షమించగలమా? రిబ్బను తీసుకోడానికి ముందు లక్ష్మి చెప్పినది నిజమో కాదో రుజువు చేసుకోవలసిన విధి లేదా? తక్కువ

వాళ్ళకు తక్కువ బుద్ధులే పుడతాయన్న మనిషి తన ఎక్కువ బుద్ధి ఏమి చూపించింది? ఒకవేళ తొందరపడి తీసుకున్నా తనపొరపాటుతెలుసుకున్నాక తిరిగి ఆ రిబ్బను ఇచ్చెయ్యకూడదా? ఆమెదిమాత్రం దొంగతనం కాదా? అన్యాయం, అధర్మం కాదా? మీరేమంటారు?" బరువుగా ఆపేడు డాక్టరు.

ఎవరూ వెంటనే జవాబు చెప్పలేకపోయేరు. చీకటి దట్టంగా కమ్ముకుంది. అకస్మాత్తుగా గాలి లేచింది. ఆ గాలికి దూరంగావున్న టెలిగ్రాఫు తీగలు రోదపెట్టేయి. ప్రక్కనేవున్న చింతచెట్టుమీద గుడ్లగూబ భయంకరంగా అరచి రెక్కలతో పెద్ద చప్పుడుచేస్తూ ఎగిరిపోయింది.

"కథ గమ్మత్తుగానే వుంది" తన అభిప్రాయం వెలిబుచ్చేడు విశ్వనాథం.

"ఆలోచిస్తే యీ కథకు రెండవ భాగంకూడా వున్నట్టుంది. అదికూడా కానీండి" అన్నాడు సిరాజ్.

"కావాలంటే వుంది. అక్కర్లేదంటే లేదు. ఈ కథ యిక్కడితో అంతమైవుంటే బాగుండుననిపిస్తుంది" అని డాక్టరు తిరిగి అందుకున్నాడు.

"ఆ మూడురోజులూ పైకి ఆడుతూ పాడుతూ గడుపుతున్నా లోపల లక్ష్మి గురించి ఆలోచన నన్ను వేధిస్తూనే వుంది. ఆమెకు జరిగిన అన్యాయాన్ని ఎప్పటికి సరిదిద్దుతానో అని ఆరాటపడేవాడిని. హాస్టలు ఒక బందిఖానాలా కనిపించేది. రిబ్బను కొనుక్కుని రోడ్డుమీద లక్ష్మికోసం పరిగెత్తితే పరిహసిస్తారేమోనని నేననుకున్న నా సహాధ్యాయులు నా పాలిటి జైలర్లులా కన్పించేవారు. ఆఖరికి తాపీగా వచ్చింది నా విడుదలరోజు. హాస్టలు వదలి వస్తూ తోవలో లక్ష్మికి కావలసినది రిబ్బను కొనుక్కొచ్చేను. నాగది చేరేక రాజమ్మ గది ఊడవడానికి వచ్చి లక్ష్మికి మూడురోజుల నుండి జ్వరం వస్తోందని, ఆ పూటకి తనే పీలుచూసుకొని కేరియరు తెస్తానని చెప్పింది. లక్ష్మి తేరుకొనే వరకూ హాస్టలులోనే భోజనం చేస్తానని చెప్పేను. గది ఊడ్చి వెళ్ళిపోతూ వుంటే ఆవిడ చేతికి లక్ష్మి కివ్వమని రిబ్బను యిచ్చేను. ఓ క్షణం గది

- దినపత్రిక సంపాదకుడితో రాజకీయ నాయకుడు : "నా గురించి అన్నీ అబద్ధాలు రాస్తున్నారు మీ పత్రికలో."

సంపాదకుడు : "దానికి మీరు సంతోషించాలి. నిజాలు రాస్తే మీకు మరీనష్టం."

లోంచి బయటకు దూరంగా చూసి నావైపు తిరిగి "లక్ష్మి రిబ్బను కొనమంచా" అని అడిగింది తీవ్రంగా. అది నేను అనుకోని పరిస్థితి. ముందుగా ఊహించని సమస్య. రిబ్బను కోరుకుందని లక్ష్మిని హింసిస్తుందేమోనన్న భయం, లక్ష్మికేంతెలీదని నేనే కొనాలని యిస్తున్నానని అబద్ధమాడించింది.

మరో రెండ్రోజులు గడిచేయి. రోజూ లక్ష్మి క్షేమం రాజమ్మని అడుగుతూనే వున్నాను. జ్వరం తగ్గలేదని, యింకా ఎక్కువగానే వుందని ఆమె చెప్పేది. మందిప్పిస్తున్నావా అని అడిగితే లక్ష్మిది జడుపు జ్వరం, సోడా కొట్టు సాయిబుచేత మంత్రం వేయిస్తున్నానని చెప్పింది. నేనే ట్రీట్ చేద్దామంటే అప్పటికి నాకొచ్చిన వైద్యం బహు తక్కువ. లక్ష్మిది నిజంగా జడుపు జ్వరమే అయితే ఆపాపం అంతా మాయింటూ విడదేనని నిశ్చయించుకున్నాను. అభం శుభం ఎరుగని అమాయకురాలిని పట్టుకొని దొంగతనం అంటగట్టి నానా తిట్లూ తిడితే జడుసుకోక ఏమౌతుందనుకున్నాను.

కాని లక్ష్మి పరిస్థితి విషమిస్తుందన్న ఆలోచన మూడోనాడు రాత్రి యింకో రెండుగంటలకు తెల్లవారుతుందనగా రాజమ్మ వచ్చి నన్ను లేపి చెప్పేదాకా నాకు స్ఫురించనే లేదు. "నా కొంప మునిగిపోతోంది. లక్ష్మి నన్ను దగాచేసి వెళ్ళిపోతోంది. మీ రొచ్చి కాపాడండి బాబూ" అంటూ నా చేతులు పట్టుకొని అర్థించింది రాజమ్మ. నాకు కరచరణాలు ఆడలేదు. ఇంతలో యింత మునిగిపోతుం దనుకోలేదు నేను. నాకు వచ్చిన వైద్యం తక్కువ. పోనీ వచ్చినంతవరకు చేద్దామన్నా నా దగ్గర ఏ పరికరాలూ లేవు. రాజమ్మను అక్కడే వుండమని పక్కవీధికి పరిగెత్తి నాకు తెలిసిన ఒక హౌస్ సర్జనుని తీసుకొచ్చేను. పాపం! అతనుకూడా ఎంతో మంచివాడు. రమ్మనగానే వచ్చేడు తనవద్దనున్న ఏవో రెండు ఇంజెక్షన్లు జేబులో వేసుకొని.

రాజమ్మని తీసుకొని బయలుదేరేం. నేను ఆ తర్వాత చాలాసార్లు చావుబ్రతుకులమధ్య ఊగిసలాడే రోగులకోసం పరిగెత్తేను. కాని ఆనాడు త్రోవలో నేను పడిన బాధ వర్ణించడానికి నా మాటలు చాలవు. రోడ్లన్నీ నల్లగా అనంతంగా ఆదిశేషువులా పడుకొని వున్నట్టు కనిపించేయి. ఫర్లాంగు మైలులా కనిపించింది. వాచీ తొందరగా పోతున్నట్టనిపించింది. ఇంకా జోరుగా నడవలేకపోయినందుకు నా కాళ్ళని నేను తిట్టుకున్నాను. ఆ వూళ్ళో అన్ని సందు లున్నాయని, ఆ సందులు అంత మురికిగా వుంటాయని నాకు తెలియడం అదే ప్రథమం. జంతుజాతి ఓర్మికి నిదర్శనంగా చూరుకింద ప్రతిమల్లా నిలుచున్న రెండు గాడిదలు మినహా రోడ్లన్నీ నిర్జనంగా శ్మశానంలావున్నాయి. పరిసరాలు వర్ణించడానికి సమయంకాదు. ఎలాగైతేనేం చేరేం కుళ్ళుకాలువప్రక్కనున్న ఒంటిగది లక్ష్మి యిల్లు. కాలువ ఎక్కడ అంతమౌతుందో, ఇల్లెక్కడారంభమౌతుందో చెప్పడం కష్టం.

గది బురదలో నేలమీద పంది పిల్లల్లా బోర్లాపడుకుని వున్నారు యిద్దరు పిల్లలు. మూలనున్న కుక్కి నులకమంచంమీద చింకిదుప్పటి కప్పుకొని పడుకొనుంది పోల్చ సాధ్యంకాని లక్ష్మి. ఆమె తల దుప్పటికి బయటవున్నా నాకు కనిపించింది నీరశించి, కృసించి, బెదురుగా, భయంగా, నడికప్పువేపు చూసే ఆమె కళ్ళు మాత్రం. ఆమె మొహమంతా జేవురించి, జ్వరపీడితమైన కళ్ళు ఆక్రమించుకున్నాయి. తనని బహుశా యింకొన్ని క్షణాల్లో భస్మంచేసే అగ్ని రగుల్చుకోవడానికి వెలిగించిన జ్యోతుల్లా వున్నాయి. చూపు ఎక్కడా ఒక్క క్షణం నిలబడడం లేదు. జీవన్మరణాలమధ్య ఆమె ఊగే ఊయలలా తిరుగుతున్నాయి ఆ ఎర్రటి నేత్రాలు. మూలనున్న గుడ్డిదీపం లక్ష్మి కళ్ళ మీద భయంకరమైన క్రీనీడలు పరుస్తోంది. గది మూలనున్న చీకటిలో చావు పొంచివున్నట్లనిపించింది.

మేము వెళ్ళిన కొద్దిక్షణాల్లో జ్వరతీవ్రతవల్ల లక్ష్మికి వణుకు కూడా ఆరంభమయింది. వైద్యం అంత బాగా రాకపోయినా దాని అర్థం నాకు తెలుసు. మృత్యువు లాక్కెళుతూ వుంటే రానన్నట్టి కొట్టుకుంటున్నాయి ఆమె కాళ్ళూ, చేతులూ. ముఖానికి రెండుచేతులూ అడ్డుపెట్టి గట్టిగా కళ్ళు మూసుకున్నాను. మృత్యువు నా భుజం మీద చేయివేసి నువ్వేం చెయ్యగలవని సవాలు చేస్తున్నట్టనిపించింది. ఆ మృత్యువు నాకోసమే కాచుక్కూర్చుందనిపించింది. చావుకు అంత దగ్గరగా వెళ్ళిన నేను నా జన్మలో ఒక్కసారి నీతికారులు, వేదాంతులు బోధించేది అనుభవించేను. ఒక్కసారి నాలోంచి నేను బయటికి రాగలిగేను. ఇతరులూ, భగవంతుడూ నన్ను ఏవిధంగా చూస్తారో, అదే దృష్టితో నన్ను నేను చూసుకోగలిగేను.

ఇంత సానుభూతీ, జాలీ వొలక

● "అమ్మా! మాదాకవళం తల్లీ!"

"ఒరే అబ్బీ, అన్నం పెడతానుగాని కాస్త ఆ నాలుగు కట్టెపుల్లలు కొట్టిపెట్టు."


"ఏందమ్మోవ్. నేను బిచ్చగాణ్ణి. కూలోణ్ణనుకున్నావా?"

బోస్తున్న నేను లక్ష్మికిచేసిందేమిటి? మాయింటావిడ కన్న నేను ఎందులో ఎక్కువ? ఆవిడ లక్ష్మిని తిట్టేద్ది, నేను తిట్టలేదు. తిట్టకపోవడమే ఒక సుగుణమా? అంతకుమించి నాకు లక్ష్మిపట్ల బాధ్యత లేదా? ఉంటే అది నిర్వర్తించేనా? నాలుగు విడి రూపాయలిచ్చి అభం శుభం ఎరుగని ఆ చిన్న వయస్సులో చాకిరీ చేయించుకున్నానే! లక్ష్మి దైన్యానికి దారిద్ర్యానికి నా బాధ్యత లేదా? లోకంలో నాకోసం, నాలాంటి సుఖజీవుల కోసం ఎంతమంది లక్ష్మిలు పస్తులు పడుకొని శ్రమిస్తున్నారా? ఇది ఒక్క లక్ష్మికి సంబంధించిన విషయం కాదు. ఈ దౌర్భాగ్య దేశంలో కోట్లకొద్దీ వున్న అమాయక లక్ష్మిలకు, తమలో మంచి తనం వుందని తమనితాము మోసగించుకునే అసంఖ్యాకులైన నావంటి అసమర్థులకు, చిన్న మనసుల లేతదనం గ్రహించని మా యింటావిడవంటి వారికి కలిసి పరిష్కారంలేని సమస్య. ఈ సమస్య పరిష్కారం అయ్యే లోపున ఎంతమంది లక్ష్మిలు నశించాలో?

నేనాలోచిస్తున్నంత సేపూ నాతో వచ్చిన హౌస్ సర్జను లక్ష్మిని పరీక్ష చేస్తూనే వున్నాడు. సన్నగా ఏడుస్తోంది లక్ష్మి తల్లి. ఆవిడని ఓదారుస్తోంది ఔటిలో ఒక కాలుపెట్టిన పక్కింటి ముసలమ్మ. హౌస్‌సర్జను లక్ష్మిని పరీక్షించిన తర్వాత ఒక యింజక్షనిచ్చి ఒక అరగంటు చూద్దామన్నాడు. ఆ అరగంటులోనూ ఏమార్పూ రాలేదు లక్ష్మిలో. ఇంక యిక్కడ వుంచి లాభంలేదు ఆస్పత్రికి తీసుకుపోదామన్నాడు. అందుకు లక్ష్మి తండ్రే రిక్షాతీస్తూ వుంటే నాకు దుఃఖం ఆగలేదు. ప్రక్కింటివాడొకాయన తన రిక్షా కూడా తెచ్చేడు.

రిక్షాలు వచ్చేక లక్ష్మికి కప్పివున్న దుప్పటితీసి జాలిగా, బాధగా ఎత్తుకుంది రాజమ్మ లక్ష్మిని. రాజమ్మ భుజంమీదనుండి వీపువెనకాల నిర్జీవంగా వ్రేలాడుతున్నాయి లక్ష్మి చేతులు. లక్ష్మి చేతులు చూడగానే నా కళ్ళు తిరిగిపోయేయి. నా కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్టనిపించింది. తనపాలిటి యమపాశంలా వేలాడుతోంది లక్ష్మి చేతిలోని రిబ్బను. తనకు కలిగిన ఒక్క కోరిక తీర్చుకునే అవకాశం పొంది, పోగొట్టుకొని, తిరిగి పొందికూడా అనుభవించలేక పోతున్నదా నిర్భాగ్యరాలు. నలిగి వత్తిలా అయిందా రిబ్బను. లక్ష్మి మాత్రం మళ్ళీ మా యింటావిడ లాక్కుంటుందేమోనన్న భయంతో వున్నట్టు గట్టిగా పట్టుకుందా రిబ్బను.

రిక్షాలు బయలుదేరేయి. లక్ష్మి తండ్రి రాజమ్మని లక్ష్మిని ఎక్కించుకొని రిక్షా తొక్కుతూవుంటే, లక్ష్మిని భగవంతుడు యీ ప్రపంచంలోనికి తోయడంకోసం ఉపయోగించుకున్న



వీ రిద్దరినీ, తిరిగి తన దగ్గరకు తీసుకుపోవడంలోకూడా ఉపయోగించుకుంటున్నాడేమోననిబాధపడ్డాను. నేనూ హౌస్ సర్జను రెండవరిక్షాలో ఎక్కేం. ఎంత శకునాల్లో నమ్మకం లేకపోయినా మా రిక్షాలు బయలుదేరుతూవుంటే తీతువు అరచినప్పుడు నా మనస్సు చివుక్కుమంది.

ప్రపంచం యింకా గాఢ సుషుప్తిలోనేవుంది. గుడిసెలప్రక్కనిఎవరో నలుగురైదుగురు ముక్కులులేనివాళ్ళూ మొహాలు చినిగినవాళ్ళూ, తమ వేళ్ళు లేని చేతులతో పాతకాగితాలు, చినిగిన చెప్పులు మంటపెట్టుకొని చలి కాగుతున్నారు.

లక్ష్మిని హాస్పిటల్లో తొందరగానే చేర్చగలిగేము. ఎమర్జెన్సీ వార్డులోనున్న డాక్టర్లూ, నర్సులూ తమకు చేతనయినంతా చేస్తున్నారు. ఈ లోపున తెల్లవారింది. అక్కడి డాక్టరు యింకా పన్నెండు గంటలు అయితేగాని చెప్పలేనన్నాడు. ఇంక నే చేసేదేమీ లేదు. మానవుని చెయ్యి దాటిపోయింది.ఇంక లక్ష్మిని కాయగలిగింది ఒక్క భగవంతుడే. ఉదయం 7-30 గంటలయ్యేక నేను

నా గదికి బయలుదేరేను. తన రిక్షాలో తీసుకెళతానన్నాడు రాజమ్మ మొగుడు కృతజ్ఞత నిండిన కళ్ళతో. వద్దని మరో రిక్షాలో బైలుదేరేను. ఇంతవరకు సిగరెట్టు కాలుస్తూ కథ చెబుతున్న డాక్టరు పొరబాటున సిగరెట్టు పొగమింగి ఉక్కిరి బిక్కిరై దగ్గుతూ ఆగిపోయేడు.

"రామచంద్రప్రభో! ఆ అమ్మాయి చచ్చిపోతుంది కాబోలు త్వరగా కానీండి" అన్నాడు సిరాజ్.

"ఏమిటోనయ్యా! ఈ కథకి రెండో భాగం లేకపోతేనే బాగుండేది" తీర్పు చెప్పేరు జడ్జీగారు,

"ఏమోగాని నా మట్టుకు అసలు యీ కథే లేకపోతే బాగుండునని పిస్తోంది." అంది విశాల. పైకి వ్యంగ్యంగా కనిపించే విశాల మాటల్లోని సున్నితాభిప్రాయాన్ని గ్రహించిన డాక్టరు ప్రేమగా ఆమె మోకాలు నిమరడం ఆ చీకటిలో యితరులెవ్వరూ చూడలేదు. పైకి విభిన్న మనః ప్రవృత్తులు కలిగినట్టు కనిపించే ఆ భార్యాభర్తలమధ్య అంత అనుకూలతకు కారణం విశాల వ్యంగ్యంలోని సున్నితం, ఆ సున్నితాన్ని గ్రహించ గల్గిన డాక్టరు మనసు.

"ఇంక చెప్పడానికి కాస్తేలేదు. అంటూ డాక్టరు తిరిగి ప్రారంభించేడు. "రూముకి వస్తున్నంతసేపూ నాకు ఒక్కటే ఆలోచన, లక్ష్మికి జరిగిన అన్యాయానికి ఎలా ప్రతీకారం చేయడమా అని. ఎంత ఆలోచించినా ఏ నిశ్చయానికీ రాలేకపోయేను. ఆర్నెల్లు బాకీ పెట్టి అద్దె ఎగ్గొడదామనీ, లేకపోతే మాఇంటావిడ కొంపకి నిప్పెట్టేద్దామనీ తప్పితే అంతకన్న ఆచరణ సాధ్యమైన ఆలోచన లేఁవీరాలేదు. నేను యింటిగేటు తీసుకొని ప్రవేశిస్తూవుంటేమాయింటావిడ నవ్వుతూ, నామీదుగా రోడ్డువేపు చూస్తూ "రావే! రా! నీకోసం పాలు మరిగించి పెట్టేను. వంటింట్లోకిపోయి తాగు. నీకోసమే చూస్తున్నా" అని అదివరకు తన ఏ పిల్లపట్లా చూపనంత మార్దవం కంఠంలో కూరుకొని ఎవరినో ఆహ్వానిస్తున్నది. నా వెనక ఏ పిల్లవుందోనని వెనక్కు తిరిగి చూస్తే గేటులోంచి ఓ వీధికుక్క ప్రవేశించబోయి మా యింటావిడని చూసి తోక ముడిచి పారిపోతూ కనిపించింది.

ఎంచేతో ఆ సంఘటనవల్ల మా యింటావిడమీద నాకున్న అసహ్యం యింకా ఎక్కువైంది. నాకు చిన్నప్పట్నించీ కుక్కలతోనూ, కాకులతోనూ మాట్లాడే ఆడవాళ్ళంటే పరమ అసహ్యం. నేను రూములోకి పోయి నా పనులు చక్కబెట్టుకుంటూవుంటే ఇంటివాళ్ళమ్మాయి వచ్చింది అదివరకు నావద్దతీసుకున్న సంక్రాంతి సంచిక యివ్వడానికి. ఆమెకి రెండు రిబ్బన్లున్నాయి సీతాకోకచిలుకల్లా. అందులో ఒకటి లక్ష్మిదని నిశ్చయించుకున్నాను. అంతవరకు ప్రతీకారం సాధించడంలో మార్గం కనిపించని నాకు మెరుపులా స్ఫురించింది ఒక ఆలోచన. లక్ష్మిరిబ్బను ఎలాగైనా తీసుకోక తప్పదు. ఇంతకీ లక్ష్మి కథ నేను పూర్తిగా నమ్మినా అందులో నిజానిజాలు తెలుసుకోదలిచేను. "రిబ్బన్లు చాలా బాగున్నాయి. నువ్వు కొనుక్కున్నావా" అని అడిగేనా అమ్మాయిని.

"ఓటి మా అమ్మకొంది. ఓటి నే కొనుక్కున్నా!" అందా ముద్దబంతి.

"మీ అమ్మ ఎప్పుడు కొందీ?" మళ్ళీ అడిగేను.

"సంక్రాంతినాడు" అందాపిల్ల.

రిబ్బను తీసుకోవడమో మానడమో తేల్చుకోలేక పోతున్న నాకు సమస్య మా యింటావిడే పరిష్కారం చేసింది. "ఒరే! వీరన్నా! ఆ రాజమ్మ ముండ యీవేళ కూడా చావలేదు. ఏమైనా అంటే నా బిడ్డకు జబ్బంటుంది. ఆ బిడ్డ చావనూచావదు. ఇది మన పనికి రానూరాదు. నువ్వే చెయ్యి చేసుకుని ఆ గిన్నెలు తోమిపెట్టు" అని క్రింద అరుస్తోందావిడ. చావుబ్రతుకుల్లో వున్న లక్ష్మిని ఆవిడన్న మాటలు వింటే నాకు ఒళ్ళు మండిపోయింది. ఏమైనా సరే రిబ్బను తీసుకోదలిచేను.

"ఏవీతల్లీ రిబ్బన్లు చూడనీ! పట్టుకొని చూస్తాను. ఎంత బాపున్నాయో!" అని అతి మెత్తగా అడిగేను.

అమాయకంగా రెండు రిబ్బన్లూ విప్పి యిచ్చింది. ఇందులో మీ అమ్మ కొన్నదేది అని అడిగేను. "ఏమో" అంది నా చాదస్తానికి నవ్వుతూ. అకస్మాత్తుగా ఫో! పొమ్మన్నాను. నాకు పిచ్చెత్తిందేమోనని భయపడ్డట్టుంది. ఒక్క పరుగులో కిందికి పారిపోయింది.

నేను చేసిందానికి సంతోషించాలో విచారించాలో రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయేను. ఆవేళ నేను కోపానికి లొంగినంత అంతకు ముందుగాని ఆ తర్వాతగాని ఎప్పుడూ లొంగిపోలేదు. ఉచితానుచిత విచక్షణాజ్ఞానం పూర్తిగా పోయింది. నేను ఏమిచేస్తున్నానో, ఏమి చేస్తానో నాకే తెలియడంలేదు.

ఈ లోగా మా యింటావిడ గుడికి మేకపోతులా తన పిల్ల రెక్కపట్టుకుని నా గదిదగ్గరకు లాక్కొచ్చింది. ఆమె రావడంచూసి నేనే డాబామీదకు వెళ్ళేను. ఆవిడ వస్తూనే నవ్వుతూ "పిల్లతో హాస్యాలేఁవిఁటి? రిబ్బన్లు యిచ్చెయ్యి నాయనా" అంది.

"హాస్యానిక్కాదు. నిజంగానే తీసుకున్నా" నన్నాను.

"ఎందుకు తీసుకున్నా" వంది.

"రెండు రిబ్బన్లలో లక్ష్మి దేదో మర్యాదగా చెప్తే రెండోది ఇచ్చేస్తా" నన్నాను.

'మా పిల్ల రిబ్బన్లు దొంగతనం చేస్తావుటమ్మా?' అంది గట్టిగా.

'లక్ష్మి రిబ్బను దోపిడీ చేస్తావుటమ్మా?' అన్నాను.

'నన్ను దొంగ అంటావా?' అని గుర్రుమంది.

'దొంగవి కాదు. గజదొంగవి' అన్నాను.

ఇంతలో మా యింటావిడ కంఠం మా పక్కయింట్లోవున్న నాలుగు కుటుంబాలని పిలకట్టుకుని లాక్కొచ్చింది వాళ్ళ డాబామీదికి.

వాళ్ళను చూసేక ఆవిడ రోషం ఎక్కువైపోయింది. మాటా మాటా పెరిగింది.

'ఇలాంటి దొంగవెధవని ఇంట్లో చేరనివ్వడం నాదే తప్పు' అంది మొహం చేవురించుకొని.

'ఇలాంటి దొంగ వెధవల యింట్లో చేరటం నాదే తప్పు' అన్నాన్నేను.

'ఉండు నీ పని పట్టిస్తా' నంది.

'ఆసంగతి తర్వాత చూద్దాంగాని, లక్ష్మికి ఏమైనా అన్యాయం జరిగిందో నీ తల పచ్చడి చేస్తా' నన్నాను.


అంతవరకూ వచ్చేక ఆవిడకి భయంవేసినట్టుంది. కాబట్టి తనకు మద్దతుకోసం వాళ్ళాయన్ని రమ్మని ఓ కేక పెట్టింది. అంతవరకూ ఆపురుషుడికి కోపమే లేదనుకున్నాను. ఆయన చివరిమెట్టెక్కుతూ "ఏమిట్రా ఫూల్! ఆడవాళ్ళని తిడుతున్నావ్' అని గొంతు పెంచకుండా పీకపిసుక్కున్నట్టడిగేడు.

తాచులా లేచేను. 'నువ్వూ వో మొగాడివే నట్రా భ్రష్టం?' అన్నాను కోపంలో.

అంతవరకూ పక్కింటివాళ్ళు ఆపుకున్న నవ్వు మరి ఆగలేదు. పది కప్పులూ, సాసర్లూ ఒక్కసారి నేలమీద పడినట్లు పగిలింది వాళ్ళనవ్వు.

'నీకు తెలీదు నువ్వు వచ్చేవే' అని తన జీవితంలో తొలిసారి శాసించాడు యింటాయన భార్యని. ఆవిడ తన జీవితంలో ఆఖరుసారి పాటించిందా శాసనం.

వాళ్ళిద్దరూ పిల్లలతోసహా మేడ దిగిపోయేరు. తెలుగు సినిమాలో చివరిసీనుకు ముందు స్టంటు హీరోకు ప్రేక్షకులిచ్చే ప్రోత్సాహం నా పట్ల చూపించి మా పక్కింటివాళ్ళు కూడా అయిష్టంగా డాబా దిగిపోయేరు. నేనూ గదిలోకి వెళ్ళిపోయి ఎందుకు అంత తొందరపడ్డానా అని విచారించసాగేను. ఇంతలో ఇంటివాళ్ళ బంట్రోతు జంకుతూ ద్వారం దగ్గర నిలబడ్డాడు. అంత చికాకులోనూ కూడా నాకకస్మాత్తుగా పిచ్చి పట్టిందని వాళ్ళనుకుంటున్నారేమో నన్న ఆలోచన స్ఫురించగానే నవ్వొచ్చింది. ఏజంటుగారు నన్ను మూడ్రోజులలో గది ఖాళీ చెయ్యమన్నారని అతికష్టంమీద అతడు



ముక్కుకుంటూ, తొట్రుపడుతూ చెప్పేడా బంట్రోతు.

'ఈ ముష్టిగదిలో మూడ్రోజు లుండడం ఎందుకు? రెండు రిక్షాలు పట్రా' అన్నాను.

పందెపు గుర్రంలా పరిగెత్తేడా బంట్రోతు. వెంటనే సామాను సర్దుకొని రిక్షాలు రాగానే అప్పటికైన అద్దె ఆ జవాను మొహాన్నేసి కొట్టి నా స్నేహితుడి గదికి సామాను సహితంగా వెళ్ళిపోయేను. మేడమెట్లు దిగడం ప్రారంభించింది మొదలు రిక్షాలు బయలుదేరేవరకూ రెండు రిబ్బన్లూ రెండు చేతుల్తో విజయసూచకంగా వూపుతూనే వున్నాను. మా యింటావిడ కళ్ళు ఎర్రబడేటట్టు.

ఆ యిల్లు వదిలేక తలంటి పోసుకున్నట్టయింది నాకు. లక్ష్మికూడా దేముడిదయవల్ల మరో వారం రోజుల్లో తేరుకొని తన యింటికి వెళ్ళిపోయింది' అని కథ ఆపేడు డాక్టరు.

'కథ కాదుకాని, ఎంత లందో చోరీ పెట్టేరండీ బాబూ' అన్నాడు సిరాజ్.

'కామిక్ ఎండింగ్ గమ్మత్తుగా వుంది' అన్నారు జడ్జీగారు కథ తల్చుకొని నవ్వుతున్న అందరితోపాటు తనూ నవ్వుతూ.

'నా కిలా జరుగుతుందని మొదటే తెలుసు' అన్నాడు సర్వజ్ఞుడు విశ్వనాథం.

డాక్టరుకి ఒళ్ళుమండి "ఐతే తర్వాతేమైందో చెప్పండి చూద్దాం" అన్నాడు.

"నాలుగో పార్టు కూడానా! ఇరవై నాలుగు భాగముల రిపబ్లిక్ సంస్థ వారి పూర్తి స్టంటుసీరియల్" అని తప్పించుకున్నాడు విశ్వనాథం.

"అదీ కానీవోయ్" అన్నాడు జడ్జిగారు.

"ఈ భాగంలో లక్ష్మి ప్రమేయం లేదు" అంటూ తిరిగి ప్రారంభించేడు డాక్టరు. "నేను నా స్నేహితుడి గదిలో చేరిన పదిహేను యిరవై రోజులకు ఒకనాడు పదిగంటలకు కాలేజీకి బయలుదేరుతూ వుంటే ఠంచన్‌గా ఒక కుర్రపోలీసొచ్చి సలాంకొట్టేడు. నేనేం నేరంచేశానా అని ఆలోచిస్తూవుంటే ఆ పోలీసు నా చేతికో సమను కాగితం యిచ్చి మరో దానిమీద సంతకం పెట్టమన్నాడు. నా ఎడ్రెసు తెలుసుకోవడంలో ఆలస్యం అయిందనీ, నామీద వచ్చిన కేసు ఆవేళే అనీ, మేజిస్ట్రేటుగారు చాలా స్ట్రిక్టుమనిషనీ, నన్ను పదకొండు గంటలకి హాజరవమని హెచ్చరించేడు. నామీదేం కేసయ్యా అంటే ఏజంటుగార్నీ, అతని భార్యనీ తిట్టి, వాళ్ళపిల్ల రిబ్బన్లు లాక్కున్నావనీ నామీద వాళ్ళు కేసుపెట్టేరన్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది. ఆవిడా తిట్టింది. నేనూ తిట్టేను. ఆవిడ లక్ష్మి రిబ్బను అన్యాయంగా తీసుకుంటే నేను వాళ్ళ రిబ్బను పబ్లిగ్గానే తీసుకున్నాను. ఎక్కడి కక్కడ చెల్లు. ఈ భాగ్యానికే కేసు కూడానా అని అసహ్యంతో కోర్టుకి బయలుదేరేను. కోర్టు చేరేసరికి దగ్గరదగ్గర పదకొండు గంటలయింది. కోర్టంతా శవం పోయిన యిల్లులా వుంది. మేజస్ట్రేటుగారికి మునసబు ప్రమోషను రాలేదని ఆవేళే తెలిసిందట. అతని స్టాపూ, ప్లీడర్లూ అంతా విచారంలో మునిగివున్నారు.

ఈ దుర్ముహూర్తంలో వద్దదేంరా భగవంతుడా నా కేసు అని ఆలోచిస్తూ వరండాలో నిల్చున్నాను. చెట్టుకింద పోలీసులు ఖైదీలను పెట్టుకొని విశ్రాంతిగా సిగరెట్లు కాల్చుకుంటున్నారు. ఖైదీల్లో పాత అనుభవంవున్న యిద్దరు ముగ్గురు పోలీసులకంటె దర్జాగా బీడీలు కాలుస్తున్నారు. కుర్రఖైదీలు మాత్రం బితుగ్గా అటూ యిటూ చూస్తున్నారు. క్రిమినల్ కోర్టులక్కూడా ఆడవాళ్ళొస్తారని నేను తెలుసుకోడం అదే ప్రథమం. ఆ వచ్చిన ఆడవాళ్ళలో ఒకటీ అరా తప్పితే మిగతావాళ్ళు చక్కా సినిమాకో, బీచికో బయల్దేరినట్టు సీతాకోక చిలకల్లా ముస్తాబై కిల్లీలు నముల్తూ పోలీసుల్తోటీ కోర్టు జవాన్లతోటీ మాంఛిసరదాగా మాట్లాడుతున్నారు. కోర్టులో, సారాకంపు మాత్రం భరించశక్యంకాకుండావుంది. నాక్కడుపు తిప్పడం ప్రారంభించింది.

ఈలోగా పోలీసులు సిగరెట్లూ, ఖైదీలు బీడీలు ఒక్కసారి పారేసేరు. ఆడవాళ్ళు కిల్లీ లుమ్మేసేరు. అందరి దృష్టి గేటువేపు మళ్ళింది. అటు తిరిగి చూస్తే హుందాగా నడిచివస్తున్నారు మేజిస్ట్రేటుగారు. ముందో దవాలు వేసుకున్న జవాను దారిపక్కనున్న వాళ్ళని తప్పుకోమంటున్నాడు. మేజిస్ట్రేటుగారి వెనకనున్న ముసలిజవాను భుజం మీద ఓపెట్టె పెట్టుకొని అటూ యిటూ చూడకుండా మేజిస్ట్రేటుగారి వైపే చూస్తూ నడుస్తున్నాడు. మేజిస్ట్రేటుగారి చెయ్యి మాత్రం కీలు విరిగిన బందులో కిందికీ మీదికీ ఆడుతోంది. ఆయన పురజనుల నమస్కారాలందుకోవడం చూస్తే, చేస్తే మేజిస్ట్రేటుద్యోగమే చెయ్యాలనిపించింది నాకు.

మేజిస్ట్రేటుగారు కోర్టుకి రాగానే బెంచి ఎక్కిపోయేరు. చూడ్డానికి మంచి శాంతంగా వున్నారు. ప్రమోషను రాలేదన్న విచారం మొహంలో కన్పించడం లేదు. వరసగా కేసులు పిలవడంలో నాదో అరగంట పోయేక పిల్చేరు. కోర్టుగుమాస్తా నా కేవో కాగితాలిచ్చేడు. మేజిస్ట్రేటుగారు నన్ను చూసి ఒక సెకండాగి కేసు రేపటికి వేస్తున్నా, ఎవరైనా ప్లీడరుగార్ని పెట్టుకోదల్చుకుంటే పెట్టుకో అన్నారు. ఉన్నదున్నట్టు చెప్పెయ్యదల్చుకున్నానని, ప్లీడరుగారవసరం లేదని అన్నాను; తర్వాత పూటీకత్తు రాసి బయటపడ్డాను. నాకిచ్చిన కాగితాలేవిటోనని చూస్తే ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. ఆ ర్నెల్లు అహోరాత్రాలు వాడిన కార్బన్ కాగితంపెట్టి రాసినట్టున్నారు, అసలా కాగితా లేభాషలో రాసేరో కూడా తెలీలేదు నాకు.

మర్నాడు కూడా బుద్ధిగా టైముకు కోర్టులో హాజరయ్యేను. నా కేసు పిల్చేరు. "బేంకు ఏజంటుగార్నీ, ఆయన భార్యనీ తిట్టి వాళ్ళపిల్ల రిబ్బన్లు లాక్కున్నావని నీమీద

- స్నేహితుడితో ఒకడు : "సిగరెట్టొకటివ్వవోయ్."
  "మానేస్తు నన్నావుగా?"
  "ఒక్కసారిగా మానేయడం కష్టంగదోయ్. అందుకని ప్రస్తుతానికి కొనడంమటుకు మానేశాను."

కేసు. నేరంచేసేవా? ఏమంటావ'ని అడిగేరు జడ్జిగారు. అడిగిన దానికే జవాబు చెప్పాలనుకుని 'చిత్తం. వాళ్ళని తిట్టినమాటూ, వాళ్ళపిల్ల రిబ్బను తీసుకున్నమాటూ నిజమే' అన్నాను. ఏమైనా జరిగితే జరిగిందంతా చెప్దామనుకొని ఊరుకున్నాను. మేస్ట్రీటుగారు తలొంచుకొని ఏదో రాసుకోవడం మొదలు పెట్టేరు. పదినిమిషాలయ్యేక శిక్ష వేస్తారేమోనని భయం వేసింది. ఏం చెయ్యాలో తెలీలేదు. 'అది కాదు సార్! ఆ రెండు రిబ్బన్లు తీసుకున్నా గాని అందులో ఓటి వాళ్ళది కాదు సార్' అన్నాను.

ఇంతలో ఎవరో కాకీపేంటూ, నల్లకోటూ తొడుక్కున్నాయన — ఎవరో ఎ. పి. పి. గారట- 'ఒకటి వాళ్ళదని ఒప్పుకుంటూవుకదా! అది చాలు' అన్నాడు. నేను అతనికేదో యిస్తున్నట్టు. మేస్ట్రీటుగారు వెంటనే తీర్పు చెప్పేశారు. 'నన్ను ఏవో సెక్షన్లక్రింద దోషిగా భావించేరిని, కానిప్రథమ నేరంఅవడంవల్ల ఒక సంవత్సరం ప్రొబేషనుమీద వదిలేస్తున్నారని ఆ సంవత్సరం నేను నేరాలు చెయ్యకుండా బుద్ధిగా మంచి నడవడి కలిగి వుండాలని ఆ తీర్పు.'

కథ ముగిసిపోయినట్టే. ఆ సంవత్సరం అయిపోయేక విచ్చలవిడిగా, ఆవారాలా దొంగతనాలూ, ఖూనీలు చేసినా పద్ధతికి, చట్టానికి వ్యతిరేకం కాదన్నమాట అనుకుంటూ, ఎవరో జామీనుదారుని కుదుర్చుకొని పూచీకత్తుమీద సంతకం పెట్టేను.' అంటూ కథ ముగించేడు డాక్టరు.

'ఐతే మా డిపార్టుమెంటు చురక నీక్కూడా తగిలిందన్నమాట' అన్నారు జడ్జిగారు నవ్వుతూ.

'లక్ష్మికి చావుతప్పి మీకు కన్ను లొట్టపోయిందందురూ' అన్నాడు తనూ నవ్వుతూ, అంతవరకూ పలుకే బంగారమైన శంకర్రావు.

'ఇప్పటికైనా జనగణమన పాడొచ్చా? లేకపోతే యింకా వుందా కాశీమజిలీ?' అంటూ లేచేడు విశ్వనాథం.

□□□

మీకు కూడా కథంటే ఇష్టం

నేనొచ్చేస్తున్నా నన్న టెలిగ్రాం చూసుకుని స్టేషనుకి ఒచ్చినట్టున్నారు మా ఆయన...,అంతసేపూ చింతతోనూ వంతతోనూ నిండిన మనస్సులో ఆయన కనబడగానే అదంతా మాయమై, ఆయనమీదున్న సానుభూతి యిగిరిపోయి కోపం ఒచ్చేసింది నాకు.

'పండక్కి రాలేదేవండి?' అని అడిగాను, జోరుగా.

'... ... ...'

'అస లెక్కడున్నారు, పండక్కి?'

'... ... ...'

'జవాబు చెప్పరేవండి?'

'... ... ...'

'మీ కోసం ఎంతలా ఎదురుచూసేనండి! ... ...మా వాళ్ళందరూ అడగడంవే; ఏంవే, మీ ఆయన రారా, అసలు నీతో ఏం చెప్పేరే అంటూనూ! ఏమిటిలా చేసేరు?... మరీ మరీ చెప్పేనుకదా; ... అసలు మీరే కదండి, తప్పకుండా ఒస్తాను- అంటూ చెప్పేరు!'

ఆయన నా ప్రశ్నల్ని టైమ్‌లేనట్టుగా దాటేస్తున్నారు... నడుస్తూనే ఉన్నాం... ...పోర్టర్ని పిలవడం, సామాను వాడినెత్తిన పెట్టడం, టిక్కెట్టు నా దగ్గర పుచ్చుకోడం, జేబులోంచి ఆయన టిక్కెట్టు బైటికి

తమిడిపాటి రామగోపాలం

తీసుకోవడం, రెండూ కలిపి గేటు దగ్గిర ఇచ్చెయ్యడం, రిక్షామాట్లాడ్డం, అందులో సామాను పెట్టించి కూచోడం—నా ధ్యాసే లేదు ... ... నేను అడుగుతూవుండడం, ఆయన నా వేపు ఓ సారి వెర్రిమొహంవేసి చూడ్డం, మళ్ళీ పనిలో పడ్డం—అలా అయిపోయింది.

"ఎందుకండీ రాలేదు? ... ... మాట్లాడరేవండీ?— పండక్కి ఎడ్వాన్సూ పెట్టుగుని;— సెలవూ పెట్టుగుని;— హాయిగా అక్కడికొచ్చి సరదాగా వుండక ఇక్కడే కూచుండి పోయారేం?— మా వాళ్ళిల్లు అంత మొహం మొత్తేసిందా? అమాత్రందానికి నన్నెందుకూ, రెండురోజులు ముందుగా వెళ్ళు, అలా అంటూ పంపేశారు?— అసలు మాట్లాడరేం??"

అప్పుడొచ్చింది ఆయనోనోటు, నోమాటు... జవాబుకాదు; ప్రశ్న! "చెప్తాను కమలా; ఏమిటి, గొడవ—? ఇంటికెళ్ళే వరకూ ఆగలేవా?"

"నే నాగలేను! చెప్పండి!!"

అన్నాను, గట్టిగా.

రిక్షావాడు ఓసారి వెనక్కితిరిగి చూశాడు. నేను మొహం ముడుచుకొని ఊరుకున్నాను.

● ● ●

రాత్రైంది.

తొమ్మిది దాటింది, వంటా భోజనాలూ ఐ మళ్ళీ తీరిక చేసుకునే సరికి.

"కిళ్ళీలు తెమ్మంటావా?" అన్నారాయన: నేను వంటింట్లో పనిపూర్తి చేసుకుని ఇవతల పడగానే.

"కిళ్ళీలూ ఒద్దు సోడాలూవొద్దు. కాస్తనడుం వాల్చనీండి. చచ్చి చచ్చి ఒచ్చేను ... ..."

"అమాత్రం దానికి ఈ ఒక్క పూటకీవంటా పెంటా అంటూ గుండా పిండీ అయిపోకపోతే ఏం? కేరియర్ తెచ్చుకుంటే ఏడింటి కల్లా తినేసి ఈ పాటికి నిద్రపోయే వాళ్ళంగా! ... ...పోనీ నన్నైనా సుఖంగా కూర్చోనిచ్చేవా... ...గసగసాలు తెండి; ధనియాలు తీసుకురండంటూ అరడజనుసార్లు బజారుకి పంపేవు! ... ..."

నా కావలింత ఒచ్చింది. లేకపోతే ఏదో అందును నేనూనూ... ఆక్షణం అయిపోగానే మళ్ళీపండగ — ఈన రాకపోడం జ్ఞాపకం ఒచ్చేసింది. "ఇంతకీ పండక్కెక్కడున్నారో చెప్పరే కారు!"

"ఇక్కడే వున్నాను... ... ..." అన్నారాయన చిరునవ్వుతో.

"అబద్ధం... ...ఇక్కడ లేరట్టగా. మహాలక్ష్మమ్మగారు చెప్పింది. విశాఖపట్నం వెళతానని శెలు దేరాడు, మీ అయన—అయితే రాలేదూ—? అని ఆశ్చర్య పడ్డారావిడ. తాళంచెవులు ఆవిడకే యిచ్చేరట్టగా!"

"రాగానే కష్ట సుఖా లావిడితో చెప్పుకున్నా వన్నమాట!" ఎగతాళిగా అన్నారు.

"చాల్లెండి ... ... నేనేం అబద్ధాలు కల్పించి చెప్పలేదు. మీరేమో పదకొండో తారీఖు సాయంత్రం విశాఖపట్నం వెళుతున్నానండోయ్. అని తాళా లిచ్చేరుట; మళ్ళీ పదహారో తారీకు మధ్యాన్నం ఒచ్చి అంతా కులాసాగా ఉన్నారండీ; మా ఆవిడ రేపు ఒస్తోందంటూ తాళాలు తెచ్చుకున్నార్ట... ...నాకు ముందుగా తెలీక నిజం చెప్పేశాను!"

"పోనీ లే — ఏదో అయిపోయింది... ..."

"ఇక్కడా లేక, విశాఖపట్నమూ రాక, ఎక్కడున్నారండీ, నాలుగు రోజులూ మరి!"

"ఎందుకులెద్దూ!"

"ఎందుకేవిటి — చెప్పండి!— ఇంటిదగ్గిర చెప్తానన్నారుగా!"

ఆయన మళ్ళీ మాటాడకుండా కూచున్నారు. ఎంత అడిగినా చెప్పకపోడానికి కారణం ఏమిటో! అంత చెప్పకూడని చోటికి వెళ్ళేరా? అయినా చెప్పేస్తారే! ఇలాదాచటం కొత్తగా ఉందని తెలిసిపోయి బాధగా ఉంది.

"... ...ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో అసలు ఒంట్లో కులాసాగా ఉందో లేదో అని నాప్రాణం ఎంత కటకట్లాడిందో మీకేం తెలును? ... ...ఇద్దరం కలిసే... వెళదాం వండీ అంటున్నాకూడా వినిపించుకోక కొంపలు ముంచుకు పోయినట్టు రెండ్రోజులు ముందుగా నన్ను సాగనంపేశారు... ... ... పైగా వాళ్ళందరూ అడగడం ఒకటే; ఏమే మీ ఆయనొచ్చాడా అంటే, ఒస్తే నీమొగుడు రాట్టే అంటూనూ!"

"కష్టవే; పాపం!" అన్నారాయన, చిరునవ్వుతో.

"ఎంత వెటకారంగా వుందండీ మీకు! ... ...ఇంతకీ ఎక్కడున్నారో చెప్పరే?"

"ఎక్కడుంటే నేం; నేను ఆరోగ్యంగా సుఖంగా, కులాసాగా, సంతోషంగా పండగ వెళ్ళించేను... నీకా్కవల్సిందంతేగా!"

ఏ వూరు వెళ్ళేరు చెప్పండి, పోనీ!"

"నిడదవోలు!"

"మీ సుభద్ర గారింటికా?"

"ఏ సుభద్రా?"

"... ... ఎంతమంది సుభద్రలున్నారు?— మీ— మీ సుభద్రే— సుభద్రార్జునీయంలో సగందాకా వొచ్చిన... ... ...అదుగో, నవ్వుతున్నారు! వెళ్ళేరా, అక్కడికి?—

ఛీ ఛీ—ఇలా ఎవరైనా చేస్తారుటండీ?" నాకూ నవ్వు ఆగలేదు; సుభద్రా, ఆయనా, ఆ కథంతా జ్ఞాపకం ఒచ్చి.

"నవ్వకు కమలా... ...సుభద్రగారింటికొచ్చాడు. అక్కడికెందుకు వెళతానూ?—అసలు సుభద్ర వాళ్ళ పుట్టింటికి వెళ్ళిందిగా!"

"ఓహో; భోగట్టా చేసేరన్న మాట!"

"అంతే మరి— ఆ వూరుదాకా వెళ్ళేక—నువ్వు నవ్వితే నేచెప్పను!"

నేను బలవంతాన నవ్వు ఆపుకున్నాను—అయినా ధోరణి ఆలాగే ఒచ్చేస్తోంది. "చెప్పండి చెప్పండి... అసలు సరిగ్గా నిడదవోలే ఎందుకు వెళ్ళవలసొచ్చిందిట?"

ఆయన గొంతు సర్దుకున్నారు. "విశాఖపట్నానికే టిక్కెట్టు కొనుక్కున్నానే... ..." అని, తలగడా గోడకి నిలువుగా చేరేసి, సదుపాయంగా అనుకొని కూర్చొని, అనగనగా ధోరణిలో ప్రారంభించేరు. "—అసలేం జరిగిందంటే; బండి రెండుగంటలు లేటు! ప్లాట్‌ఫారంమీదే బెంచీమీద కునికిపాట్లు పడుతున్నానన్న మాట...బండొచ్చింది లేవండిసార్, అంటూ పోర్టర్ లేపేడు; బేగ్ రైల్లో పెట్టాడు... ...కూచోడానికి జాగా లేక జనం చస్తూవుంటే ఎవరో ఒకతను దర్జాగా ముసుగుతన్ని నిద్దరోతున్నాడు...ఒళ్ళుమండి, ఆపళంగా చేతులోవున్న న్యూస్‌పేపర్‌తో వీపంత గట్టిగా నాలుగు తగల్నిస్తూ రైలుబండి నీ బాబుగారి సొత్తనుకున్నావా, లే, అని లేపేను; తీరా చూస్తే వాడు మా నర్సింహారావు!"

"నర్సింహారావెవరండీ?" అన్నాను, సంగతి సగంపైగా బోధపడక.

"—కలకటూలో పని చేస్తున్నాడులే, వాడు. ఏడెనిమిదేళ్ళైంది, వాడూ నేనూ కలుసుకొని... హరి నీ తస్సాదియ్యా అంటే హరి నీ దుంపతెగా అని పలకరించుకున్నాం; చకచకా మాట్లాడేసుకున్నాం... ... వాడికి కిందటేడే పెళ్ళైందిట. పండక్కి అత్తారింటికి పోతున్నాట్ట ... కబుర్లు చెప్పుకుంటూ కూచున్నాం ... ... ఇంతట్లో రైలు గోదావరి బ్రిడ్జిమీద నడవడం తెలిసి కంగారుగా లేచి నించున్నాను... ...ఆ రైలు విశాఖపట్నం వెళ్ళటంలేదు! బెజవాడ పోతోంది!!—పోర్టర్ వెధవ ఇందులో కూచోపెట్టేశాడు!—అని గాభరాపడ్డాను."

"ఎంత తమాషా అండీ!"

ఆయన నన్ను ఆశ్చర్యపడనివ్వలేదు.

"విను... అప్పుడింకేంచెయ్యడం? —సరే, కొవ్వూర్లో దిగి వెనక్కొద్దాం; అనుకున్నాను—ఆపళంగా వాడు లంకించుకొని,— ఏడిశావులేవోయ్. ఇప్పుడు నువ్వు విశాఖపట్నం వెళ్ళక



పోతే ఏమీ! అన్నాడు. టిక్కెట్ కూడా కొనుక్కున్నాను; మా ఆవిడా వాళ్ళవాళ్ళూ ఎదురుచూస్తార్రా అని ఎంత చెప్పినా వాడు విన్నాడేకాదు. నిడదవోలు వాళ్ళ అత్తారూరట; వాడికూడా అక్కడికెళ్ళేసి, పండగ మూడు రోజులూ వాడితో వుండి, మళ్ళీ పదహారో తారీక్కి రాజమండ్రి చేరమంటాడు...!సగం సేపు వేళాకోళం అనుకున్నాను... కొవ్వూరు స్టేషన్లో నన్ను దిగకుండా పట్టేసుకున్నాడు. ఆ తరువాత స్టేషన్లో గార్డు దగ్గరకువెళ్ళి నిడదవోలుకి టిక్కెట్ రాయించి పుచ్చేసుకున్నాడు...సరి, ఇంకో గడియలో నిడదవోలు రానే వొచ్చింది!"

"ఊఁ హూఁ!... ...అతన్తో నిడదవోల్లో దిగిపోయి అక్కడుండిపోయేరన్నమాట...ఎంతపని చేసేరండీ!—పోనీ ఓ ఉత్తరం ముక్క రాయలేకపోయూరా, ఇలా జరిగిందంటూను! ...పండగ మూడురోజులూ, పిలవని

పేరంటానికి వెళ్ళి బట్టలకీ దానికీ దీనికీ మొహమాటపడి—ఎలా ఉండి పోయే రండీ. అంత తెలియని వాళ్ళిం టోను!—అతని కత్తారుగాని మీ కెవరు ?—' నాకు నవ్వొచ్చింది.

'అబ్బే, లేదు కమలా. అన్నీ బాగా జరిగేయి—వాళ్ళ ఆదరం చెప్పడానికే బాధగా ఉంది నాకు!' అన్నారాయన. పెంకెతనంగా నవ్వుతూ, వోరకంట చూస్తూ.

'బాధెందుకో.'

'నువ్వేమనుకుంటావో నని—!'

'నేనే మనుకుంటానండీ, చిత్రంగా మాట్లాడతారు!'

'నువ్వనుకోడాని క్కారణం ఉందిలే... ...అసలు మా నర్సింహారావు వాళ్ళింటికి వెళ్ళడమే; పెళ్ళయ్యేక మొదటి సంక్రాంతి ...బాగాడబ్బున్న వాళ్ళేమో, చాలా ఘనంగా చేద్దామనుకున్నారు. — అల్లుడితో గిల్లు గన్నట్టు నాక్కూడా అంతఘనంగానూ చెయ్యవలిసొచ్చింది ... నేనెక్కడ మొహమాటు పడతానో అని అన్నీ అడక్కుండా ఏర్పాటయి పోయేవి!...'

'బాగా ఆస్తి పరులా.'

'అబ్బో; చాలా. ధాన్యం వ్యాపారం. గోడౌన్లూ, మిల్లులూ, దుకా



ణాలూ, ఓ పెద్దబట్టలకొట్టూ. ఇదికాక ఆడవాళ్ళు వడ్డీవ్యాపారం చేస్తారు ...తెల్లారితే భోగి అనగా రాత్రి వెళ్ళాంకదూ... ... తెల్లారే సరికి వేణ్ణీళ్లూ, జెమాజెట్టీల్లాంటి మంగళ్లూ తయారు. వాళ్ళ ఐశ్వర్యంచూసిపద్ధతి మారిపోతుం దనుకున్నాను కాని అలా జరగలేదు. షాంపూ రుద్దుకొని షవర్ బాత్ లుచేస్తేమట్టుకు నలుగు పెట్టి తలంటుకున్న నునుపూ శుభ్రం ఒస్తాయా ? జన్మలో కుళ్ళంతా ఒదిలేటట్టు అభ్యంగనం చేయించారు ... కొత్తబట్టలే వెలాగా, అని నేను చిన్నబుచ్చు కుంటూనే ఉన్నాను; ఇంతట్లోకి పెద్దాయన, ఎనిమిది గజాల ఫిన్లేచాపు పట్టుకొచ్చాడు, (ఇప్పుడు నేకట్టుకున్నపంచె దాల్లోదే చూడు!)... 'అలా వొక్క క్షణం కూర్చోండీ, అబ్బాయి షాపుకు వెళ్లేడు. చొక్కాలు తెస్తాడు' అని మర్యాదగా చెప్పి; కాఫీ తాగేలోపుని కట్టబెట్టారు. నాకేవై తేనచ్చుతాయో, ఎంత లేసైతే సరిపోతాయో సరిగ్గా అలాటివి, రెండు చొక్కాలు— ఆశ్చర్యపడుతూనే, మా నర్సింహా రావుని పిల్చి, ఏమిట్రా ఇదంతానూ, నీ కేమేనా మతుందా లేదా అని చీవాట్లు పెడితే, వాడు పేద్ద నవ్వు నవ్వేసి, ' మీ అత్తారింటికి వెళ్ళి వాళ్ళిస్తే కట్టుకోవుట్రా; అక్కడికి వెళ్ళకుండా చేసినందుకు నీకిమాత్రం చెయ్యకపోతే ఎలాగు —' అన్నాడు—!

'చాలా బలగం వున్నారు కాబోలు... ...'

'ఓ! అతనికి నలుగురు మరదళ్లూ, ఇద్దరు బావమరుదులున్నూ— గొప్ప కాలక్షేపం అనుకో—నాకే ఆశ్చర్యం వేస్తుందిప్పుడు, మూడు రోజులు నిన్ను మరిచిపోయి; నీకు ఉత్తరమైనా రాయకుండా వుండిపోయానంటే —' అని అగారు, మా ఆయన.

'అవున్నెండి— అలాంటి చోటి కెళ్తే ఇంక నేనెందుకు జ్ఞాపకం వస్తాను; ఉత్తరాలేనా ఎందుకు రాస్తారు; పాపం!' అన్నాను, చాలా ఆనందిస్తూ న్నాయన్ని సరదాగా సాధించాలన్న కోరిక చంపుకోలేక.

'అదుగో — చెప్పకపోతే ఊరుకోవు; చెబితే ఇలా గొడవ చేస్తావు!'

'గొడవ కేంవుందిలెండి. మా వాళ్ళూ మీకు బట్టలు ఎక్కువే తీసేరు. నేను వుచ్చుకోలేదని; అక్కసుకొద్దీనీ. దానికితోడు మా చిన్నయ్య వెటకారం ఒకటే; మీ ఆయన వొచ్చినప్పుడే ఇస్తాంలేవే, అంటూనూ. పెద్దన్నయ్య పట్టికెళ్ళమంటూంటేకూడా బీరువాలో పెట్టేశాడు ... ...నాకుక్రోషం వొచ్చి అడగేలేదు ... ... వెధవది, బట్టలకేంగాని — ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో, ఏం తిన్నారో, అసలారోగ్యంగా ఉన్నారో లేదో అని నా మనస్సు మాత్రం మూడు రోజులూ విలవిల్లాడి పోయింది.

వాళ్ళంతరూ వరధ్యానంలో వున్నావా, వుంటే పతిధ్యానంలో ఉన్నావా అంటూ పరామర్శలూ వేళాకోళాలూనూ...... బయలుదేరే రేమో; ఆ బస్సో రైలో ఎక్కడేనా యాక్సిడెంటయి పోయిందేమో అని బెంగొకటీ — పోనీలెండి, ఎక్కడైతేనేం; పండగపూటా ఇంత పప్పూ అన్నం తిని హాయిగా నిద్రపోయారు కద; నా కంతేచాలు... ...' నిజం అయినా సరే కొంత విసుగుతోనే చెప్పేను. అయినా ఎంతో తేలిక పడింది మనస్సు.

'సరి సరి—పప్పూ అన్నం అంటూ వేమిటి! నవరసాలూ, పిండి వంటల్తో, బ్రహ్మాండంగా చేసేరు. ఇహ విశ్రాంతంటావా; వేరేగదీ, దోమతెర మంచం, దనపిల్లో! — అనుకో కూడదు గానీ, మీ యింట్లో అయితే నాకలా జరగనే జరగదు!'

'పోనీలెండి పాపం, మా వాళ్ళింట్లో మీ కెన్నడైనా బాగాజరిగింది కనకనా!' అని, లేచాను. ఉడుకుబోత్తనం వొస్తోంది, ఆయన మాటలకి. మా వాళ్ళింట్లోనే కాదు, వాళ్ళ వాళ్ళింట్లోనూ... అంటే మా అత్తారింట్లోనూ—ఆయన కలా జరగదు. ఆమాట ఆయన అన్లేదు. నాకనాలని ఉంది గాని ఆయన అన్నంత సులువుగా నే నెలా అనడం!— ఆలోచిస్తూ కిటికీ దగ్గర నుంచుంటే అమ్మ పాడిన పాటలో వో చరణం జ్ఞాపకాని కొచ్చింది.

ఇయ్యగలా చోటూనే వియ్యమంద రాదా;

పెట్టగలా చోటూనే పెళ్ళాడా రాదా?

అని సుభద్ర అర్జునుణ్ణి దెప్పుతుంది. ఇలాంటి సందర్భంలోనే, ఈ అర్జునుణ్ణి దెప్పేభాగ్యం సుభద్రది కాదు; నా దైంది... ...రాగ వరసలో అంటే ఆ చరణాలు ఎంత బావుంటాయని! ఆకర్షణకి తట్టుకోలేక అనేశాను... ...చెప్పాలని కానే కాదు.


ఆయన చిరునవ్వు మొహాన పోసుగుని లేచి కిటికీ దగ్గరకొచ్చారు. రెండు చేతులా నన్ను పొదివి పట్టుకొని—'నే ముందే చెప్పేను కదే; నువ్వు బాధపడతావని!' అన్నారు.

'బాధ కాదండీ; బోధ!' అన్నాను, మనస్ఫూర్తిగా నవ్వుతూ.

● ● ●

అమలాపురం మునిసిపాలిటీలో ఏదో లెక్కలు తనిఖీ చెయ్యడానికిటు వెళ్ళేరు మా ఆయన, పదిహేనురోజులైంది. ఇవాళో రేపో రావాలి ఎదురు చూస్తున్నాను.

అంతలో పార్థసారథి అని, ఆయన స్నేహితు డొకాయన, ఒచ్చేడు. 'అర్జునరావుగా రున్నారా?' అంటూనూ.



నా కతన్ని యిదివరకే తెలుసును. కూచోబెట్టి, సంగతంతా చెప్పాను. ఏదేనా పనుంటే ఉండిపోయి, రేపు ఆయన్ని చూసి వెళ్ళమన్నాను.

అతను ఉండడానికి వీల్లేదనీ, కొంచెం డబ్బు కావలసి ఒచ్చేననీ, చెప్పేడు. 'ఆయన పిఠాపురం నించి ఒచ్చేసిన దగ్గర్నుంచీ కూడా నా ఇబ్బందు లలాగే ఉండిపోయాయి! అన్నాడు.

'పిఠాపురం ఎప్పుడొచ్చారీయనా?' అన్నాను.

'మొన్న పండక్కి ఒచ్చేరు కదండీ.'

'పండక్కి—అంటే?'

'సంక్రాంతిపండక్కండీ—తెలియనట్టడుగుతారేం?—ఆరోజు వైజాగ్ వెళతానని అర్జునరావుగారు బెలుదేరడం, స్టేషన్లో ఎవరో టిక్కెట్‌తో సహా ఉన్న పర్స్ కాజెయ్యడం—మీతో ఆయనేం చెప్పలా?'

నాకళ్ళు తిరిగాయి. మనస్సులో విద్యుత్తు పృథఃకరించి నట్టయింది. కడుపులో చెయ్యిపెట్టి తిప్పినట్టయింది. నీరసం వచ్చేసింది. స్పృహ

తప్పిపోతుందని భయం వేసింది... డబ్బు పోవడం కాదు, ఎవరో కాజెయ్యడం!

'లేదండీ. ఏం జరిగింది?' అని చిరునవ్వు నటించాను.

'సరిపోయింది. మీతో ఏం చెప్పలే దన్నమాట... ...' పార్థసారధి చిరునవ్వు నవ్వాడు, '...ఏ మొహం పెట్టుకు చెబుతాలెండి! ... ...ఈయనేమో టిక్కెట్ కొనుక్కునీ, బండి లేటుకదా అని నిద్రపోతూఉంటే ఎవరో పర్స్ కాస్తా కొట్టేశారు. ఆ సంగతాయనికి తెలీక బండి రాగానే ఎక్కేశారు. ఎక్కి ఎక్కగానే నేను కనిపించేసరికి మాట్లాడుతూ కూచున్నారు... ... సామర్లకోటలో టిక్కెట్లు చెకింగ్ చేసే స్టాఫ్ ఒచ్చి అడిగితే జేబులూ, బేగ్, అన్నీ తడుముకొని, వెతుక్కొని, పర్స్ పోయిందని తేల్చారు... ...'

'ఊఁహూఁ'

'...పండగ ఎడ్వాన్సు డెబ్భయ్యయిదుట. ఇంట్లోంచి తీసుకున్నవి ఇరవైఐదు; కాక టిక్కెట్టుట—మొత్తం నూరు... ...టిక్కెట్టులేదని వాళ్ళు ఛార్జ్ చేసేరు. బొటాబొటీగా నా దగ్గరున్నది సరిపోతే ఇచ్చేశాను. పిఠాపురానికి టిక్కెట్ రాయించి... పొద్దున్నే వేరే బండిలో వెళ్ళురుగాని రండని, పిఠాపురంలో దించేశాను. అప్పటికి మా యిద్దరి దగ్గిరా కలిపి ఇరవైఒక్క నయాపైసాలు మిగిలేయి... ...'

'అంతకుముందు నాలుగు నెల్నించీ నాకు జీతాలు లేవు. శాంక్షన్ రాలేదు, మా పోస్ట్లకి, అందుకని జీతాలు డ్రా చెయ్యలేదు. మా వాళ్ళని పుట్టింట్లో ఒదిలేసి, హొటల్లో అరువుపెట్టి రెండునెలలు తిన్నాను. రెణ్ణెల్లు దాటాక వాళ్ళూ పెట్టలా. స్వయంపాకం మొదలెట్టాను... ...బియ్యం ఉంటే మిరపకాయ లేకా, పప్పుంటే నెయ్యిలేకా, బాధలు పడుతున్న రోజులు...మా డిపార్టుమెంట్ సంగతి మీకూ తెలుసుగా. తిండికి లేక చస్తున్నా సరే, కేంపూ వర్క్ మాత్రం యమ అర్జంట్! ఎడ్వాన్సులైనా యివ్వరు.— అలాగే బాధలుపడుతూ, రాజమండ్రి కేంప్ ఒచ్చానన్నమాట... చేతిలో ఉన్న డబ్బులు కాసినీ, ఎక్సెస్‌కి కట్టేశాను. పొద్దుట్లేచి ముష్టి ప్రారంభించాను...ఏంలాభం, అందరికీ పండగే. తగని ఖర్చులూ! ఎక్కడా పుట్టలేదు సొమ్ము. అందులో నాకు జీతాలు రావడం లేదని అందరికీ అవగాహన అయిపోయింది... ... ఇంతాచేసి ముష్టి మూడు రూపాయలు దొరక్క, ఆఖరికి, ఆయన, ఇక్కడే ఉండిపోతాను లేవోయ్, నీతోబాటే — అన్నారు:... ...నాకు కక్కాలేక మింగాలేక అవస్థొచ్చిపడింది... ... ...'

'అయితే మీ రిద్దరూ కలిసి పిఠాపురంలో గడిపారా, పండగ మూడు రోజులూ?— పోనీలెండి పాపం!— థేంక్స్' అన్నాను; దుఃఖం దిగమింగుకుంటూ.

'ఏం గడిపాం; నా మొహం!— ఆయనలాంటి మనిషి, నేనలాంటి పరిస్థితుల్లో—చేతిలో కానీఅడని పరిస్థితుల్లో వొచ్చి ఉండిపోవలి సొచ్చినందుకు నాకెంత బాధ అనిపించిందో చెప్పతరంగాదు. సరిగ్గా తిండైనా పెట్టలేకపోయాను... కూరకైనా డబ్బులులేక బాధలుపడ్డాం...పొద్దున్నే బన్‌రొట్టి అరువుతెచ్చి టిఫిన్; ఐదు నయాపైసలుంటే టీపొట్లాం తెచ్చుకుని టీ కాచుకునేవాళ్ళం. (కాఫీ మరిచే పోయాం)—బజార్లో కొన్న వూరగాయ, అప్పడాలూ, పెరుగు మనిషి నెల్లాళ్ళనించీ డబ్బు లిచ్చేరు కాదని సణుగుతూపోసే మజ్జిగనీళ్ళూ పోసి— ఇదీ నే నాయనకి పెట్టిన భోజనం!— పోనీ అలాగేనా పెట్టగలిగానా, అంటే; సంక్రాంతినాడు సాయంత్రానికల్లా బొగ్గులు అయిపోయి, ఎక్కడా బుట్టెడు అప్పైనా పుట్టేయి కావు!— అందరూ ఎంచక్కా పంచభక్ష్య పరమాన్నాలూ వొండుకుని పండుగ చేసుకుంటూ వుంటే నాయింటికి రాక రాకొచ్చిన వారూ, నాకన్నా అన్నివిధాలా పెద్దవారూ, ఇలాంటి కష్టాలు ఎన్నడూ ఎరగని వారూ అయిన అర్జునరావుగారికి అలాటి సత్కారం చేసి అవమానించవల సొచ్చినందుకు నాకెంత బాధ కలిగిందో—నిద్రకూడ సరిగ్గాలేదు. సమయానికి రెండు దుప్పట్లు చాకలాడి దగ్గర ఉండిపోయాయి. దోమతెరలు తెచ్చుకోలేదు. ఒకటే దోమలూ, చలీ. ఒట్టి రోజులైనట్లైతే ఎలాగో గడిపేద్దుం కాని పండగలు కావటం, దరిద్రం మరీ భూతద్దంలోంచి చూసినట్టు కనుపించసాగింది. ఆఖరికి సంక్రాంతినాడు సాయంత్రం, ఉండబట్టలేక, బట్టల కొట్టాయన్ని బతిమలాడితే రెండు దుప్పట్లూ, ఒకపంచెల్చాపూ, రెండు రడీమేడ్ షర్టులూయిచ్చాడు; పద్దు రాసుకుని— అత్తారింటికి వెళదామని; అందరితో సరదాగా గడుపుదామనీ బైల్దేరిన ఆయనకి నావల్ల అలా అయింది. రైల్లో నేను కనబడకపోతే ఆయన, పర్స్‌పోయిన సంగతి ముందే తెలుసుకొని, వెంటనే ఊళ్ళో కొచ్చి ఏవో తంటాలుపడి మర్నాటికైనా విశాఖపట్నం చేరుదురు. వెనక్కి వెళ్ళలేక, ముందుకీ పోలేక— అలా అవస్థకి లోనైన ఆయన మొహం చూడ్డానికి నాకు మొహం చెల్లలేదు. ఎంతబాధో!'

'— అయ్యో. ఇంకా నయం టిక్కెట్ కలెక్టర్స్ కివ్వడానికైనా మీ దగ్గర ఉందిగనక—' అని ఏదో, అన్నాను. ఆ తరవాత నాకు మాటే రాలేదు. ఊరుకున్నాను.

'ఆఖరికి, కనుం వెళ్ళిన మర్నాడు తిరిగి రావడానికి డబ్బులు లేవుగా,

నాకు తెలుసున్న ఓ లారీ డ్రైవర్ తో చెప్పి, లారీలో ఎక్కించి పంపేవండి, ఆయన్ని రాజమండ్రి!— ఎందుకులెండి; అవన్నీ వింటున్నకొద్దీ మీకు బాధ!"

ఇంతకంటె బాధపెట్టేమాట అతనేదీ అన్లేదు. నా కింక ఏడుపు ఆగదనిపించింది. "ఉండండి, మీకు కాఫీ తెస్తాను!" అని లోపలి కెళ్ళాను.

నా మొహం నటించ గలిగింది గాని, నా మనస్సు కళ్ళూ నటించలేకపోయాయి. లోపలి కెళ్తూనే, నీరు



కమ్మిన కళ్ళకి ఏదీ కనిపించక, వెంటనే తుడుచు కోవల సొచ్చింది.

● ● ●

అలాగే మనస్సూనూ.

నా మనస్సు, పరిపరి విధాల పోయింది... ... సిల్లీగా కనుపించే ఈ పండగ ఉదంతం అనుభవం నాకేవో కొత్త పాఠాలు నేర్పడానికి సమకట్టినట్టుంది.

● ● ●

నా గుండె నీరైపోయింది. జరిగింది నెమరు వేసుకొంటే యిలా కనుపిస్తోంది... ఆయనెలా వున్నారో అని నేను అనుక్షణం బాధపడడం వల్లే ఆయన నిజంగా బాధలు పడ్డారు. తిండి అమరిందో లేదో, నిద్ర కుదిరిందో లేదో, సరదా లేదేమో, సరసం లేదేమో, అని నే నెలా అనుకున్నా అన్నీ తథాస్తైపోయి, ఆఖరికి ఏక్సిడెంటైందేమో అని నే ననుకొనే సరికి ఆయనకి లారీలో ప్రయాణంచేసే యోగం పట్టడం! ఇంత పాపాత్ము రాలినా, నేను! — నా కాయన మీదవున్న ప్రేమాభిమానాలు కీడునూ చెడునూ శంకింప జెయ్యడం తప్ప వరోం ని ఎరగవా? — ఆయనెక్కడో కులాసాగా, హుషారుగా, ఆనందంగా ఉండివుంటారని నే నెందు కనుకో లేకపోయానో! అలా అనుకుంటే అలాగే ఉండేవారేమో.

ఈ ఆడిట్ క్యాంప్ పదహారో రోజు ఎప్పుడు పూర్తవుతుందో ఆయనెప్పుడు ఇంటికొస్తారో... ఆయన్ని ఈ క్షణం చూడాలనుంది.

హాల్లో ఆయన బస్ట్ ఫోటో కెదురుగా నించొని, సగం ఆల్బినజడ ముందుకు తెచ్చుకుని అల్లుకుంటూ, ఓసారి పైకీ ఓసారి కిందికీ చూసుకుంటూ, ఆఫోటో నన్ను పలకరించిన పులకరింపుకి సిగుపడి నవ్వుకున్నాను.

కాని—అదికాదు. అదొట్టి మూఢ నమ్మకం... ...ఆయనేమైనా రాజకుమారుడి తులసి మొక్కా, నా మనస్సులో భావాన్నిబట్టి పెరుగుతూ తరుగుతూ వుండడానికి? — అది కాదు. మరేదో వుంది పాఠం.

● ● ●

గొప్పలు చెప్పేరు, ఎయిర్ కండిషన్ గది, డన్లపిల్లో అంటూనూ. కోరికలు గుర్రాలై కోట గోడలు లంఘించేయి. సెనగలూ రాళ్ళూ కలియ బోసినట్టు బాగానే అల్లేరు. ఫిన్లే వారి పంచెలచావు! గొప్పలు విని అలా జరిగేటట్టు చేస్తారనా?— ఏమో నవ్వువస్తోంది.

రానీ, ఇంటికి!— ఎలా దెప్పితే బావుంటుందో. నిడదవోలు నించి ఎవరో ధాన్యం వ్యాపారస్తుడట, ఈ వూళ్ళో పనుండి మనింట్లో మకాం ఉందామని వొచ్చాట్ట. ఎయిర్ కండిషన్ గదీ డన్లపిల్లో లేవని వెళ్ళిపోయాడు, అననా? అంటే ఏమంటారో.

అదీ కాదు. గొప్పకోసం ఆయనెప్పుడూ తాపత్రయ పడలేదు. మా పుట్టింటూరు గొప్పగా జరిపించలేదని ఆయన అభిప్రాయం కానే కాదు. ఇంకేదో వుంది, నే నైనా మరెవరైనా నేర్చుకోవలసింది!

● ● ●

ఈ అబద్ధాలెందు కాడేరో? మోసంచేసేరు... ...అవును.

అబద్దా లాడవలసిందే. ఈ అర్జునులవారు ఆ పార్థసారథితో, ఒక పీఠికాపురాన నా ఎడబాటులో గడిపిన ఆ యుగాల చరిత్ర—ఆయన నాతోనే కాదు, ఏ భర్త ఏభార్యతో చెప్పినా అందంగా వుండదు... ...

పార్థసారధే, కొంచెం ఆలోచించి నాతో నిజంచెప్పక మానెయ్యవలసింది... ...అసలీయనే, అతన్ని కూడా కట్టుదిట్టం చేసుకోవలసింది. ... ...క్లైమ్ లేకపోయి ఉంటుంది. నేను రైలుదిగి, రిక్షాఎక్కి ఝాడించే సమయాని కూడా ఆయనకి అబద్ధాలు తట్టలేదు... ...రాత్రి మళ్ళీ, పునఃపృచ్ఛలో పుట్టిన ఉపాయం ... అంతలా నె నడక్కపోతే ఆయన చెప్పేవారే కాదు.

ఇంతాచేసి దారిద్ర్యం, లోకంలోని తత్త్వవేత్తలందరూ అనుభవనీయమని తేల్చి ముందీ చెప్పిన ఉదాత్తయోగం—తప్పకుండా చవి

చూడవలసిందే. కాని పండగ అవడాన్ని—ఒచ్చింది పేచీ... ...అంతు చేత—నా సంతోషం కోసం, నేను మూడు రోజులూ అనుభవించిన వేదన మరిచిపోడం కోసం, ఆయన సుఖంగా ఉన్నారు కదా అని నేను తృప్తి చెందడం కోసం, అతే మాటాడితే మా ఆయనకేం లోటు, ఇలాంటి గొప్ప స్నేహితులున్నారని నేను పొంగిపోడం కోసం — వొక అందమైన అబద్ధం ఆడేశారు, ఆదర్శవంతంగా.

నిజానికి ఆదర్శం అంటే కూడా అందమైన, కష్టమైన అబద్ధమేగా,

క్షణికం కానీ, శాశ్వతం కానీ, ఆనాటి, ఆయనగారి, అందమైన అబద్ధాన్ని విని, నేను పొందిన ఆనందాన్నీ, అది చూసి ఆయన పడ్డ తృప్తినీ, ఆయనా నేనూ స్మరణీయంగా ఉంచుకోడంమాత్రం కర్తీ లేని నిజం!

నిజంకోసం అబద్ధం!

అబద్ధం అని తెలిసి పోయినంత మాత్రాన అందం నశించి పోయేటట్లయితే కావ్యాలు కాయితప్పడవలూ, ప్రబంధాలు పకోడీపొట్లాలు అయిపోయి ఎప్పుడో పోయి వుండేవి.

కోపగించుకునీ, మీ కథ నాకు తెలిసిపోయిందండోయ్ అని వెటకారంచేసీ, నే నే ప్రయోజనాన్ని సాధించేది? ఓ గడియసేపు ఆయన్ని దులిపేసి కడిగేసి యిలా చేస్తారా అని నిలదీసి అడిగితే ఫలితం ఏమిటో నాకూ తెలుసు. ఆయన నా కిచ్చిన ఆనందం అంతా ఒట్టి నీటిమీద రాతయిపోతుంది. ఆయన బాధపడి పోతారు. క్షమార్పణలు చెప్తారు. మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడతారు. అయితే చాలా చిన్నబుచ్చుకుంటారు... నేనే ఆయన్ని చిన్నబుచ్చేసే కన్న అవమానం ఏముంది, నాకు?

నేను పార్థసారథంత తెలివి తక్కువదాన్ని కాదు!

... నా కానందం యిస్తున్నానన్న గర్వం ఆయన కుండడం నా జీవితానికెంతో అవసరం, ఆరోగ్యం! ఆ గర్వాన్ని భంగం చెయ్యడం చాలా ప్రమాదం... నన్ను సుఖపెడుతున్నాననీ, ఆనందిస్తున్నాననీ ఆయన అనుకుంటే, అది భ్రమే అయినా ఆయనకి ఆరోగ్యం... ...అవసరమైనంత భ్రమ లేక, ఎప్పటి కప్పుడు కఠోర సత్యాన్నే కలుసుకుంటూ, నిరాశల్నే ఎదుర్కొంటూ వుండడం వల్లనే జనం సుఖపడలేక పోతున్నారు...

● ● ●

టిఫినూ కాఫీ యిచ్చి, పార్థసారథి వాట్ని స్వీకరిస్తున్న సమయంలో, నేను నేర్చుకున్న పాఠం, వాటికన్న రుచిగా శుచిగా అతనికిఅందజేసేను. అతను చేసిన తప్పు తెలుసుకొని, మరోతప్పు చెయ్యకుండా వుండే అవకాశం ఒస్తోందంటే అది అందివుచ్చుకుందికి చాలా వుత్సుకత చూపించేడు. దాంట్లో అతనికి చాలా ఆనందం కనబడేటట్టు చూపించేను.

నవ్వుకుంటూ నమస్కరిస్తూ వెళ్ళాడు పార్థసారథి.

● ● ●

మర్నా డెవరితోనో సినిమాకి వెళ్ళేను. అట్నుంచొచ్చేసరికి మా ఆయన ఈజీచైర్లో పడుకుని నిద్రరోతున్నారు.

"ఎప్పుడొచ్చేరండీ?" అన్నాను, లేవుతూ.

"ఏడుంబావుకి"

"అయ్యో; అనుకుంటూ నేఉన్నానుసుమండీ. వంటకూడా చేసిందాన్ని ఏ మోలే, ఇవాళే ఒస్తారా అని అనుకుంటూ కామాక్షమ్మ గమ్మంతే సినిమాకి వెళ్ళేను!"

"పోన్లే—"

"కాళ్ళు కడుక్కోండి; భోం చేద్దాం. ఇద్దరం కలిసితిని ఎన్నాళ్లైందో!"

ఆయన నావేపు విచిత్రంగా చూస్తూ లేచేరు.

నా ధోరణి కృత్రిమంగా తయారైపోతోందని గ్రహించాను. వెంటనే నోటికొచ్చిన మాటేదో పెదిమల్లోనే బిగించేశాను.

"పెట్లో డబ్బు తక్కువైందే—! ఏమైనా కొన్నావా?" అన్నారు మా ఆయన; కొంతసేవుపోయాక.

● ఇద్దరు బిచ్చగాళ్ళు చెట్టుకింద కూచ్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఒకడు ఇలా అన్నాడు : "ఒకసారి నాకు అయిదు రోజులపాటు ఎక్కడా బిచ్చం దొరకలేదు. విపరీతంగా ఆకలేసింది. అయినా ఎలాగో ఇంకో రెండు రోజులు ప్రాణాలు నిలుపుకున్నాను. అప్పటికీ బిచ్చం దొరకలేదు."

రెండోవాడు : "అప్పుడేం చేశావ్?"

మొదటివాడు : "ఏం చేస్తాను. ఆకలికి మలమలమాడి చచ్చిపోయాను."

రెండోవాడు : "చచ్చిపోయావా? ఇప్పుడు బతికే వున్నావుగా?"

మొదటివాడు ; "అ, ఇదీ ఓ బతుకేనా?"

ముద్దనోట్లో ఉండిపోయి నేనేం అన్లేదు. 'లే'దన్నట్టు తలూపాను.

'—మరేంలేదు; రవణమూర్తి డబ్బు అప్పు కావాలంటేను, ఇస్తాను రమ్మని ఇంటిదాకా తీసుకొచ్చి లేదని పంపవలిసొచ్చింది—'

'అప్పు కావాలని ఒచ్చేరా... తీర్చవలసిన బాకీ ఒకటుంటే తీర్చేశాను, నేను.' అన్నాను, ఆయన వేపు చూడకుండా.

'ఎవరి కబ్బా?'

'ఎవరో పిఠాపురంలో బట్టల వ్యాపారస్తుట్ట. మీరు నలభైరెండు రూపాయల చిల్లరివ్వాలంటూ బిల్లు బుక్కు తెచ్చి చూపించాడు...... ఏదో పనుండీ రాజమండ్రి ఒచ్చి పనిలో పనిగా మనింటి కొచ్చినట్టున్నాడు......మీ సంతకం ఉంది, బాగానే గుర్తుపట్టాను. మనింటి గుర్తులు మీ ఫ్రెండెవరో చెప్పేట్ట, తిన్నగా ఒచ్చేశాడు...... సరేలే, ఏ క్యాంప్లోనో ఎప్పుడో తెచ్చుంటారు అనుకుని, పెట్లోడబ్బు ఉంది, తెచ్చి యిచ్చేశాను.'

మా ఆయన ఒక్కనిమిషం తినడం మానేసి, అంతావిన్నారు 'ఇంకేమైనా చెప్పేడా?' అన్నారు. ఆయన అంతలా తెల్లబోవడంచూసి, బిల్లు బుక్కుమీద తారీకు చూశావా అని అడిగేస్తారేమోననీ, ఈ కథ పప్పులో కాలువెయ్యకుండా ఒడ్డెక్కించ గలనా అనే భయం వేసింది.

'ఊహూఁ. ఏం చెప్పలేదే.'

ఆయన నావేపు ఇంకా కాస్త అనుమానంగా చూస్తూ 'పార్ధసారధీ, ఆ సంగతులేమీ చెప్పలేదూ?'

'పార్ధసారధంటే, నల్లగా ఉండే ఆయనేనా, ఇన్స్యూరెన్సు—'

'ఛీ ఛీ అతనుకాదే, తెల్లటాయన, సర్వేయరు!'

'ఓహో, ఆయన ఊసెందుకూ, ఇప్పుడు?'

'అఁహాఁ. అతనూ పిఠాపురంలోనే ఉంటున్నాడులే!'

'ఏమో, అయితే మనింటి గుర్తులూ అవీ అతనే చెప్పి ఉంటాడు. ......సినిమాకి బైల్దేరుతూ వుంటే ఎదురుగా ఒచ్చాడు, వెంటనే పంపేశాను......ఇంతకీ మీరు బాకీ ఉండడం నిజమేకద!'

మా ఆయన నోట్లో ముద్ద పెట్టుకొని, తలవూపారు; పరధ్యానంగా.

□□□

శిశిరాలూ సరిహద్దులూ

(గతసంచిక తరువాయి)

23

ప్రసాద్ తల్లి చనిపోయింది. ప్రకాశరావుగారు అంత్యక్రియలు ముగించి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటిముందు రెడ్ క్రాస్ వ్యాన్ నిలిచిఉంది. ఆయన అనుమానిస్తూ లోపలికి అడుగు పెట్టేసరికి అక్కడ కూతురితో ఎవరోఆఫీసరూ, కొందరు స్త్రీలూ మాట్లాడుతున్నారు. ఆయన రాగానే అందరూ మౌనంగా ఉండిపోయారు. గంభీరంగా, బెబ్బులిలాగా ఉండే పోలీస్ ఆఫీసర్ ప్రకాశరావుగారు భార్య మృతితో జీవచ్ఛవం అయిపోయాడు. చిక్కిపోయి, నీరసంగా, అతిదీనంగా ఉన్నాడు. వాళ్ళందరూ ఎందుకు వచ్చారో, ఇంటిముంగిట రెడ్‌క్రాస్ వ్యాన్ నిలిచినకారణమేమిటోఆయన గ్రహించుకోగలిగాడు. ఆయన దుఃఖం ఇనుమడించింది. భార్య చనిపోయింది. కొడుకు చావుకు సమీపంలో ఉన్నాడు. ఇప్పుడు కూతురు కూడా అక్కడికే వెళ్తున్నది. తనకిక ఎవ్వరూలేరు ప్రపంచంలో. తాను ఏకాకి. అందరూ తనను వెలివేసి తననుంచిదూరంగా వెళ్ళిపోతున్నారు.

ప్రకాశరావుగారు ఎవ్వరితోనూ మాట్లాడలేదు. ఆయనతో ఎవ్వరూ మాట్లాడలేదు. ఆయన పరిస్థితిచూసి పలకరించే ధైర్యంలేక మౌనంగా ఉండిపోయారు. కానీ 'మీ అనుమతి కావాలి' అని అడుగుతున్నట్లుగా ఉన్నాయి వారి ముఖాలు. అందరూ ఆయన సమాధానంకోసం ఎదురు చూస్తున్నారు. ఆయన నీరసంగా సోఫాలో కూలిపోయి,ఉత్తరీయంలో ముఖం దాచుకుని, దీనంగా విలపించాడు. ఆయన కన్నీరు చెక్కిళ్ళ మీదుగా కారి ఉత్తరీయంక్రిందుగా జారిపోతున్నాయి. 'తీసుకువెళ్ళండి. ఇక నా అనుమతితో నిమిత్తంలేదు.

సీరియల్

త్వరగా తీసుకు వెళ్ళండి" అన్నాడు. లలిత కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ప్రకాశరావుగారు కన్నీరు తుడుచుకుని "వెళ్ళమ్మా వెళ్ళు. నాది మొండి ప్రాణం. చచ్చిపోనులే" అన్నాడు. లలితఅప్పటికే పెట్టెసర్దుకుని సిద్ధంగా ఉంది. నౌకరు పెట్టె తీసుకు వెళ్ళి వ్యానులో పెట్టాడు. లలితవచ్చి తండ్రి పాదాలకు నమస్కరించింది. "వెళ్ళివస్తాను నాన్నా. అన్నయ్యను కూడా వెంటబెట్టుకు వస్తాను" అంది.

ఇంకా దేనికమ్మా నాకు ఈ ఓదార్పు" అన్నాడు ఆయన. ప్రక్కనున్న స్త్రీలలో ఒకామె సముదాయిస్తూ అన్నది, "ప్రకాశరావుగారూ మీరు పోలీసు ఆఫీసరు. ఇతరులకు ధైర్యం చెప్పవలసినవారు మీరే ఇల్లా అధైర్యపడితే ఎలా? ప్రసాద్‌వంటి కొడుకునూ, లలితవంటి కూతురినీ కన్నందుకు మీ రెంతో అదృష్టవంతులు."

లలిత గడపదాటి వెళ్తూ, "మళ్ళీ ఎప్పటికి తిరిగివస్తానో, అసలు వస్తానో రానో" అనుకుంటూ, ఒక్కసారి – తాను పుట్టిపెరిగిన ఇంటికేసీ, తనను కన్న తండ్రికేసీ చూసింది. తన ప్రాణమంతా కన్నుల్లో నింపి చూసింది. వెళ్ళి వ్యానులో ఎక్కి కూర్చుంది. వ్యాను రివ్వున ముందుకు దూసుకు వెళ్ళిపోయింది. కనుమరుగైపోయేవరకూ రోడ్డుమీదనే చూస్తూ ఉండిపోయారు ప్రకాశరావుగారు. పరామర్శించడానికి వచ్చినవాళ్ళంతా ఒక్కొక్కరూ వెళ్ళిపోయారు. ఆయన ఇంటిలోకి అడుగుపెట్టారు. బావురుమంటున్న అంతపెద్ద ఇంటిలో పలకరించే దిక్కు లేకుండా తను ఒక్కడూ మిగిలిపోయాడు. తనకు కావలసినవాళ్ళూ, తను కావలసినవాళ్ళూ ఇక్కడ ఎవ్వరూ లేరు. తను కుమిలిపోతే ఓదార్చేవారు లేరు. తను కృశించిపోతే సేవచేసేవారు లేరు. తాను ఆనందిస్తే పంచుకునేవారు లేరు. తాను ఒక జీవచ్ఛవం. ఈ శవానికి గోరీ ఈ ఇల్లు. ఒకప్పుడు దేవాలయంలా వెలిగిపోయిన ఇల్లు ఇప్పుడు గోరీలా గుబులుగుబులుమంటూ వుంది. గబ్బిలాలు తిరిగే ప్రాచీన శిథిలసౌధంలా చీకటిగా కనిపించింది ఇల్లు. ఆ చీకటి తన కన్నుల్లోనే ఉందేమో అనుకున్నాడు. ఆ నిశ్శబ్దం భయపెడుతోంది. ఇక తను ఈ ఇంటిలో ఉండలేనని అనిపించింది. వెంటనే టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. కాగితం కలం తీశాడు. తనను తక్షణం ఇక్కడనుంచి ఎక్కడికైనాసరే బదిలీ చేయవలసిందని కోరుతూ పై ఆఫీసరుకు అప్లికేషన్ రాశాడు.

24

ముందు స్థావరంలో ఆరాత్రి భీషణంగా యుద్ధం జరుగుతోంది. మనపక్షాన సుమారు మూడువందల మంది సైనికులు ఉన్నారు. చైనా వారు దాదాపు మూడువేలమంది ఉన్నారు. అంతకుముందు మూడు రోజులు తమ పథకాలు విఫలం కావటం, విశేషంగా నష్టం వాటిల్లటం చైనా వారిని మరింతగా రెచ్చగొట్టాయి. అందుచేత ఈ రోజు మరింత కసిగా ఒక వ్యూహం, ఒక పద్ధతిలేకుండా, మొరటుగా, పొరుగువాడి పొలంలోకి పశువులని తోలినట్లు, సైనికులను వందలు వందలుగా మందలు మందలుగా రణరంగం మీదికి గుప్పిస్తున్నారు. ఎన్నివందల మంది చచ్చినాసరే స్థావరం చిక్కితే చాలునని వారి కోరిక. సైనికుడి ప్రాణం తృణప్రాయం వారికి.

లెఫ్టినెంట్ కల్నల్ సుబీర్‌సేన్, మేజర్‌రాయ్, కెప్టెన్ ప్రసాద్, లెఫ్టినెంట్ శివరామ్ నలుగురూ నాలుగు కీలకస్థానాలలో మోహరించి కట్టుదిట్టమైన వ్యూహం ప్రకారం యుద్ధం సాగిస్తున్నారు. ఒక చిన్న బృందానికి నాయక్‌సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. చైనావారు మిడతల దండుల్లాగా వచ్చిమీద పడుతున్నారు. మిడతల లాగానే కుప్పలు కుప్పలుగాచచ్చిపోతున్నారు. చచ్చినవాళ్ల మీదనుంచి నడిచి, తొక్కుకుంటూ తోసుకుంటూ వస్తున్నారు మిగతా వాళ్ళు. ఒక్కొక్క భారత సైనికుడు ఐదారుగురు చైనీయులను సంహరిస్తున్నాడు. చైనీయులు చచ్చినవారు చావగా, ఇంకా ఎంతోమంది క్షతగాత్రులై నేలమీద గిజగిజ తన్నుకుంటున్నారు.


నాయక్‌సింగ్ రౌద్రాకారంతో, శివమెత్తినట్లు యుద్ధం చేస్తున్నాడు. అతని బృందం వైపు వచ్చిన చైనీయుడు వచ్చినట్లే నేలకొరుగుతున్నాడు. ప్రాణాలతో పారిపోయినవాడుగానీ, ముందుకు తోసుకు వచ్చిన వాడుగానీ ఒక్కడు లేడు. నాయక్ చేతిబాంబులు విసరటంలో అద్భుతమైన ఒడుపుగలవాడు. వెంట్రుక వాసికూడా గురి తప్పకుండా విసరగలడు. అతని ధాటికి తట్టుకోలేక, అతని దరిదాపుల్లోకి రావటం శ్రేయస్కరంకాదని శత్రువులు ఆవైపు రాకుండా మరో వైపు తోసుకురావటం మొదలు పెట్టారు. నాయక్ దృష్టి హఠాత్తుగా మేజర్‌రాయ్‌దళం ఉన్నవైపు తిరిగింది. మేజర్‌రాయ్ దళంపై చైనీ

నండూరి పార్థసారథి

యులు బ్రెన్‌గన్ గుళ్ళవర్షం కురిపిస్తు న్నారు. మేజర్ బృందంలో ఎవ్వరూ శత్రువుల బ్రెన్‌గన్‌లను పడగొట్టలేక పోతున్నారు. ఎడతెరిపి లేకుండా వచ్చి పడుతున్నా తుపాకి గుండ్లు తగిలి మేజర్ బృందంలో అనేకమంది నేలకొరుగు తున్నారు. మేజర్ పరిస్థితి చాలా ప్రమాదంలో పడింది. ఒక వైపునుంచి కాక మూడువైపులనుంచి శత్రువులు బ్రెన్ గన్‌లు ప్రయోగిస్తున్నారు. మేజర్ బృందంలో చాలామంది మర ణించారు. మిగిలినవారు గాయపడి తుపాకిపట్టలేని స్థితిలో ఉన్నారు. మేజర్‌రాయ్‌ఒంటరివాడైపోయాడు. కెప్టెన్ ప్రసాద్, లెఫ్టినెంట్ శివ రామ్‌లు వేరేచోట్ల యుద్ధం చేస్తు న్నారు అక్కడినుంచివచ్చి మేజర్‌ను రక్షించడానికి వారికి తెరిపి దొరక కుండా ఉంది. చూస్తూ ఊరుకుంటే ఇంకా కొద్దినిమిషాలలో మేజర్ నేల కొరిగే పరిస్థితి ఏర్పడింది. నాయక్ ఒక్క ఉదుటున అక్కడికి లంఘిం చాడు. కందకంలోకిదూకి, అక్కడ నుంచి ఒకచేతిబాంబు గురిచూసి ఒక బ్రెన్‌గన్ వైపు విసిరాడు. మరు క్షణంలో ఆ వైపునుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ బ్రెన్‌గన్ మాటున నక్కిన చైనీయులు నిశ్శేషం అయ్యా రనటంలో సందేహం లేదు. నాయక్ దెబ్బ అటువంటిది. ఒక వైపునుంచి కాల్పులు ఆగిపోవటంతో మేజర్‌కు కొంత తెరిపి ఇచ్చినట్టయింది. మిగి లిన రెండు గన్‌లను మేజర్ నాయక్ చెరొకదాన్ని ఎదుర్కొ న్నారు. నాయక్ చేతి విసురుకు మరొక బ్రెన్‌గన్‌కూడా పడిపో యింది. మూడవదాన్ని మేజర్ ధ్వంసం చేశాడు.

ఇక్కడి యుద్ధం పరిస్థితిని ఎప్పటి కప్పుడు వైర్లెస్ ద్వారా కల్నల్‌కు తెలియపరుస్తూనే ఉన్నారు. లెఫ్టి నెంటు కల్నల్, కెప్టెన్, లెఫ్టినెం టులు ఉన్నచోట్ల యుద్ధం ఇంకా ముమ్మరంగా సాగుతూనే ఉంది. భారతసైనికులు ఎంత శౌర్యంతో పోరాడినా, ఎంతమందిని వధించినా ప్రయోజనం లేకుండాఉంది. చైనా వారు ఇంకా ఇంకా వందలకొద్దీ వచ్చిపడుతున్నారు. ఇక స్థావరాన్ని దక్కించుకోవటం అసాధ్యమని తేలి పోయింది. ఆ స్థితిలో కల్నల్‌నుంచి వెనుకకు ఉపసంహరించుకో వలసిం దిగా—ఉత్తర్వు చేరింది. భారత సేనలు అక్కడి స్థావరాన్ని శత్రువు లకు చిక్కకుండా ధ్వంసంచేసి వెను కకు ఉపసంహరించు కున్నాయి.

చైనా పక్షాన వెయ్యిమందికిపైగా మరణించారు. మరొక వెయ్యిమంది దాకా గాయపడ్డారు. భారత సైన్యంలో యాభైమందికిపైగా మర ణించారు. వందమందిదాకా గాయ పడ్డారు. లెఫ్టినెంట్ కల్నల్ సుబీర్ సేన్, మేజర్, కెప్టెన్, లెఫ్టినెంట్, నాయక్ క్షేమంగా తిరిగివచ్చారు. తిరిగి వచ్చిన సైనికులు కొందరు



చైనా సైనికుల శవాలనుంచి ఆయు ధాలు పోగేసుకువచ్చారు. అందరి కంటే నాయక్‌సింగ్ సాధించిన ఘనకార్యం ఒకటుంది. అతను అతి సాహసంతో, కొండరాళ్ళ చాటు నుంచి పాక్కుంటూ వెళ్ళి, చైనావారి బ్రెన్‌గన్‌ను ఒకదాన్నిపట్టుకొచ్చాడు. దానివెనక నక్కిన వారంతా అతని చేతిబాంబు దెబ్బకే కుక్కిన పేను ల్లాగా హతమయ్యారు. ఆ యుద్ధంలో అతను ఒక్కడూ దాదాపు ముప్ఫయి మందిని వధించాడు. అతని శౌర్య సాహసాలను గురించి ఆఫీసర్లందరూ కల్నల్‌కు వర్ణించి చెప్పారు. కల్నల్ అతన్ని ప్రశంసించాడు. తన ప్రాణా లను కాపాడినందుకు మేజర్ ప్రత్యేకంగా నాయక్‌కు కృతజ్ఞత చెప్పుకున్నాడు.

25

తెల్లవారుతోంది. పొగమంచు దట్టంగా వ్యాపించింది, పదిఅడుగుల అవతల ఏముందో కనిపించటంలేదు. చలి నరాలను జివ్వన లాగేస్తోంది. రాత్రియుద్ధంలో గాయపడి, లేవలేక నేలమీద మంచులో నిస్సహా యంగా పడిఉన్న సైనికులు చలికి బిగుసుకు పోతున్నారు. చలివల్ల

కొందరు మరణించారు. మరికొందరు మరణిస్తూ ఉన్నారు. మృత్యువు వారిని కొద్దికొద్దిగా కబళిస్తోంది. ఆ పొగమంచులో రెడ్‌క్రాస్ వర్కర్లు శవాలకోసం, క్షతగాత్రుల కోసం వెతుకుతున్నారు. దొరికిన దేహాలను నెమ్మదిగా స్ట్రెచర్ల మీదికి ఎక్కిస్తున్నారు. ప్రాణం ఉన్న దేహాలపై నిండుగా వెచ్చని రగ్గులు కప్పుతున్నారు. ఒక్కొక్క స్ట్రెచర్‌నే నాలుగో స్థావరానికి చేరవేస్తున్నారు. ఇరుకైన డొంకదారిగుండా నడిచి, కర్రవంతెనదాటి స్థావరం దిశగా వస్తున్నారు రెడ్‌క్రాస్ వర్కర్లు.

కల్నల్ వరండాలో టేబుల్, కుర్చీ వేసుకుని కూర్చున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ సుబీర్‌సేన్, మేజర్ రాయ్, కెప్టెన్ ప్రసాద్, ఇతర ఆఫీసర్లుకూడా అక్కడే కుర్చీలలో కూర్చున్నారు. రాత్రి జరిగిన యుద్ధంలో ఖచ్చితంగా ఎంతమంది మరణించారో ఎంతమంది గాయపడ్డారో, ఎవరెవరు మరణించారో, ఎవరెవరు గాయపడ్డారో, ఆచూకీచిక్కని వారు ఎందరో— ఈవివరాలేమీ ఇంతవరకుతెలియవు. స్ట్రెచర్లువస్తేగానీ వివరాలు తెలియవు. ఆందోళనతో అందరూ ఎదురు చూస్తున్నారు.

కల్నల్ ఏదో చెప్పాలనుకుని నాయక్‌సింగ్‌ను పిలిపించారు. నాయక్‌వచ్చి శాల్యూట్ చేసి, అటెన్షన్ పొజిషన్‌లో నుంచున్నాడు. ఇంతలో రెడ్‌క్రాస్ స్ట్రెచర్లు వరసగా రావటం మొదలు పెట్టాయి. ముందుగా రెడ్‌క్రాస్ ఉద్యోగివచ్చి కల్నల్‌కు శాల్యూట్ చేశాడు.

"మొత్తం ఎంతమంది?" కల్నల్ ప్రశ్నించారు.

"155 మంది సార్. మరణించిన వారి సంఖ్య 63, గాయపడిన వారి సంఖ్య 87. తొమ్మిది మంది ఆచూకీ తెలియటం లేదు" అని. చెప్పాడు రెడ్‌క్రాస్ ఉద్యోగి.

కల్నల్ ఈ ధ్యాసలోపడి నాయక్ సంగతి మరచిపోయాడు. అతనివంక ఎవరూ చూడటంలేదు. అతను అలా అటెన్షన్ పొజిషన్‌లో రాతి విగ్రహంలా నుంచునే వున్నాడు. రెడ్‌క్రాస్ వర్కర్లు ఒక్కొక్క స్ట్రెచర్‌ను కల్నల్ ఎదుటకు తీసుకువచ్చి, శవం ముఖంమీది గుడ్డను తొలగించి చూపుతున్నారు. పక్కనవున్న ఆఫీసర్లు శవాన్ని గుర్తించి, ఆ వ్యక్తి పేరు హోదా, బెటాలియన్. నెంబరు, ప్లాటూన్ నంబరు ప్రకటిస్తున్నారు. ఒక ఉద్యోగి ఈ వివరాలను రిజిష్టరులో నమోదు చేస్తున్నాడు. ఇంతలో "సుబేదార్ రామ్‌సింగ్, బెటాలియన్ నంబరు 6, ప్లాటూన్ నంబరు 4" అని ఒక ఆఫీసరు ప్రకటించాడు. రామ్‌సింగ్ పేరు వినగానే నాయక్ విద్యుత్తు సోకినట్లు నిలువెల్లా కంపించిపోయాడు. కళ్ళు బైర్లుగమ్మాయి. కాళ్ళకింద నేల జర జర పాకు తున్నట్లుఅనిపించింది. తల వెయ్యి మణుగుల బరువెక్కింది. కీళ్ళు పట్లుతప్పుతున్నాయి. అతికష్టం మీద బలం, నిబ్బరం కూడ దీసుకుని అలాగే నిలబడ్డాడు. స్ట్రెచర్ మీది శవం ముఖాన్ని చూశాడు. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. స్ట్రెచర్ వెళ్ళిపోయింది అతను తల తిప్ప లేదు, కాలు కదల్చలేదు. మనస్సు మాత్రం స్ట్రెచర్‌ను వెంబడించి వెళ్ళింది.

స్ట్రెచర్లన్నీ ఒక్కొక్కటిగా వెళ్ళిపోయాయి. శ్మశాన నిశ్శబ్దం ఆవరించుకుంది. అందరూ మౌనంగా తలలు వంచుకుని ఉన్నారు. కల్నల్ బరువుగా నిట్టూర్చి మేజర్, కెప్టెన్‌ల వంక తిరిగాడు. తర్వాత ఆయన దృష్టి నాయక్ మీద పడింది. అతని ముఖాన్ని చూడగానే ఆయన దిగ్భ్రాంతితో కొయ్యబారిపోయాడు. నోటమాట పెగలేదు. తన జీవితంలో ఎన్నడూ చూడని ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూస్తున్నట్లు ప్రాన్పడిపోయాడు. నాయక్ కళ్ళల్లోనుంచి నీళ్ళుకారి, చెంపలమీదుగా ప్రవహిస్తున్నాయి. కన్నీళ్ళతో గడ్డం అంచునుంచి కన్నీరు బొట్లు బొట్లుగా కిందికి పడుతున్నది. ఎప్పుడూనవ్వుతూ త్రుళ్ళుతూ, చిన్న పిల్లాడిలా చిలిపిగా అల్లరిచేసే ఈ వృద్ధుడు కన్నీరు పెట్టగలడని కల్నల్ ఎప్పుడూ అనుకోలేదు. దృఢకాయుడూ, దీర్ఘకాయుడూ అయిన నాయక్ సింగ్ చలనరహితంగా, రాతి విగ్రహంలా, అటెన్షన్ పొజిషన్‌లో నుంచుని వున్నాడు. ముఖంలో ఏభావమూ లేదు. నిశ్చలంగా ఉంది. అతని హృదయంలోని శోకం ఒక్క కన్నీటి వల్ల తప్ప మరే విధంగానూ వ్యక్తం కావటం లేదు. ఒక మహాసామ్రాజ్యాన్ని పరిపాలించే నిరంకుశ చక్రవర్తి ఏడుస్తున్నట్లు, వన్యమృగాలన్నింటికీ రారాజైన సింహం కన్నీరుపెట్టినట్లు, ఘటోత్కచుడు విలపించినట్లు ఉంది ఆ దృశ్యం.

"నాయక్ ఏం జరిగింది?" కల్నల్ మాటపెగుల్చుకుని అడిగాడు. ఆఫీసర్లందరూఅతనివంక అశ్చర్యంగా ఆత్రుతతో చూస్తున్నారు. నాయక్ తల తిప్పలేదు. "నాకొడుకు చనిపోయాడు సార్" అన్నాడు.

"నీకొడుకా? నీకు కొడుకు ఉన్నాడా?"

"అవును సార్"

"ఎప్పుడు చచ్చిపోయాడు, ఎక్కడ చచ్చిపోయాడు, అసంగతి ఇప్పుడు ఎలా తెలిసింది నీకు?"

"సుబేదార్ రామ్‌సింగ్ నా కొడుకు సార్."

కల్నల్, మేజర్, కెప్టెన్— అందరూ ఆశ్చర్యపోయారు.

"రామ్‌సింగ్ నీ కొడుకా? చాలా విచిత్రంగా ఉందే! మీ తండ్రీ కొడుకులు ఎప్పుడూ కలుసుకున్నట్టుకూడా

లేదు. ఇక్కడ ఎవరికీ తెలీదా ఈ విషయం?" అని అడిగాడు మేజర్ రాయ్.

"లేదుసార్. వాడు ముందు స్థావరంలో, సుబీర్ సేన్ గారి దళంలో ఉన్నాడు. ఆవిషయం నాకు తెలుసు కానీ నేను ఇక్కడికివచ్చినట్లు వాడికి తెలీదు. నేను ఈ వయస్సులో యుద్ధానికి రావటం వాడికి ఇష్టం లేదు. అందుకే వాడికి తెలియకుండా చేరాను. రాత్రి యుద్ధంలో కలుసుకున్నాం ఒక నిమిషంసేపు, తర్వాత విడిపోయాం. తెల్లవారే వరకూ వాడి సంగతి తెలియదు."

కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు, తర్వాత కల్నల్ అడిగాడు : "అతను ఒక్కడే కొడుకా నీకు?"

"అవును సార్. చివరికి ఒక్కడే మిగిలాడు. వాడూ వెళ్ళిపోయాడు." అంతకంతకు అతనిగొంతు రుద్ధమవుతోంది.

"అంతకుముందు ఎవరైనా పోయారా?" కెప్టెన్ అడిగాడు.

"నలుగురు కొడుకులు పోయారు సార్. అందరూ యుద్ధాల్లోనే."

ఆఫీసర్లందరూ ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు. కొడుకులందరినీ యుద్ధరంగానికి బలిపెట్టి, తనూ బలికాబోతున్న ఈ వృద్ధుడు ఇన్నాళ్ళూ ఏమీఎరుగని వాడిలా, పసివాడిలా అల్లరిచేస్తూ ఎలా ఉండగలుగుతున్నాడు? కల్నల్ హృదయం ద్రవించి పోయింది. ఏసుఖమూ కోరకుండా, అడుగడుగునా తన జీవితాన్ని ఇతరుల సుఖంకోసం అర్పణ చేసుకుంటూ, అంతకంటే గొప్ప ఆనందం లేదని తృప్తిగా, హాయిగా, నవ్వుతూ జీవించే ఇటువంటి వ్యక్తి ఆయన జీవితంలో ఇదివరకు ఎవరూ తటస్థపడలేదు. నాయక్ సింగ్ నిజమైన సర్వసంగ పరిత్యాగి, కర్మవీరుడు, మహాపురుషుడు. అటువంటి వాడు తనకు విధేయుడై, అతిసామాన్యుడైన ఒక సైనికునిగా ఇక్కడ ఉంటున్నాడు. అతనికంటే తన హోదా ఎంత ఉన్నతమైనది! కాని అతని వ్యక్తిత్వ ఔన్నత్యం ముందు తన వ్యక్తిత్వం ఎంత? ధైర్య సాహసాలలోగానీ, త్యాగశీలంలో గానీ, దేశభక్తిలోగానీ ఇక్కడ ఉన్న ఏ ఒక్కరూ అతనికి సాటిరారు. అతనికి పాదసేవచేస్తే తన జీవితం చరితార్థమవుతుందని అనిపించింది కల్నల్‌కు. మనస్సులోనే అతనికి జోహారులర్పించాడు. కాసేపు తన హోదాను పెద్దరికాన్ని మరిచిపోయి వినయంగా నాయక్ వద్దకువచ్చి అతని చేతులను తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"నాయక్, ఇంతవరకూ నీ విషయాలునాకు ఎందుకు చెప్పలేదు?" అని అడిగాడు.

"మీరు అడగనిదే ఏం చెప్పను కల్నల్‌సాబ్? అయినా ఈ విచారం తాత్కాలికమే. ఇది మాకు కొత్త కాదు. మా వంశంలో ఇది చాలా

సామాన్యమైన ఆచారం. మా పూర్వీకులందరూ యుద్ధాలలోనే మరణించారు. ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక విధంగా మరణించక తప్పదు అని తెలిసినప్పుడు, దేశ క్షేమంకోసం యుద్ధరంగంలో మరణించాలనుకోవటంలో ఆశ్చర్యం ఏముందిసార్? యుద్ధంలో చేరే అవకాశం అందరికీరాదు. వచ్చిన వారు అదృష్టవంతులు నేనూ, నా కొడుకులూ అందరం అదృష్టవంతులమే."

"నాయక్, వెళ్ళి విశ్రాంతి తీసుకో" అని అతన్ని పంపివేశాడు కల్నల్.

కెప్టెన్‌కు నిన్నటి తన అవస్థ జ్ఞాపకంవచ్చింది. నాయక్ వ్యక్తిత్వం ముందు తన వ్యక్తిత్వం ఏపాటి అనుకున్నాడు. మనస్సులోనే వినమ్రంగా నాయక్‌కు జోహారు చేశాడు. "బహుశా ఈపాటికి అమ్మ చచ్చిపోయి ఉంటుంది" అనే భావం కలిగింది. కానీ తన మనస్సుపై ఆభావం తామరాకుపై నీటిబొట్టులాగానే నిలిచింది.

26

అప్పటికి ఉదయం సుమారు 8 గంటలు అయింది. ఇంకా కొద్ది కొద్దిగా మంచు కురుస్తూనే ఉంది. నాయక్ స్థావరం దాటి కొండల్లో అడవిలోనుంచి నడిచి వెళ్తున్నాడు. నడకలోజవం, వేగంలేవు. ముఖంలో కాంతిలేదు. దిగులుగా, దీనంగా ఉన్నాడు. నెమ్మదిగా వెళ్ళి ఒకచెట్టు కింద రాయిమీద కూర్చున్నాడు. నీరసంగా చెట్టుకు చేరగిలబడి, ఎటో శూన్యంగా చూస్తున్నాడు. కొంతసేపటికి ఏదో అలికిడి అయినట్లు వినిపిస్తే ఉలిక్కిపడి చుట్టూ చూశాడు. ఎవరో ముగ్గురు వ్యక్తులు తనకువంద గజాల దూరంలో వెడుతున్న దృశ్యం కనిపించింది. వాళ్ళు దొంగల్లాగా భయం భయంగా, అనుమానంగా చుట్టూ చూసుకుంటూ నడుస్తున్నారు. వాళ్ళు ఇంకా తనని చూడలేదు. నాయక్ గబుక్కున ఒక కొండ రాయి వెనక దాక్కున్నాడు. వాళ్ళు మోన్‌ఫా జాతి వారిలాగానే ఉన్నారు. వాళ్ళ దుస్తులు కూడా అలాగే ఉన్నాయి. కానీ వాళ్ళని చూస్తే నాయక్‌కు అనుమానం కలిగింది. ఎందుకంటే గూడాన్ని పూర్తిగా ఖాళీ చేశారు. వాళ్ళు ఎవళ్ళూ ఇక్కడ మిగల్లేదు. వీళ్ళు నిజంగా గూడెం ప్రజలే అయితే అలా అనుమానిస్తూ, దొంగల్లాగా వెళ్ళవలసిన అవసరం లేదు. పైగా వాళ్ళు పొదల చాటునుంచి నక్కి వెళ్తున్నారు. వాళ్ళ దుస్తులలో నుంచి—తుపాకులే కాబోలు—ఎత్తుగా కనిపిస్తున్నాయి. మాటి మాటికీ వాటిని సర్దుకుంటున్నారు. ఎందుకైనా మంచిదని నాయక్—తను వాళ్ళకి కని

పించకుండా— బెల్టులోనుంచి పిస్తోలుతీసి ఒకసారి గాలిలోకి పేల్చాడు. వాళ్ళు ముగ్గురూ ఒక్కసారి అదిరిపడి, గబుక్కున తుపాకులుతీసి పట్టుకుని, చుట్టూ చూస్తున్నారు. అనుమానం నిజంకావటంతో నాయక్ రాయిచాటునుంచి గబగబ పిస్తోలు పేల్చాడు. ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు కూలిపోయారు. మూడో వాడు గాయాలతో తప్పించుకు పారిపోయాడు. వాడికోసం వెతుకుతూ నాయక్ కొంతదూరం వెళ్ళాడు కానీ వాడి జాడ కనిపించలేదు. ఇహ లాభంలేదని చచ్చిన వాళ్ళిద్దరి దగ్గరికి తిరిగి వచ్చాడు. వాళ్ళు చైనా వాళ్ళని స్పష్టంగా తెలిసిపోయింది. ఇద్దరినీ చెరోబుజం మీద గడ్డిమోపుల్లాగా వేసుకుని స్థావరానికి తీసుకొచ్చి కల్నల్ కాళ్ళదగ్గర పడేశాడు. కల్నల్ నివ్వెరపోయాడు. నాయక్ శాల్యూట్ చేసి, అటెన్షన్ పొజిషన్ నుంచున్నాడు. ఆయాసంతో వగరుస్తూ — "చైనా గూఢచారులుసార్. ఒకడు తప్పించుకు పోయాడు" అన్నాడు.

కల్నల్‌కు అతన్ని ఎలా ప్రశంసించాలో అర్థంకాలేదు. అతనిమీద గౌరవం ఇంకా ఇంకా పెరిగిపోయింది. ఆ గౌరవాన్ని మాటల్లో వ్యక్తం చేయలేక, ఆప్యాయంగా అతని భుజం తట్టాడు. చచ్చిపోయిన గూఢచారుల జేబులు సోదాచేశారు. కానీ కాగితాలేమీ దొరకలేదు. వారి దగ్గరఉన్న తుపాకులను భద్రం చేశారు. తప్పించుకు పోయినవాడి కోసం నిఘా వెయ్యడానికి నలుగురు సైనికులను అడవిలోకి పంపించారు.

27

తప్పించుకుపోయిన గూఢచారి ఎవరికంటా బడకుండా ఎలాగో గూడానికి చేరాడు. ఒక చేతికి బలంగా గాయం తగిలింది. బాగా రక్తం కారుతోంది. దుస్తులు రక్తంతో తడిసి ఉన్నాయి. తూలుతూ తూలుతూ రాజీ గుడిసెలోకి ప్రవేశించి, లోపల గడియ పెట్టేసి క్రింద పడిపోయాడు. అతన్నిచూసి రాజీ అదిరిపడింది. అతనెవరో వెంటనే పోల్చుకుంది. ఎందుకు వచ్చాడో కూడా అర్థమయింది. భయంతో గజగజ వణికిపోయింది. ఈ మూడు రోజులనుంచీ తను కాస్త ప్రశాంతంగా ఉంటోంది. ఇప్పుడు మళ్ళీ తనను లొంగదీసుకుని, తన చేత ద్రోహకార్యం చేయించడానికి వచ్చాడు. ఇలా వస్తాడని తను ఊహించలేదు. ఇంతమంది శత్రువులు ఉన్న చోటికి ఇంత సాహసంగా రాగలడని అనుకోలేదు. భారతసైనికుల ఆశ్రయంలో తానుసురక్షితంగా ఉండవచ్చుననుకొన్నది.

అతను రాజీని సూటిగా, కర్కశంగా చూస్తున్నాడు. ఆ చూపులు సూదుల్లా గుచ్చుతున్నాయి ఆమెను. ఏం చేయడానికి తోచలేదు.



ఎలా తప్పించుకోవాలో తెలియలేదు. గట్టిగా కేకపెడదామనుకుంది. కాని భయంతో నోరు పెగల్లేదు. ఒకవేళ కేకపెట్టినా పలికేందుకు గూడెంలో ఎవరూలేరు. తనను రక్షించేవారెవరూలేరు. తను నిస్సహాయురాలైపోయింది. పులినిచూచిన లేడిలా వణుకుతూ వెనక్కి వెనక్కి వెళ్ళి గుడిసెలో మూలకు నక్కుతూ ఏమీ చేయలేక మోకాళ్ళ మీద వాలిపోయి, దీనంగా చేతులెత్తి దణ్ణంపెట్టింది. "నన్ను వదిలిపెట్టెయ్యి నీకు పుణ్యం వుంటుంది. నన్నునమ్మిన వాళ్ళకిద్రోహంచెయ్యలేను." అంటూ ఏడిచింది. కానీ అతను చలించలేదు. ఆమె శోకం అతన్ని ఏమీ చేయలేకపోయింది. చేతినించి రక్తం కారుతున్నా లెక్క చెయ్యకుండా నిశ్చయంతో మాట్లాడుతున్నాడు.

"నువ్వు ఈ మూడురోజులూ రానందువల్ల మనకు ఎంతనష్టం జరిగిందో నీకేమైనా తెలుసా? మన పథకాలన్నీ నాశనమయ్యాయి. కొన్ని వేలమంది సోదరులు మరణించారు. అంతమంది నిండుప్రాణాలు పోవడానికి బాధ్యతనీది. వారందరినీ ఈ గుడిసెలో కూర్చుని హత్యచేశావు ఈ మూడు రోజుల్లో. అవును— ప్రాణం పోవటం అంటే ఏమిటోనీకు ఏమితెలుసు? యుద్ధరంగంలోకి వచ్చి

చూస్తే తెలుస్తుంది. నా చేతికి తగిలిన ఈ గాయం చూడు. దెబ్బతిన్నవాణ్ణి నాకు తెలుస్తుంది. ఈ బాధ నీకేం తెలుస్తుంది? నువ్వు ఇంత మాతృద్రోహం చేస్తావని కలలోకూడా అనుకోలేదు. నీమీది విశ్వాసంతో రోజూ కొన్నివేలమంది సోదరులు యుద్ధరంగంలోకి వెళ్తున్నారు, కానీ నువ్వే హత్యచేస్తావని పాపం వాళ్ళకి తెలీదు. నువ్వు నీ సోదరుల ప్రాణాలను తీయటమే కాకుండా, శత్రుసైనికులకు ప్రాణాలు పోస్తున్నావు. అంతకంటే ద్రోహం ఇంకోటి ఉండదు."

అతను కాస్తఆగి ఆమె ముఖంలోని భావాలను గమనించటం మొదలుపెట్టాడు. ఆమెలోని బలహీనత అతనికి బాగా తెలుసు. ఆ బలహీనతను ఎలాఉపయోగించుకోవాలో తెలుసు.రాజీ తెలివిలేనిది కాదు.మంచీ చెడూవిచక్షణ తెలియనిదికాదు. కానీ ఆమెది మరీ జాలిగుండె. పాపభీతి ఎక్కువ. మాటలు నేర్చిన వారెవరైనా ఆమెను చాలా తేలికగా మోసం చేయగలరు. తర్వాత తానే గ్రహిస్తుంది మోసపోయానని.

తన ఉపన్యాసం బాగానే పని చేస్తోందని గ్రహించి అతను మళ్ళీ ప్రారంభించాడు. "నువ్వు ఇక్కడి భారతసైనికుల దీనస్థితి చూసి జాలి పడుతున్నావేమో. అదే నిజమైతే నువ్వు చాలా పొరబడుతున్నావు. వాళ్ళు జాలిపడవలసిన స్థితిలోలేరు. వాళ్ళవల్ల మనకు ఎంత జననష్టం జరుగుతోందో నువ్వు తెలుసుకోవటంలేదు. నువ్వు జాలిపడి ఎవరికైతే సేవచేస్తున్నావో వాళ్ళుఒక్కొక్కరూ నీ సోదరులను పదేసిమందిని చంపుతారు కోలుకున్న తర్వాత. నీసేవకు వాళ్ళు ఇచ్చే ప్రతిఫలం అదే. ఈ మూడురోజులలో చచ్చిన భారతీయుల సంఖ్య ఐదువందలకు మించదు. మనవారు ఐదువేలమంది మరణించారు. అసలు నీది జాలిగుండె కావటమే అన్ని అనర్థాలకూ కారణం. రాక్షసుడైనాసరే గాయపడితే నువ్వు చూడలేవు. నీబలహీనతను వాళ్ళు బాగా ఉపయోగించుకుంటున్నారు. ఆర్తులపట్ల కరుణ చూపించటం మంచిదే. కానీ అంతకంటే కర్తవ్యం ముఖ్యం. వారిమీద జాలితో నువ్వు ఐదువేలమంది సోదరులను చంపుకున్నావు. ఇవాళ వాళ్ళు మరీ భయంకరంగా దాడి చేయబోతున్నారు. ఈరోజుకూడా నువ్వుమాకు సాయం చేయకపోతే నీ ఉసురు కొట్టుకుని కనీసం పదివేలమంది చైనా సైనికులు మరణిస్తారు. ఇక్కడ కాకపోయినా మరో లోకంలోనైనా నువ్వు దేవుని ఎదుట ఈ హత్యాకాండకు సంజాయిషి చెప్పుకోవలసి ఉంటుంది. దేశద్రోహానికి మించిన మహాపాపం లేదు. నువ్వు చేస్తున్నది తప్పు అని హెచ్చరించ

డానికే వచ్చాను. బాగా ఆలోచించుకో."

తన ఉపన్యాసం పూర్తిగా పని చేసినట్లు ఆమె మొహంలో దాఖలా కనిపించగానే ఆపుచేశాడు. మళ్ళీ కాస్తాగి "జరిగిందేదో జరిగిపోయింది. ఇక విచారించి లాభం లేదు. ఇప్పటికైనా నీ కర్తవ్యాన్ని నువ్వు గుర్తించగలిగావు. చాలా సంతోషంగావుంది. నీ మీద నాకు మొదటినుంచీ విశ్వాసం ఉంది. నువ్వు నా చెల్లెలివి. భారతీయులు నా చెల్లెలిని మోసం చేస్తుంటే నేను సహించలేను" అన్నాడు. రాజీ మాట్లాడలేదు.

"ఇంక ఆలస్యంచేస్తే లాభంలేదు చెల్లీ. నువ్వు వెంటనే భారత స్థావరానికి వెళ్ళి రహస్యాలు తెలుసుకోవాలి. లేచిబయలుదేరు. నేనూఇక్కడ ఎక్కువసేపు ఉండటం మంచిదికాదు. బహుశ ఇక్కడి సైనికులు నాకోసం అడివిలో పొంచి ఉంటారేమో కూడా. మేము ముగ్గురం కలిసి వస్తూంటే ఇద్దరిని వాళ్ళు కాల్చేశారు. నేను ఎలాగో తప్పించుకు వచ్చాను. ఇక్కడికి వచ్చినట్లు వాళ్ళకి తెలిసిందంటే నీ సంగతి కూడా బైట పడిపోతుంది. ఇవాళ మధ్యాహ్నం ఒంటిగంటకి మామూలు ప్రదేశానికి మన కుక్క వస్తుంది. సమాచారం అందించు. లెఫ్టినెంట్‌ను వలలో వేసుకున్నావుకదా? ఎన్ని రహస్యాలయినా తెలుస్తాయి. మా ప్రాణాలన్నీ నీ చేతులోపెట్టి వెళ్తున్నాను. తప్పక సాయం చేస్తావుకదూ. నా చేతిలో చెయ్యివేసిచెప్పు" అంటూ చెయ్యి జాచాడు. కానీ రాజీచెయ్యి ముందుకు సాగలేదు. "మేము ఇంతమంది ఉండగా నీకు భయందేనికి చెల్లీ" అంటూ తనే ఆమె చేతిని తన చేతిలో వేసుకుని, "ఒట్టు తప్పకూడదుసుమా" అని హెచ్చరించి బయటకు వెళ్ళిపోయాడు.

రాజీ ఇంతసేపు నిర్జీవ ప్రతిమలాగా కూర్చుండిపోయింది. అతని మాటలు మాత్రం వినిపించాయి. అవన్నీ నిజమని నమ్మనూలేదు. అతను చెప్పినట్లు చేస్తానని మాట ఇవ్వనూ లేదు. అటువంటి మాటలూ అంతకంటే ఆడంబరమైన ప్రబోధాలూ చైనా సోదరులనుంచి ఇదివరకు చాలా విన్నది. కానీ అప్పటిలాగా మోసపోయేంత అమాయకురాలు కాదు. అప్పుడు అతనుమాత్రం ఈమె తనుచెప్పినట్లు చేస్తుందనీ, చెయ్యకపోతే మానసికంగా చిత్రహింస అనుభవిస్తుందనీ అనుకున్నాడు. తగు వశీకరణ మంత్రంవేసి ఆమెచేత అలా చాలా పనులు చేయించుకున్నాడు ఇదివరకు. చైనా సోదరుల మాటలు విని, నిజమనినమ్మి, ఏదో దుర్ముహూర్తంలో వారికి మాటఇచ్చింది రాజీ. ఆమాటకోసం, అంతకుమించి మాతృదేశం మీద మమకారం కొద్దీ వారు చెప్పినట్లు ప్రవర్తించింది. తను

చేసినపని ఎంత అనుచితమో ఇప్పుడు పూర్తిగా గ్రహించగలిగింది.

అతను వెళ్ళిపోయిన కాసేపటికి ఆమె తేరుకుంది. స్థిమితంగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చి స్థావరానికి బయలుదేరింది.

28

స్థావరంలో కల్నల్ మహేశ్, లెఫ్టినెంట్—కల్నల్ సుబీర్‌సేన్, మేజర్ రాయ్. కెప్టెన్ ప్రసాద్, లెఫ్టినెంట్ శివరామ్ సమావేశమై సమాలో[illegible] ప్రారంభించారు. కల్నల్ టేబ[illegible] చుట్టూ మిగిలినవారంతా కుర్చీ[illegible] కూర్చున్నారు. నాయక్ ఒక [illegible] చేతులు కట్టుకుని నుంచున[illegible] రాత్రి అంత తీవ్రమైన యుద్[illegible] గటం, చాలమంది మరణి[illegible] పొద్దునే ఈ గూఢచారులు రావటం[illegible] ఇవన్నీ కల్నల్‌ను కలతపరిచాయి. ఎవరి ముఖాలలోనూ కళాకాంతీ లేవు. అందరూ ఆందోళనగానే ఉన్నారు. లెఫ్టినెంట్ శివరామ్ మరీ బేలగా, తల్లికోసం బెంగపడిన పసివాడిలా ఉన్నాడు. రాజీ స్థావరానికి రాకపోవటం, తను మాటిమాటికీ గూడానికి వెళ్ళే అవకాశం లేకపోవటం అతనికి బాధగా వుంది. ఒక్కసారి ఆమెను చూస్తే చాలునని తహతహలాడి పోతున్నాడు. కానీ ఇక్కడి యుద్ధ వాతావరణం క్షణ క్షణానికి తీవ్రరూపం దాలుస్తున్నది. ప్రేమ వ్యవహారాలను గురించి తలుచుకోవటానికి కూడా ఇప్పుడు వీలులేదు. కెప్టెన్ కూడా ప్రియురాలి కోసం అలాగే బాధపడుతున్నాడు. కానీ అతను గంభీరుడు. బాధకు లొంగిపోయేవాడు కాదు. కల్నల్ కనుసైగచేస్తే కదనరంగంలోకి ఉరకడానికి సిద్ధంగా ఉన్నాడు.

కల్నల్ గది బయట [illegible] ఒక [illegible] [illegible] [illegible] [illegible] [illegible] పొర్లకమవుతుందో, నిర[illegible] మవుతుందో. మన చావు బతుకులు, దేశం భవిష్యత్తు ఈరోజుతో నిర్ణయమై పోతాయి. ఇది అత్యంత కీలకమైన స్థానం. ఇదికనుక శత్రువులకు వశమైపోతే వాళ్ళు మన వ్యాన్లలోనే, మన తుపాకులే పుచ్చుకుని దండయాత్ర సాగిస్తూపోతారు. ఈ రహదారి వెంట మైళ్ళ తరబడి చొచ్చుకుపోతారు. అందుకని ఈ స్థావరాన్ని నిలబెట్టడానికి మనలోని ప్రతిరక్తపు బొట్టునుఓడ్చాలి. ఇంతవరకూ మనం ఒక స్థావరాన్ని నిలపలేకపోతే వెనక సావరానికి జరుగుతూ వచ్చాము.

ఇప్పుడిక అలాకాదు. దీన్ని నిలపలేకపోతే మనం అంతా ఇక్కడే హతమైపోతాం. విజయులమైతేనే మళ్ళీ మన ఊరినీ, మనవారినీ చూడగలుగుతాము. రేపు ఈపాటికి ఆవిషయం తేలిపోతుంది. బహుశా రేపు ఇక్కడ ఉన్నవాళ్ళం అందరం—సమావేశం కాకపోవచ్చు. అందుకు అందరం సిద్ధంగా ఉండాం.

"ఈరోజు మన జయాపజయాలు కేవలం మన ప్రయత్నం మీద నే ఆధారపడి ఉండవు. మన బలానికి తోడు, దైవబలంకూడా తోడు కావలసిఉంది. నేను పంపిన వర్తమానం ప్రకారం అయితే కేంద్ర కార్యాలయంనుంచి కొత్త సైనిక దళాలు మందు గుండు, ఆయుధాలు ఈ పాటికి ఇక్కడికి చేరవలసింది. కానీ ఇంతవరకు చేరలేదు. దారిలో ఏ ఆటంకాలు వచ్చాయో తెలియదు. దైవానుగ్రహం వల్ల మధ్యాహ్నంలోగా సైన్యం ఇక్కడకు చేరితే ఈ స్థావరం నిలిచే అవకాశం ఉంటుంది. లేకుంటే స్థావరం శత్రువులకు చిక్కినట్లే భావించాలి. కీడెంచి మేలెంచటం మంచిది. ఈరోజు కొత్తదళాలు చేరవనే అనుకుని, అందుకు సిద్ధపడి మనం సన్నాహాలు చేసుకుందాం. కొత్తదళాలు వచ్చేవరకు శత్రువులను నిరోధించటం మన ప్రస్తుత లక్ష్యం. మనకున్న కొద్దిపాటి సైన్యంలో శత్రువులను తరిమి కొట్టగలమనుకోవటం భ్రమే. కానీ మనఓటమి మన ప్రయత్నలోపంవల్ల మాత్రం కాకూడదు.

గడచినమూడు రోజులయుద్ధంలో ఒక రోజుకంటే ఇంకొకరోజు ఎక్కువగా వేల సంఖ్యలో వచ్చిపడుతున్నారు చైనావారు. వాళ్ళు మనిషి ప్రాణానికి విలువ ఇవ్వరు. ఎన్నివేలమంది మరణించినా వారికి లెక్కకాదు. వాళ్ళకి కావలసింది సాధ్యమైనంత త్వరగా స్థావరాన్ని చేజిక్కించుకోవటం. అక్కడ తమ జెండాని పాతటం. మరణాలు ఎక్కువవుతున్నకొద్దీ ఇంకా ఎక్కువగా వచ్చిపడుతున్నారు. క్రిందటి మూడు రోజుల్లో వారు ఒక క్రమం, పద్ధతి లేకుండా మందలుగా వచ్చిపడ్డారు. ఈ రోజూ అలాగే ఇంకా భారీ ఎత్తున యుద్ధం జరుగుతుంది. మనం అంతమందిని బలిపెట్టలేము. మరీ సైన్యం చాలా కొద్ది. పెద్దసైన్యం ఉన్నాగానీ ప్రాణాలను పొదుపుగా ఖర్చుపెట్టటం మన పద్ధతి. అందుకే మనం ఒకవ్యూహం ప్రకారం యుద్ధం చేస్తున్నాము. ఫలితం ఎలాఉన్నా సరే. ప్రస్తుతం ఇక్కడ మనబలం నాలుగువందలు. గాయపడి చికిత్స పొందుతున్న వారిలో ఒకయాభై మంది కొంచెం కోలుకున్నారు. వీళ్ళంతా యుద్ధంచేయడానికి ఉత్సాహపడుతున్నారు. వారితో కలిపి 450 మంది అవుతాము. మన సైనిక శక్తిని ఈరోజు మరింత పొదుపుగా వాడుకోవాలి. ఈ రోజు మరింత జాగ్రత్తగా వ్యూహాన్ని తయారు చేసుకోవాలి. దాన్ని గురించి రాత్రే కొంచెం ఆలోచించి ఉంచాను.

"ఈలోగా ఒక్క విషయం మీతో చెప్పాలనుకుంటున్నాను. కల్నల్ హోదాలో కాక, ఒక వ్యక్తిగా, మీ మిత్రుణ్ణిగా చెబుతున్నాను" కల్నల్ గొంతు మారిపోయింది. ప్రతి మాట గొప్ప విశ్వాసంతో, నిశ్చయంతో పలుకుతున్నాడు. ఆయన గొంతులో ఎన్నడూ ధ్వనించని ఆవేశం వ్యక్తమవుతోంది. "ఫ్రెండ్స్! మనకు ఉన్నబలం ఈ ఆయుధాలూ, మన శారీరక శక్తి మాత్రమే కాదు. అంతకంటే గొప్పది, అనశ్వరమైనది ధర్మబలం. ఈనాడు మనం పరాజితులం కావచ్చు. కాని అంతిమ విజయం మనకు తథ్యం. విజయం మన ధర్మం వల్లనే సిద్ధిస్తుంది. సైనికబలం వల్లకాదు. చైనావారు ధర్మాన్ని ఢీకొంటున్నారు. వారికి శృంగభంగం తప్పదు. నాకు మొదటినుంచి ఆ విశ్వాసం ఉంది, మనదేశం వంటిదేశం ప్రపంచంలో మరేదీలేదు. మాతృదేశంమీది మమకారంతో ఈమాట చెప్పటంలేదు. నిజంగా మనదేశం ధర్మక్షేత్రం. సహనం మన సంస్కృతి. గత శతాబ్దాల భారత చరిత్రను తిరగవేసి చూడండి. భారతదేశంపై ఎన్నో జాతులు దాడిచేశాయి. కాని భారతదేశం ఎవరి జోలికీపోలేదు. ఎన్నో మతాలవారు, దేశ దేశాలవారు, జాతులవారు మనదేశంపై దాడిచేశారు. దేశంలో తిష్టవేశారు. వారిని భారతమాత ద్వేషించలేదు. వారికి తన బిడ్డలతోపాటు ప్రేమానురాగాలుపంచి ఇచ్చింది. వారికీ తనలో చోటు ఇచ్చింది. శత్రువులుగా వచ్చిన వారందరూ మన కుటుంబంలో చేరిపోయారు. వారికీ ఈదేశం మాతృదేశం అయింది. ఇంత సహనంగల దేశం ప్రపంచంలో మరేదైనా ఉందా? ఇతర దేశాల నుంచి వచ్చిన ఎన్నో మతాలను, ఆచార వ్యవహారాలను, కళలను, సాహిత్యాన్ని తనలో ఇముడ్చుకున్నది భారత సంస్కృతి. అందుకే ఇంత విస్తృతమైన, వైవిధ్య పూర్ణమైన సంస్కృతి ప్రపంచంలో మరేదీ లేదు. ఈ సంస్కృతిని ధ్వంసం చేయాలని చైనా వృథా ప్రయత్నం చేస్తోంది. ఇంత గొప్ప ధర్మాన్ని నిర్జించాలని చూస్తోంది. సృష్ట్యాది నుంచి ఇంతవరకు ధర్మం ఎన్నడూ ఓటమి ఎరుగదని వారికి తెలియదు.

"దేశరక్షణకోసం ఇక్కడ మనం యుద్ధం చేస్తున్నామంటే ధర్మరక్షణ కోసం చేస్తున్నట్లే అవుతుంది. కేవలం స్వదేశంమీది ప్రేమతోనే చేస్తున్నట్టయితే, చైనావారికీ మనకూ తేడాలేదు. వాళ్ళూ వాళ్ళదేశ సౌభాగ్యం కోసమే పోరాడుతున్నారు. దేశంమీది భక్తికంటే ధర్మంమీది భక్తి గొప్పది. దేశంమీది ప్రేమ గొప్పవిషయం కాదు. అది సహజమైనది. తల్లిని ప్రేమించటం ఎంత సామాన్యమో ఇదీ అంతే. దేశభక్తికి అతీతంగా మన వ్యక్తిత్వం పెరగాలి. ధర్మసంస్థాపనం మన లక్ష్యం కావాలి. లక్ష్యశుద్ధినిబట్టే లక్ష్య సిద్ధి కలుగుతుంది."

(సశేషం)

□□□

చిత్రరధుని

చైత్రయాత్ర

కొత్తపోకడలలో ప్రపంచ చిత్రాలు

మూడవ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జనవరి-ఫిబ్రవరి మాసాలలో ఢిల్లీ, కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాలలో జరిగింది.

మొదటి ఉత్సవం 1951-52 లో జరిగింది. "యూకివారీసూ" "బైసికిల్ తీఫ్" "రషోమాన్" వంటి చిత్రాలు అలనాడువచ్చినవి. "యూకివారీసూ" (జపాన్) ధర్మమా అని బాలలకు కథలో అధిక ప్రాధాన్యంకల హిందీ, తెలుగు చిత్రాలు అనేకం తదనంతరం వచ్చినవి. "బైసికిల్ తీఫ్" "మిరకిల్ ఇన్ మిలాన్" వంటి ఇటాలియన్ చిత్రాల పుణ్యమా అని "దోబిఘాజమీన్" "నిరుపేదలు" వంటి వాస్తవిక చిత్రాలు వచ్చినవి.

1962 లో రెండవ ఉత్సవం జరిగింది. అందులో మెక్సికో వేదాంత చిత్రం, ఈజిప్టు సంసార చిత్రం, యుద్ధం చూపకుండా యుద్ధంపై ఫ్రెంచి చిత్రాలు వచ్చి మన సినిమాల కథనంలో కొత్త పోకడలకు ఊహాలు ఊతలు, ఊడలు యిచ్చినవి. ఆ వుత్సవం వల్ల, దరిమిలా జరిగిన పశ్చిమ జర్మన్, రష్యన్ మొదలైన చిత్రోత్సవాలవల్ల మన ఫిలిం టెక్నిక్‌లో కొత్త పోకడలకు అవకాశం కలిగిందికూడా.

మొన్న జరిగిన ఫిలిం ఉత్సవంలో పోటీ పద్ధతి తొలిసారిగా ప్రవేశ పెట్టారు. ఉత్తమ చిత్రానికి "స్వర్ణ మయూర ప్రతిమ బహుమతికూడా ఏర్పాటుచేశారు.

18 దేశాలకుచెందిన 19 చిత్రాలు ఈ పోటీకి నిలచినవి. భారతదేశం నుంచి "హకీకత్" (హిందీ), నిర్జన్ సైకతే (బెంగాలి) అనే చిత్రాలు పోటీకి నిలబడినవి; ఐదు ఖండాల దేశాలు పోటీచేశాయి. 70-80 సంవత్సరాలనుంచి చలన చిత్రరంగంలో కృషిచేస్తున్న వృద్ధరాజ్యాల నుంచి పది పదిహేనేళ్ళనుండి అట్టి కృషి సాగిస్తున్న బాలరాజ్యాల వరకు అనేక దశల దేశాలు స్వర్ణమయూరంకోసం పోటు పడ్డాయి!

ఏమైనా యివి యువకుల, బాలల

రోజులు. వయసు మహా చెడ్డదేమో వృద్ధులపై బాలలు, యువకులు గెలుస్తుంటూరు. ఈ ఫిలిం పండెంలో కూడా సరిగా ఇదే జరిగింది. సింహళీయ చిత్రం "గామ్‌పెరాలియా" (గ్రామ ప్రళయము)కు మయూర వాహనయోగం లభించింది.

షరతులు, పరిమితులు పెడితే ఫిలిం టెక్నిక్‌లో విప్లవాత్మకమైన మార్పులు సాధించిన చిత్రాలు వచ్చే అవకాశం, భారతీయులు చూచే భాగ్యం లేకపోవచ్చుననే ఉద్దేశంతో పోటీకి కాకుండా ఏ దేశమైనా ఏ నాటి చిత్రమైనా పంపేందుకు వీలుకలుగజేశారు. ఇవి "నాన్ కాంపిటీటివ్ తరగతి అన్నమాట ఇందులో 28 చిత్రాలు ప్రదర్శింపబడినవి. ఈ రెండవ తరగతికి 'వైడ్ స్కోప్' వున్నందువల్ల మంచి చిత్రాలు ఇందులోనే వచ్చాయి. ఏడెనిమిదేళ్ళ క్రితం తీసిన "రిక్షామాన్" వంటి అద్భుత జపనీస్ చిత్రాన్ని ఈపరంగా చూడ గలిగాము.

నిజానికిది "న్యూవేవ్" యుగం. కథకంటే కథనానికి ప్రాధాన్యం ఎక్కువ. కంటికంటే మనో నేత్రానికి పని ఎక్కువ కల్పించాలి ఈ తరహావి. ఫ్రాన్సు, స్వీడన్, ఇటలీ, పోలెండులు ఈ రంగంలో చాలా ముందుకు పోతున్నవి. అయితే దురదృష్టవశాత్తూ ఈ ఉత్సవానికి ఈ కోవకు చెందిన "ది సైలెన్స్", "యైక్ అండ్ హాఫ్" వంటి చిత్రాలు రానేలేదు.

మొన్నటి అంతర్జాతీయ ఉత్సవంలో చూసిన కొన్ని విశిష్ట చిత్రాల గురించి, ఒక విశేష చిత్రం గురించి టూకీగా యిక్కడ టాకీ పాఠకులకు పరిచయం చేస్తాను.

"గాంపెరాలియా"

(సింహళం)

స్వర్ణ మయూర బహుమతి పొందిన "గ్రామ ప్రళయం" సింహళీయ చిత్రం. కథ: ఒక గ్రామంలో ఫ్యూడల్ వ్యవస్థ మారి అధునిక సమాజం ఏర్పడబోతున్నప్పటి కాలానికి సంబంధించినది. ఒక సింహళీయ నవల ఆధారం చేసుకొని తీసినట్టి చిత్రం. పైకి మామూలు కథలా వుంటుంది. అనగా అనగా ... అని చెప్పుకుపోతే కథలో రంజులేదు. చివరి 70 మీటర్ల నిడివిలోనే కథ పట్టు, రస పట్టు, గట్టిపట్టు వున్నవి.

"నందా", "పియాల్"ను ప్రేమించి పరిస్థితుల ప్రాబల్యంవల్ల "జినదాసా"ను వివాహమాడుతుంది. అయినా భార్య ధర్మాలను సంపూర్ణంగా పాటిస్తుంది. "జినదాసా" మరణించగా వితంతువైన "నందా" "పియాల్"ను పరిణయమాడుతుంది.

ఒకరోజున పియాల్ నందాపై ఆగ్రహించి ప్రమాదధోరణిలో ఒక్కడూ కారులో వెళ్ళాడు. మరి



చందమామవారి "దొరికితే దొంగలు"లో
గుమ్మడి, ఎన్. టి. రామారావు,

కొంతసేపటికి నందాకు టెలిగ్రామ్ చేరింది. భర్త మరణించాడని. నందా ఆత్రంగా ఆస్పత్రికి వెళ్ళింది. శవం చూచింది. అది పియాల్ శవంకాదు. అప్పుడే మరణించిన జినదాసా (ప్రథమభర్త) భౌతికకాయం. జినదాసా బ్రతికివుండగానే పియాల్‌ను వివాహమాడిందన్నమాట. నందా తెలియక చేసినపాపం అది. పియాల్‌కు జినదాసా బ్రతికివున్నట్లు తెలిసి ఆ విషయాన్ని భార్య నందా నుంచి మభ్యపెట్టాడు. పియాల్ తెలిసి చేసిన పాపం అది. కాని లోలోన కుములుతున్నాడు. ఆ చిరాకులోనే నందాపై ఆగ్రహించి ఒక్కడూ కారులో వెళ్ళిపోయాడు.

ఈ పాపాలకు ప్రాయశ్చిత్తం ఏమిటి? పునర్వివాహం నిజంగా పాపమా? ఈ ప్రశ్నలకు ముగింపులో ముచ్చటైన సమాధానం కన్పిస్తుంది.

కవితా ధోరణిలో కథను చిత్రించినందుకు, మానవుల మధ్య సంబంధాల పవిత్రతను కాపాడుతూ కర్తవ్య బోధ చేసినందుకు మెచ్చి ఈ చిత్రానికి రాయ్ కమిటీవారు ప్రథమ బహుమతి యిచ్చారు.

సత్యజిత్ రాయ్ తీసే చిత్రాలవలె మేకప్ (వీలైనంతవరకు) లేకుండా, సెట్‌లు (వీలైనంత వరకు) లేకుండా ఎక్కువగా ప్రకృతి ఒడిలోనే చిత్రం తీసి బహుమతికి అర్హులౌరాలని సింహళం నిరూపించుకొన్నది.

చిత్రంలోని కొన్ని విశిష్టాంశాలివి :

నందా తండ్రి మరణించాడు. తండ్రి అంత్యదశ చిత్రీకరించారు. కట్ చేసి ఆరబెట్టిన శ్వేత వస్త్రాలు చూపారు. నందా తల్లి వితంతువైన దన్నమాట.

నందా పియాల్‌ను ఎంతగానో ప్రేమించినా అదివలదన్న తల్లిమాటను శిరసావహించింది, ఎలా? పియాల్ వ్రాసిన ప్రేమలేఖలను స్వహస్తాలతో తల్లి ముందే నిప్పు వెలిగించి కాల్చి వేసింది.

నందా పియాల్‌ను ఎంతగానో ప్రేమించి తుదకు జినదాసాను వివాహమాడాక పతివ్రతగానే సంచరించింది. భర్తను ఎంతగానో ప్రేమించింది. ఎలా ? ఉద్యోగార్థం భర్త ఎచ్చటికో వెళ్ళిపోతానని చెప్పాడు. ఆ రాత్రి భర్తకు నిద్రపట్టింది. కాని భార్యకో ... జాగరణ. మర్నాడు భర్త వెడుతుంటే భార్య సాష్టాంగ నమస్కారం చేసింది. జాడ తెలియక పోతే పూజలు చేసింది. ఆమె ఖర్మకాలి, అంతగా పూజించిన భర్త బ్రతికి వుండగానే, ఆ విషయం తెలియక పునర్వివాహం చేసుకోవలసి వచ్చింది. విధి బలీయం.

ప్రేమ విపరిణామాలను ఈ చిత్రంలోగమ్మత్తుగాచూపారు. ప్రేమ ఒక సమస్య అయినప్పుడల్లా నాయికకు జ్వరం వస్తుంది. జ్వరం వచ్చిందీ అంటే ప్రేమ సమస్య ఏర్పడిం దన్నమాట.

పియాల్ పేదవాడు, ప్రయివేటు మాష్టారు. నందా గొప్పింటి బిడ్డ, విద్యార్థినీ. వాళ్ళిద్దరిమధ్య టేబిల్ ఉంది. టేబిల్‌పై శంఖంఉంది. పేదవాడు రాకుమారికథ పాఠం చెబుతున్నాడు. పేదవాడు రాకుమారిని వివాహం చేసుకోగలుగుతాడా ? అని నందా అడిగింది. శంఖంపై చెయ్యివేసి ఎందుకు చేసుకోకూడదు ? అని పియాల్ జవాబిచ్చాడు.

కాని నిజ జీవితంలో పియాల్ నందాను వివాహం చేసుకోలేకపోయాడు; నందా జినదాసాను వివాహమాడింది. అక్కడ పచ్చటి పెళ్ళి. ఇచ్చట పియాల్ ఎండు ఇసుకపై నడుస్తున్నాడు. సముద్రపు అల దూరంనుంచి వచ్చి శంఖమునొక దానిని త్రోసింది. చేతితో తీసుకొని చెవులోపెట్టుకున్నాడు; పేదవాడు రాకుమారిని ఎందుకు వివాహం చేసుకోలేడు ? అని తానా రోజున నందాకు చెప్పిన పాఠం



విజయలక్ష్మి పిక్చర్స్‌వారి "విజయసింహ"లో ఎల్. విజయలక్ష్మి.

జ్ఞప్తికివచ్చింది. అదృష్టాన్ని వెతుకుతూ పట్నం వెళ్ళాడు. పేదవాడు రాకుమారు డయ్యాడు. నందా రాకుమారి పేదరాలయింది, వితంతువైంది. పేదవాడు రాకుమారిని వివాహమాడాడు. విధి చిత్రమైనది.

హామ్లెట్

(రష్యా)

సబ్ టైటిల్స్ వున్న విదేశచిత్రాలు ఎన్నో చూస్తాము, రష్యను భాషలో తీసిన "హామ్లెట్" సబ్ టైటిల్స్ చూశాము. రెండవ దానిలో ఒక ప్రత్యేకత వుంది. షేక్స్‌పియర్ ఆంగ్ల నాటకాన్ని (హామ్లెట్) రష్యనుభాషలోకి మార్చి తీశారు. ఇంగ్లీషులో సబ్ టైటిల్స్ వేసినప్పుడు షేక్స్‌పియర్ నాటకభాషనే యధాతథంగా వాడారు. నాటక భాషకు తగినట్లు షాట్‌లను తిరిగి పొందుపరచు కొనడంలోనే వుంది ఘనత. చిత్రంచూస్తూ సబ్ టైటిల్స్ చదువుకొంటూ పోతూవుంటే సినిమాతోపాటు షేక్స్‌పియర్ నాటకం చదివేసినట్లుంటుంది.

ఎన్నో చిత్రాలలో టైటిల్స్ చూస్తాం. కాని "హామ్లెట్" టైటిల్ వేరు. ఆ కోటలో రాతిగోడకు వున్న కాగడా మంటలు కక్కుతూ వెలుగుతున్నది. కాగడా ప్రక్కనే కన్పిస్తుంది "హామ్లెట్" టైటిల్ కార్డ్. హామ్లెట్ రాకుమారుని హృదయంలోని మంటలకు ప్రతిరూపమే ఆరాతిగోడ కాగడా మంటలన్నమాట.

ఈ హామ్లెట్‌లో సెట్‌లు ఎంత పెద్దవో, ఎన్ని సెట్లు వున్నవో, వాటినెలా 'ఎక్స్‌ప్లాయిట్' చేసుకొన్నారో, కెమెరా యాంగిల్స్‌ను అంత కళాత్మకంగా ఎలా నిర్ణయించు కొన్నారో, ఎలక్ట్రానిక్ లైట్‌లు ఎలా వినియోగించారో తలచుకొంటే అంతా ఇంద్రజాలంగా వుంటుంది. ఈ కాలపు దేశ విదేశ చిత్రాలు చూచిన కళ్ళతో "హామ్లెట్" చూసేసరికి సినిమా కళ అమాంతం 20 ఏళ్ళ ముందుకు దుమికిందనిపించింది. చలన చిత్ర కళ అద్భుత విజయానికి ప్రత్యక్ష నిదర్శనం హామ్లెట్.

హామ్లెట్ పాత్రధారి ఇన్నొకెంటీ. మొదట చూస్తూంటే ఆ కాలంలో లారెన్స్ ఒలీవియరే బాగా నటించారేమో అనిపించింది. కానిచూడగా చూడగా ఆ భావం తల్లక్రిందులైంది. దర్శకుడు గ్రిగొరి కోజిన్‌త్సెవ్. హామ్లెట్ రాకుమారునితండ్రి భూతందర్శనం చిత్రీకరణ అనుపమం. ఫిలిం ఉత్సవం సందర్భంగా ప్రదర్శితమైన 20 దేశాల 47 చిత్రాలలోకెల్ల హామ్లెట్ తలమానికం వంటిది.

'ఏడవకు పీటర్ పాపా!'

(యుగోస్లావియా)

పిల్లలంటే ఇష్టంలేక, పెళ్ళిచేసుకొంటే పిల్లలు పుడతారనే ఉద్దేశంతో పెళ్ళే చేసుకోని మీసాల సైనికుడు ఒకడు.

పిల్లలతో అనుభవంలేని, పెళ్ళి తలపేలేని యువసైనికుడు ఒకడు.

వీళ్ళిద్దరికీ ఆ యుద్ధకాలంలో అప్పగించిన పని—పీటర్ అనే అల్లరి చిల్లరి ఈలపాటల నాలుగేళ్ళ పాపాయిని, అతడి చిన్న అక్కను, చిన్న అన్నను జర్మనుల ఆక్రమణలో వున్న మందు గనులు గల ప్రాంతం దాటించి సురక్షిత ప్రాంతం చేర్చడం.

ఈ ఆరేడు మైళ్ళ నడకలో అల్లరి పీటర్ వీళ్ళపని పడతాడు. పిల్లలంటే పడని మీసాల సైనికుడు ఇతని మోసుకొని నడవవలసి వస్తుంది. ఆ మీసాలు వింతగా ఉండేసరికి పీటర్ తెగపీకుతూ వుంటాడు! పీటర్ ఈలలకు జర్మనులు అల్లంత దూరంలోకి వస్తారు. పీటర్ జారిపడిన చోటు గుహ. ప్రేలుడు పదార్థాలు భద్రపరచబడ్డాయి. జర్మనులు వస్తున్నారు. అనుక్షణం ప్రమాదం.

అన్ని ప్రమాదాలుదాటి క్షేమంగా ఒడ్డుచేరేసరికి పీటర్ పుణ్యమా అని మీసాల సైనికుడు మారిపోతాడు. పిల్లలంటే ప్రాణం. పిల్లలకోసమైనా పెళ్ళి చేసుకోవాలను-కొంటాడు. పిల్లల అనుభవం వచ్చిన యువ సైనికుడు పెళ్ళికోసం కలవరిస్తాడు. పీటర్ పాప మహిమఅది. దయ ప్రేమ కరుణ మానవులనే మార్చివేస్తవి. అది ఏ విధంగా అన్న ప్రశ్నకు "డోన్‌ట్ క్రై పీటర్" అనే యుగో



"తేనెమనసులు"లో కొత్తతారలు.

స్లావియా చిత్రం అద్భుత హాస్య కరుణ భీభత్స రసాలతో సమాధాన మిస్తుంది.


'తాతా ఒక్కప్పుడు ప్రేమికుడే!'

(చెకోస్లొవాకియా)

ఇదిరంగుల చిత్రం. టీన్ఏజెర్స్‌కు సంబంధించినది. కాలేజీ వయసులోనే ప్రేమ అంకురించడం, అదేదో తప్పు అన్నట్లు తలిదండ్రులు తమ యవ్వనకాలం సంఘటనలు మరచి పిల్లలను దండించడం ఎచ్చటైనా సహజమేకదా! "దిహాప్‌పికర్స్" అనే చెకొస్లొవాకియా చిత్రం ఈ వ్యవహారాన్ని కథాంశంగా తీసుకొని, అటు కాలేజీ కుర్రవాళ్ళను ప్రేమ తతంగంలోపడి పాఠాలు మరవవలదని ఒకచెంప హెచ్చరిస్తూ, వేరొక చెంప తలిదండ్రులను తమ పిల్లల వయసు, సహజ పరిణామాలు గ్రహించి సర్దుకుపోవలసిందే కాని తెగేదాకా లాగవద్దని సలహాయిస్తుంది.

ఈ చిత్రంలో కాలేజీ ప్రేమి

ఎస్. ఆర్. మూవీస్‌వారి "ప్రమీలార్జునీయం" లో ఎన్. టి. రామారావు





"ప్రమీలార్జునీయం"లో సరోజాదేవి.

ప్రేమికులు నాటుసరుకు కాదు. నాజూకైనవారు, నాగరికతగలవారు. విచిత్ర పరిస్థితులలో కొన్ని రాత్రిళ్ళు ఒకే గదిలో వుండవలసి వచ్చినా నియమం తప్పక, నిగ్రహం చూపి, బ్రహ్మచర్యం పాటించిన సద్గుణవంతులు. ఆ సద్గుణమే వారిని, ఎన్ని కష్టాలొచ్చినా దంపతులను చేసింది.

స్లావియా చిత్రం అద్భుత హాస్య కరుణ భీభత్స రసాలతో సమాధాన మిస్తుంది.


'తాతా ఒక్కప్పుడు ప్రేమికుడే!'

(చెకోస్లొవాకియా)

ఇదిరంగుల చిత్రం. టీన్ఏజెర్స్‌కు సంబంధించినది. కాలేజీ వయసు లోనే ప్రేమ అంకురించడం, అదేదో తప్పు అన్నట్లు తలిదండ్రులు తమ యవ్వనకాలం సంఘటనలు మరచి పిల్లలను దండించడం ఎచ్చటైనా సహజమేకదా! 'దిహాప్‌పికర్స్' అనే చెకొస్లొవాకియా ఛిత్రం ఈ వ్యవహారాన్ని కథాంశం గాతీసుకొని, అటు కాలేజీ కుర్రవాళ్ళను ప్రేమ తతంగంలోపడి పాఠాలు మరవవల దని ఒకచెంప హెచ్చరిస్తూ, వేరొక చెంప తలిదండ్రులను తమ పిల్లల వయసు, సహజ పరిణామాలు గ్రహించి సర్దుకుపోవలసిందే కాని తెగేదాకా లాగవద్దని సలహా యిస్తుంది.

ఈ చిత్రంలో కాలేజీ ప్రేమి

ఎస్. ఆర్. మూవీస్‌వారి 'ప్రమీలార్జునీయం' లో ఎన్. టి. రామారావు





"ప్రమీలార్జునీయం"లో సరోజాదేవి.

ప్రేమికులు నాటుసరుకు కాదు. నాజూకైనవారు, నాగరికతగలవారు. విచిత్ర పరిస్థితులలో కొన్ని రాత్రిళ్ళు ఒకే గదిలో వుండవలసి వచ్చినా నియమం తప్పక, నిగ్రహం చూపి, బ్రహ్మచర్యం పాటించిన సద్గుణవంతులు. ఆ సద్గుణమే వారిని, ఎన్ని కష్టాలొచ్చినా దంపతులను చేసింది.

"పద్మశ్రీ" చిత్తూరు నాగయ్య



శ్రీ వుప్పలదడియం నాగయ్య—అనగా చిత్తూరు వి. నాగయ్య—గారికి రిపబ్లిక్ దినోత్సవ సందర్భముగా డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ రాజ్యాధినేతగాకల భారత్ ప్రజా ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదమిచ్చి సత్కరించింది.

స్టేజ్ ఫేమ్ స్థానం నరసింహారావు, వయొలిన్ కింగ్ ద్వారం వేంకటస్వామి నాయుడు ఈవరకు "పద్మశ్రీ"లు అందుకొన్నారు. దక్షిణ భారత సినీ రంగంనుంచి, చలనచిత్ర సర్వకళా ప్రజ్ఞాశ్రీగా గుర్తించబడి "పద్మశ్రీ" బిరుదుపొందిన తొలి ప్రముఖుడు గాయక, సంగీత దర్శక, నటు, దర్శక, నిర్మాత శ్రీ నాగయ్య.

ఇంతటి పరిగణనపొందిన "హీరో" "భక్త" నాగయ్యకు ఫిలిం పరిశ్రమవారు ఇతర కళా రంగాలవారు చెన్నపట్నంలోను, హైదరాబాదులోను ఘన సన్మానం చేస్తున్నారు.

నాగయ్యకు సంగీతానికి చాలా దగ్గరి సంబంధం. సంగీతానికి ఏడు అంకెకూ మరీ దగ్గరి సంబంధం. స్వరాలు ఏడు. ఆ రేపల్లె కృష్ణుడు సంగీత బాలరాజు. నాగస్వరం నాగవిజయ సంగీతం.

నాగయ్య జన్మించింది ఈ రేపల్లె—(జననం 28-8-1904) సంగీత కుటుంబంలో. ఏడు నెలల పాపగా వున్నప్పుడు మంచంమీద ఒక్కడూ ఏవేవో కేకలు వేసుకొంటూ ఆత్మానందం పొందుతూవుంటే దానిని పంచుకోటానికి వచ్చింది ఓ నాగుపాము. పడగ ఎత్తింది. తల్లివచ్చి సమస్కరించింది. పాపకు నాగనామకరణం చేశారు.

ఏడవ ఏట స్కూలునాటకాలలో "భక్త ప్రహ్లాదుడు" వేషంవేశారు. సినిమా "భక్త" నాగయ్యకు పునాది అది.



"మంగమ్మ శపథం"లో ఒక శృంగార సన్నివేశం.

తండ్రి వి. ఆర్. శర్మగాయకులు. వారి ప్రోత్సాహంతో టీన్ఏజెర్ నాగయ్య చిత్తూరు పేరయ్య, సంగీత విద్వాన్ నయని పిళ్ళెలవద్ద శాస్త్రసంగీతం అభ్యసించారు.

34 వ ఏట (మళ్ళీ సంఖ్యాశాస్త్రం ప్రకారం మూడు+నాలుగు = ఏడు) మద్రాసులో హెచ్. ఎమ్. వి. గ్రామఫోన్ రికార్డులతో సంగీత ప్రసార జీవిత మారంభించారు. త్యాగరాజు కృతులతో రికార్డుల జీవితం రికార్డు ప్రారంభమైంది. ఆ యేటే రోహిణీ హెచ్. ఎమ్. రెడ్డి ఆ రికార్డులకు, ఆ విగ్రహానికి ముచ్చటపడి, "గృహలక్ష్మి" లో ఆయన కోసం ఓ దేశోద్ధారకుని పాత్ర కల్పించి న్యూథియేటర్స్ కె. సి. డేకి దక్షిణ విశిష్ట ప్రతిరూపం సృష్టించారు. తదనంతరం వాహినీ అశ్వంపై నాగయ్య సంగీత నటరాజులా స్వారీ చేశారు.

కర్ణాటకం లలితం కాదని, సినిమా స్థాయికి మరీ హెచ్చు అని వాదించినవారికి కర్ణాటకం ఎంత లలితమో "పోతన" ద్వారా నిరూపించారు.

సరళి, శాస్త్రీ, కర్ణాటక హిందూస్థానీ సంగీత సమ్మేళనము గావించి జనం మెచ్చని సంగీతం అంటూ ఏదీ వుండదని నిరూపించారు.

నాగయ్య త్యాగయ్య కృతులను చిన్న చూపుచూసిన తమిళ సంగీత విద్వాంసులకు "త్యాగయ్య" చిత్రం తీసి త్యాగయ్యగా నటించి, నాగయ్యే త్యాగయ్య,త్యాగయ్యే నాగయ్య అని భ్రమించేటట్లుచేశారు. వారికి విశాల నేత్రాలు, విశాల హృదయాలుతెప్పించారు. విశాల ప్రపంచాన్నికూడా ఆ చిత్రం చూసింది. పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సంగీత చలనచిత్రోత్సవానికి భారత్ ఏకైకప్రతినిధిచిత్రంగా "త్యాగయ్య"ను ప్రదర్శించారు, అందులో మన ద్వారం ఫిడేలు సంగీతం వుంది. ఘంటసాలకూ ఆచిత్రమే సినీ ప్రాతిపదిక.

నిన్నా మొన్నా నాగయ్య షష్టిపూర్తి జరిగినా, డబుల్ షష్టి జరిగే వరకు, ఆయన సృష్టించిన కొన్ని ఘణతులు వుంటువి.

ఇక నటన. చిత్తూరు జిల్లాబోర్డులో గుమస్తా ఉద్యోగంతో నేస్తం నెరపిన నాగయ్య చిత్తూరు రామవిలాససభ నాటకాలలో వేషాలు వేసేవారు. రామదాసులో రామదాసు పాత్రకు పెట్టింది పేరయినా స్త్రీపాత్రలుకూడా అప్పుడప్పుడు ధరించే వారు.

సినిమా రంగంలో ప్రవేశించేటప్పటికి సినిమా ఫక్తు సినిమాగా లేదు. చలన చిత్ర కళపై నాటక ప్రభావం హెచ్చుగావుంది. వాచికం, అభినయం, సంగీతం ఎక్కువగానాటక ఫక్కీ లోనే వుంటున్నవి. సినిమా సీమలోనే నాగయ్య ప్రవేశించి సినిమాలు కేవలం పద్యాలు, పాటలపైనే ఆధారపడరాదని సంస్కారయుతమైన నిగ్రహం కల నటనే సినీ నటన అని, సరళాభినయ సమన్వితమైన లలిత సంగీతం వెండితెర వెలుగు పెంచుతుందని నిరూపించారు. సినీ నటనలో నాగయ్య నవశక మారంభించారు. హెచ్. ఎమ్. రెడ్డి, బి. ఎన్. రెడ్డి, రామనాధ్, శేఖర్, కె. వి. రెడ్డి, సముద్రాల, మల్లాది రామకృష్ణశాస్త్రి మొదలైనవారు ఈయన విజయాలకు ప్రాతిపదికలుగా, అండదండలుగా వున్నారు. వీర (హీరో) వినోద, విషాద; భక్తి, వైరాగ్య; యువ, వృద్ధ భూమికలు ధరించి, లెక్కకు —ఇప్పటికి - ట్రిబుల్ సెంచరీ కొట్టడమే కాదు, లలితకళల కే "త్రీచియర్స్" అనిపించారు.

అలనాటి "సుమంగళి"లో వీరేశలింగంవంటి సంస్కరణ (వృద్ధ) వాది భూమికను ధరించినప్పుడు "ఫిల్మిండియా" బాబూరావ్‌పటేల్ ఆ చిత్రం చూచి "ఇక్కడా పాల్‌మునివున్నారు" అని వ్రాశారు. అప్పటినుంచి నాగయ్యను హాలీవుడ్ "గుడ్‌ఎర్త్" నటుడు పాల్‌మూనిగా భారతదేశం పరిగణించుతున్నది.

"విశ్వమోహిని" లో పశుపతి విలనుపాత్రధరించినా, మరోచిత్రంలో మరే భూమిక ధరించినా నాగయ్య వ్యక్తిశక్తి ముద్రవుంటుంది

"బీదలపాట్లు", "పోతన", "యోగి వేమన", "త్యాగయ్య", "చక్రధారి", "నాయిల్లు", "అమరశిల్పి జక్కన్న", "రామదాసు", ఈ, ఆ "సుమంగళి", వంటి చిత్రాలలో నాగయ్య మరుపురాని ముద్రవేశారు. అందుకే బి. నాగిరెడ్డి నాగయ్యను నటసంగీత సవ్యసాచి అని అన్నారు.

చిత్తూరు నాగయ్యను రేలంగి "భక్తిరస పోషణలో చిత్తుచేసిననటు"లన్నారు.

ఎన్. టి. రామారావు కళకు మారుపేరే నాగయ్య అని కీర్తించారు.

రంగారావు ఉద్దేశం నాగయ్య నటయుగ పురుషుడని.

పుట్టుకతోనే నటుడని కె. వి. రెడ్డి అన్నా, నటరాజు అని బి. ఎన్. భావించినా, ప్రప్రథమ నటసార్వభౌముడని పింగళి నాగేంద్రరావు ప్రశంసించినా, ఆత్మ సాక్షాత్కారం పొందిన మహానటులని టి. ఎల్. కాంతారావు కీర్తించినా నటులపైన, మహానటులపైనా నాగయ్య అభిప్రాయాలే వేరు.

నటన అనేది పుట్టుకతోనే కొందరికి వచ్చే అదృష్టం. కాని వారి నుంచి మహానటనను జలయంత్రంలా విరజిమ్మించి మహా నటులనుచేసే వారు దర్శకులుఅన్నది నాగయ్య నిశ్చితాభిప్రాయం. ఆర్టిస్ట్స్ ఆర్ బార్న్. యాక్టర్స్ ఆర్ మేడ్ అని అంటారు. తన క్లయింటులను రక్షించి వాదించే న్యాయవాదినుంచి, అప్పుల వసూళ్ళకు ఏమేమో చెప్పే వడ్డీ వ్యాపా



శ్రీనివాస్ మూవీస్ వారి
ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
"సింగపూర్ సి. ఐ. డి."లో
బి. సరోజాదేవి.

రస్తులనుంచి అందరూ నటులేనని, కాని పాల్‌మూని, బళ్ళారి రాఘవ వంటి మహానటులు కొందరే వుంటారని విడమరచి చెబుతూ వుంటారు.

ఇక మరొక విషయం మనస్సు. జీవితానికి, పాత్రధారణకు దగ్గర సంబంధం వున్నదని నాగయ్య జీవితం నిరూపిస్తుంది. బాల్యంనుంచి ప్రహ్లాదునివంటి, రామదాసువంటి భక్తుల గాథలు నాగయ్య నాకర్షించినవి. సంసార జీవితంలో దుర్భర మరణాలు చూచి, కొంతకాలం విరాగి అయి, రమణాశ్రమంలో గడిపి, తత్వబోధలు పొంది వున్నారు. అందుచేతనే భక్తి తత్వ వైరాగ్య పాత్రల నిర్వహణలో నాగయ్య నిరుపమ ప్రజ్ఞాశాలి కాగలిగారు.

సినీనటనలో ఒక్కొక్కరిది ఒక్కొక్క యెత్తు. రోజూ షూటింగ్‌లో రెండు మూడు కాల్‌షీట్‌లు వుండి రెండు మూడు రకాల పాత్రలు ధరించవలసి వుంటే కొందరు తారలు యాంత్రికంగా 'మూడ్స్' మార్చివేసేసుకోగలుగుతారు. మరికొందరు ఒక్క కాల్‌షీట్ వున్నా స్టుడియో దాటి బైటకు వచ్చిన పిదప కొంతసేపటికి కాని సంసారం మూడ్‌లో, సాధారణ మూడ్‌లో పడరు. మూడో తరగతి ఆరోజు షూటింగ్‌లో అపాత్ర ఏ మూడ్‌ది అయితే 24 గంటలూ ఆ మూడ్‌లోనే ఇంటా బయటా గడిపి అందులోనే సతమతమౌతూ వుంటారు. నిజజీవితంపై నటునాప్రభావం అంతటిది. పాత్రలో తెరపైనే కాదు, తెర వెలుపలకూడా లీనమయ్యే వారు మహానటులు. వారికి కాలంతో నిమిత్తం లేదు. కళతోనే నిమిత్తం. ఎల్లకాలమూ కళతో కళకోసం కళ పేరుతో జీవించగల చిరంజీవి చిత్తూరు వి. నాగయ్య.

చలన చిత్ర వార్తలు

ప్రమీలార్జునీయం

ఎస్. ఆర్. మూవీస్ వారి "ప్రమీలార్జునీయం" షూటింగు పూర్తి అయింది. మార్చిలోనే విడుదల కాగలదు. ప్రమీలార్జునుల పాత్రల సృష్టి, ఆయాభూమికలను సరోజాదేవి, రామారావు నిర్వహించిన విధం విశిష్టం. దర్శకుడు మల్లిఖార్జునరావు. రచన పింగళి. నిర్మాతలు నాగుమణి, ఆదిబాబు.

మారుతీ ప్రొడక్షన్స్ డిటెక్టివ్ చిత్రం

మారుతీ ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ మద్రాసులో నెలకొన్నది. మానాపురం అప్పారావు దర్శకత్వాన ఒక క్రైమ్-డిటెక్షన్ నవల ఆధారంగా వీరు ఒక తెలుగు చిత్రం నిర్మించబోతున్నారు.

రహస్యం

లలిత శివజ్యోతి వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "రహస్యం" జానపద చిత్రం షూటింగ్ ఏప్రిల్ మాసారంభంలో ప్రారంభమౌతుంది. దర్శకులు: వేదాంతం రాఘవయ్య. నాగేశ్వరరావు, రంగారావు, గుమ్మడి, కాంతారావు, నాగయ్య, రేలంగి, రమణారెడ్డి, బి. సరోజాదేవి, సూర్యకాంతం, జి. వరలక్ష్మి, గిరిజ తారాగణంలో కలరు. పాటలు: మల్లాదిరామకృష్ణశాస్త్రి. మాటలు సదాశివబ్రహ్మం. నిర్మాత శంకరరెడ్డి.

శ్రీకృష్ణ పాండవీయం

రామకృష్ణ - ఎన్. టి. కంబైన్స్ వారి "శ్రీకృష్ణ పాండవీయం" తెలుగు, తమిళ భాషలలో శరవేగంతో వాహినీలో తయారౌతున్నది. కాంతారావు నారదుడుగా, కె. ఆర్. విజయ రుక్మిణిగా కొన్ని ఘట్టాలు చిత్రీకరించారు. ప్రతినెల ఒకటి నుంచి పదవ తేదీ వరకు షూటింగ్ జరపాలని సంకల్పం. డిసెంబర్‌కు షూటింగు పూర్తి కాగలదు. కృష్ణుడుగాను, దుర్యోధనుడుగాను రామారావు నటిస్తున్నారు. రచన సముద్రాల రాఘవాచార్య.

అన్నపూర్ణావారి చిత్రం

అన్నపూర్ణా వారు ఏకబిగిని రెండు చిత్రాలకు స్క్రిప్టులు తయారు చేసి వుంచారు. ఫిబ్రవరి మాసాంతంలో దేనినిముందు సెట్టుకు దించాలో అన్న విషయం తుదిసారి తేల్చివేస్తారు. మేలో షూటింగ్ ప్రారంభమౌతుంది. వీలయితే ఏప్రిల్‌లో ఔట్‌డోర్ పని మొదలు కావచ్చు. ముఖ్యనటుడు నాగేశ్వరరావు, నిర్మాత డి. మధుసూదనరావు.

తోడు - నీడ

విజయభట్ మూవీస్ వారి "తోడు నీడ"లో మరికొంత షూటింగ్ వాహినీలో ఫిబ్రవరి ద్వితీయార్థం నుంచి జరిగింది. రామారావు, భానుమతి, ఎస్. వి. రంగారావు, నాగయ్య, రమణారెడ్డి, రావి కొండలరావు పాల్గొన్నారు, దర్శకుడు ఆదుర్తి, రచయిత : జూనియర్ సముద్రాల.

● ● ●

రవీంద్ర ఆర్ట్స్ వారి తదుపరి చిత్రం ట్రీట్‌మెంట్ దశ దాటింది... డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి "మంగమ్మ శపథం" విడుదలకు సిద్ధంగావున్నది. "వీలునామా" "పల్నాటి వీరకథ" "దేవత" "స్త్రీ" "ఆకాశరామన్న" మధుపిక్చర్స్ రెండవచిత్రం నిర్మాణం జోరుగా సాగుతున్నది. "ప్రభావతీ ప్రద్యుమ్నం", విశ్వమోహిని అనే "మోహిని భస్మాసుర"రాబోతున్నవి.

తప్పక చూడండి!



Edited and Published by V. V. Raghavaiah and Printed by him
Jyothi Press, Congress Office Road, Governorpet, Vijayawada

JYOTI MARCH'65 Regd No. H368

